
గురువులు

జీవిత చరిత్ర


రామతీర్థ స్వామి జీవితము



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

“దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం” అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన ‘ఇచ్ఛ’ (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. “నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది” అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ రామతీర్థస్వామి జీవితము

గ్రంథకర్త:

బులుసు వేంకటేశ్వర్లు, ఎం. ఏ.

ఆంధ్రోపన్యాసకుఁడు. పి. ఆర్. కాలేజీ, కాకినాడ.

"ఏకాకినై కాని యనేకులలో నుండి కాని భారతవర్షముయొక్క అజ్ఞానదైన్యములను పదేండ్లలోఁ దఱిమివైచి జీవశక్తి ప్రవహింపఁ జేసి 1950 వచ్చులోపుననే భారత దేశము నపూర్వమహోన్నతస్థితికిఁదోడ్కొని వచ్చెద నని నేనమోఘమగు ప్రతిజ్ఞ చేయుచున్నాను. ఈనామాటలు వ్రాసియుంచుకొనుఁడు." శ్రీరామతీర్థస్వామి.

ఈమాటలు సత్యములైనవి. భారతవర్షము సంపూర్ణ స్వాతంత్ర్యము నార్జించి యంతర్జాతీయముగ నిదివఱకెన్నఁడును నందియుండని మహోన్నతస్థానము నాక్రమించినది.

గ్రంథకర్త.

తొలికూర్పు : 1934
మలికూర్పు : 1950
మూఁడవకూర్పు : 1951
నాల్గవకూర్పు : 1952
ఐదవకూర్పు : 1952

జార్జి ప్రెస్సున ముద్రితము,
కాకినాడ.

మూల్యము రు 2-8-0

1952

"కావలయును:—

సంస్కర్తలు.

పరసంస్కర్తలు కాదు : ఆత్మసంస్కర్తలే.

విశ్వవిద్యాలయ పట్టభద్రులు కారు;

జితాహంకార పట్టభద్రులు.

వయస్సు:—ఆత్మానందయౌవనము.

జీతము:—బ్రహ్మైక్యము.

వెంటనే దరఖాస్తు పంపుడు—

దీనయాచనాస్తోత్రములతోఁ గాదు,

అఖండాత్మనిశ్చయముతో.

విశ్వశాసనకర్త

నీ ఆత్మస్వరూపము

అగు పరమాత్ముని సన్నిధికి.

ఓం ! ఓం ! ! ఓం ! ! !

—రామతీర్థస్వామి.

విషయసూచిక

పరిచయ వాక్యములు

ఆనందము, సుఖము, స్వారాజ్యము, సామ్రాజ్యము, నిష్కామకర్మము, ధర్మము, జ్ఞానము, సత్యము, బ్రహ్మము, సర్వము పూర్వాయోగము. ఆనందానుభవ మాత్మానుభవము. ఆత్మానుభవజ్ఞులు మహానుభావులు, విశ్వాత్ములు. మహాత్ముల దివ్యాత్మేతిహాసములు శ్రవణయోగ్యములు, మననయోగ్యములు, ధ్యానయోగ్యములు, సంకీర్తనయోగ్యములు. కామము దుఃఖప్రదము, బంధకము, సమ్మోహము. కామారాధన పరాయణంబైన ఆధునిక ప్రపంచమునం దాత్మావలంబనపరాయణులైన త్యాగమూర్తుల పవిత్రజీవితములు మానవస్వాతంత్ర్యధర్మాభ్యుదయములకు వినియోగపడఁ గలవిధమును శ్రీరామతీర్థస్వామి జీవితము విశదము చేయుచున్నది.

పాశ్చాత్యసంస్కార ప్రవాహమునందు మునిఁగి తేలుచున్న భారతీయులకు 19 వ శతాబ్దాంతమునం దాత్మసంస్కార సంస్మరణములను ప్రసాదించి కాపాడిన మహానుభావులందు శ్రీరామతీర్థస్వాములు చిరస్మరణీయులు. పరావలంబన పారతంత్ర్యవాతావరణములందు మునిఁగియున్న దేశమునం దాత్మావలంబనము స్వాతంత్ర్యవాతావరణములను వివిధజీవితరంగములందును వేదాంతసాధనమునఁ గల్పించిన మహానుభావుఁడు శ్రీరామతీర్థులు. బాల్యమునుండియును ఆత్మస్వాతంత్ర్యసిద్ధికి శ్రీరామతీర్థు లనుభవించిన కష్టములును, చేసిన మహాత్యాగమును వారిమహత్త్వమునకు ప్రమాణములు. జ్ఞానసంపన్నులైన శ్రీరామతీర్థులకు కలిమిలేములు, పట్టణారణ్యావాసములు, సుఖదుఃఖములు, భూషణదూషణములు సమానములై బ్రహ్మవిద్యాప్రాప్తికి సాధనములైనవి. శ్రీరామతీర్థులు, భక్తిజ్ఞాన వైరాగ్యములను బ్రహ్మానందప్రాప్తికి జీవయాత్రయందు సార్థ

కము చేసి సనాతన నవీనవిజ్ఞానముల నేకముఖమున పురుషార్థ సిద్ధికి వినియోగింపవలసిన విధమును సువ్యక్తముచేసి భారతీయుల కృతజ్ఞతకు పాత్రతను బడసెను. శ్రీరామతీర్థులు స్వదేశములందును, విదేశములందును పూరించిన వేదాంతశంఖారావము వారినిరుపమాన వేదాంతపరిజ్ఞానమును విశదము చేయుచు నవ్యభారతపరిణామమునకు సార్థక మగుచున్న విధమును, వారి 32 ఏండ్ల పరిశుద్ధజీవితమును, అమూల్యోపదేశములును ప్రత్యక్షము చేయుచున్నవి.

శ్రీరామతీర్థస్వామిజీవితము నాంధ్రమునందు రసభావసమన్వితముగ రచియించిన శ్రీయుత బులుసు వేంకటేశ్వర్లుగారు కృతార్థులు. గ్రంథావలోకనము గ్రంథకర్తకు శ్రీరామతీర్థస్వామిపట్లనుగల భక్తివిశ్వాసములను, బ్రహ్మజ్ఞానాభిలాషను, ఆత్మజ్ఞానానుభవమును, స్వాతంత్ర్యప్రియత్వమును, ప్రేమధర్మమును సర్వత్ర ప్రత్యక్షము చేయుచున్నది. శైలి రసవంతమై భావగర్భితమై స్వతంత్ర కావ్యమురీతిని పండితపామరులకు పఠనయోగ్యము. శ్రీరామతీర్థస్వాముల జీవితాశయములను నవజీవితాశయములందు వేదాంతార్థమూలమునను సమన్వయము చేయుటయందు శ్రీ వేంకటేశ్వర్లుగారు చూపిన పరిజ్ఞానము శ్లాఘ్యముగ నున్నది. ఆంధ్రభాషాభిమానులును, స్వాతంత్ర్యప్రియులును నీగ్రంథము నాదరించి కృతార్థులగుదురుగాత!

నా కీసద్గ్రంథమునకు పరిచయవాక్యములను వ్రాయుటకవకాశమును గల్పించి గౌరవించినందులకు కృతజ్ఞుఁడను.

చెన్నపురి,
5—1—1935.

కాశీనాథుని నాగేశ్వరరావు.

ఐదవ ముద్రణము

తొలిపలుకు

శ్రీరామతీర్థస్వామి జీవితమును నేను మొట్టమొదట 1934 సంవత్సరమున రచించి ప్రకటించితిని. ఆంధ్రమహాశయు లమి తాదరాభిమానముల నాగ్రంథముపైఁ జూపియుండిరి. 1950, 1952 సంవత్సరములలో దీనిని పునర్ముద్రించి యాంధ్రావని కరకమలముల కర్పింపఁగంటిని.

తపోనుష్ఠానసిద్ధులచే మానవకోటికిఁగల శాశ్వతసమస్య లను సాధించి చక్కఁగఁ బరిష్కరించి బోధించిన మహాత్ముల జీవితములు, వారివాక్యములు నిత్యనూతనములు, సార్వకాలిక ములు, విశ్వజనీనములు. అందుచే శ్రీరామతీర్థుల యమృత జీవితోపదేశములకుఁ బునర్ముద్రణావసరము కలుగుచునే యుండు ననుట వింతకాదు. నాస్తికఝంఝానిలములు ప్రజాహృదయ ముల నుఱ్ఱూఁత లూఁగించు నేఁటికాలమున ముఖ్యముగా నిట్టి మహనీయులసందేశములు దేశమునకు విద్యార్థిలోకము నకును ఆదరస్తుతిపాత్రము లనుటలో సందేహములేదు. దీనిని గ్రహించి ఆంధ్రవిశ్వవిద్యాలయమువారు దీనిని 'ఇంటర్మీడి యటు' తరగతికిఁ బాఠ్యమొనరించి యాదరించినందులకుఁ గృతజ్ఞుఁడను. ఈ యైదవముద్రణము త్వరలో ఆఱవముద్రణము నకు దారితీయఁగలదని యాశించుచున్నాను.

రామారావుపేట,
కాకినాడ,
15—8—52.

ఇట్లు,
బుధవిధేయుఁడు,
బులుసు వేంకటేశ్వర్లు, ఎం. ఏ.



శ్రీ రామతీర్థస్వామి

[1903 అమెరికాలో]



శ్రీ రామతీర్థస్వామి

[అరణ్యవాసమున]

(*With kind courtesy of Swami Kesava Tirtha.*)

ఓం నమో బ్రహ్మణే.

శ్రీ రామతీర్థస్వామి జీవితము

జ న న ము

కొన్నిశతాబ్దములనుండి కాఱుచీకట్లు క్రమ్మిన భారతాకాశమున విశ్వదృష్టికి మిఱుమిట్లుగొల్పు తేజోగోళము లుద్భవించి ప్రకాశించినవి. ఆశాభగ్నమై యడలుచున్న యార్యజాతి నసమాన ప్రజ్ఞాధైర్యసాహస పూర్ణ శంఖారవముచే మేలొల్పి, అజ్ఞాన మాధ్యాహంకార కలుషితమైన పశ్చిమ ప్రపంచమును జీవమోక్షసంధాయక శాంతిగీతాలహరిచేఁ బునీతమొనర్చి, కామకాంచన వాంఛాదాసత్వముచే మానవకోటి ముఖవీధుల వెల్లువలై ప్రవహించు దుఃఖాశ్రుబిందు సందోహమును దమ పరిశుద్ధవైరాగ్య మలయానిలములచే రగుల్కొల్పిన నిస్తులత్యాగాగ్నిజ్వాలల వేఁడిమిచే హరించివైచి, చిరసంస్మరణీయ ధన్యజీవితములఁ బ్రదర్శించినకొలఁది మంది పావనమూర్తులీ మహర్షిభూమిని నేఁ డలంకరించిరి.

పందొమ్మిదవ శతాబ్దములో నార్యావర్తమున జన్మించి, అధ్యాత్మ విద్యారహస్యముల నామూలాగ్రి మెఱిఁగి నిత్యానుష్ఠానసిద్ధులై, వెల్గొందినపురుషపుంగవులలో ముఖ్యులు మువ్వురు. ఇం దగ్రస్థాన మాక్రమించిన పావనమూర్తి శ్రీరామకృష్ణపరమహంస. ఈపుణ్యమూర్తి కలకత్తాలోని దక్షిణేశ్వరవనవాటికను

విడిచి యెచ్చటికి నేఁగకున్నను, ఈతని విమలహృదయమం దుద్భవించిన జ్ఞానభక్తి వైరాగ్యవాసనలు, పర్వతములు దాఁటి సాగరము లీఁది దేశదేశాంతరముల నలముకొనినవి.

పరమహంస ప్రదర్శించిన భారతబ్రహ్మ విద్యాసామ్రాజ్యమునకు వారసుఁడై జన్మించిన రెండవవ్యక్తి శ్రీవివేకానంద స్వామి. మాయామూర్ఛిత మానవప్రపంచమున కాత్మజ్ఞానామృతధారలచేఁ బునరుజ్జీవన మొసంగిన మహాపురుషుఁడు వివేకానందుఁడు. క్రుంగి, కృశించి, కూలుటకు సిద్ధమైన భారతజనని యచంచల వివేకానంద భుజపీఠములపై నిలఁబడి, నవనవోద్రేక సాహసములతో నవ్వినది. ఆకులు రాలి, కొమ్మలు విఱిగి, మోడు వాఱిన హిందూమతవృక్షరాజము వివేకానంద విమలగీతా నినాద మాధురీఝురు లాని, వసంతారంభమునఁబోలె, నూత్న పల్లవముల నీనినది. తాటియాకుల దాఁగి, చెదలచే మ్రింగఁబడిన భారతబ్రహ్మర్షి వాణి, వివేకానందముఖమున భూనభోంతరాళము లేక మగురీతి మాఱుమ్రోఁగినది.

శ్రీరామకృష్ణవివేకానందుల దివ్యజ్ఞాన సందేశామృత సారము ముద్దయై, మూర్తీభవించిన ముద్దుబిడ్డఁడే శ్రీరామతీర్థ స్వామి. ఈ మహాత్ముఁడు జీవించినకాలము ముప్పదిరెండువత్సరములే! ఈతని బ్రహ్మజ్ఞానవాణి లోకమున మ్రోఁగినది మూఁడేండ్లే! మేఘమధ్యమున మెఱపుఁదీఁగవలె; ఈదివ్యమూర్తి యొక్కసారి మెఱసి, విరమించెను. కాని యాబ్రహ్మానంద ముద్రితమోహనమూర్తిని దర్శించిన అమెరికా, జపాన్, భారత వర్షములు, మోహోద్రేకముల మూర్ఛిల్లినవి. ఆమెఱపులోని

తళతళ లించను ఆస్తికప్రపంచరంగమునఁ దాండవమాడుచునే యున్నవి. పరమహంసలోని నిశ్చంచలభక్తి, నిగూఢజ్ఞానము లు, వివేకానందునిలోని అఖండప్రజ్ఞానైశిత్యము, అనర్గళగంగాప్రవాహతుల్యవాగ్ధార, స్వచ్ఛస్వదేశాభిమానతన్మయత్వము, నిరువురిలోని సర్వేశ్వరసాక్షాత్కారసిద్ధి, శ్రీరామతీర్థునియందు మేళవించి, పెంపొంది పొరలిపాఱినవి.

అన్నివిధముల నణఁగద్రొక్కఁబడి, యధః పతితమైన భారతవర్షము, సజీవమై యున్న దని, లోకసందేశ మీయఁగల శక్తిసాహసములకు విజ్ఞానవీర్యముల కిందుఁ గొఱఁత లేదని ప్రేలెత్తి నిరాఘాటముగాఁ జాటుధర్మపుతాగ్రేసరుల నుద్భవింపఁ జేయఁగలదని, యమోఘముగా, నిస్సంశయముగాఁ జాటి మనవారదుర్ణయమాంద్యమునఁ బడిన పశ్చిమ ప్రపంచముచే గుర్తింపఁజేసిన మన కథానాయకుఁడగు శ్రీరామతీర్థస్వామి జీవితచర్యలఁ దిలకించుటకు ముందా పరమపీరుని పావనవంశవృత్తాంతము నెఱుంగుట ముఖ్యావశ్యకము.

పంజాబురాష్ట్రములోని 'గుజరన్వాలా' జిల్లాకుఁజెందిన 'మురళీవాలా' యను పల్లెటూరిలో, 1873 వ సంవత్సరము అక్టోబరు 22వ తేదీ బుధవారము మనరామతీర్థుఁడు జన్మించెను. రఘుకుల రామచంద్రుని కులగురువగు వసిష్ఠమహర్షి వంశమునకుఁజెందిన స్వచ్ఛబ్రాహ్మణ కుటుంబములో నీతఁ డుదయించెను. భగవద్భక్తి వఱదలై, పొరలి పాఱునట్లు, హిందీభాషలో శ్రీ మద్రామాయణమును రచించి, జగద్విఖ్యాతిఁగాంచిన భారతభక్తాగ్రేసరుఁడు తులసీ దా సీవంశములోనివాఁడే.

శ్రీరామతీర్థస్వామి జీవితము

రామతీర్థస్వామి జనకుని పేరు "హీరానందుఁడు." ఇతఁడు కడు దరిద్రుఁడు. ప్రజ లభిమానముచే నిచ్చు గౌరవదానాదిక ములచే నీతఁడు కుటుంబపోషణము చేయుచుండువాఁడు. రామ తీర్థుఁడు పుట్టినకొలఁదిదినములకే యీతనితల్లి స్వర్గస్థురాలయ్యెను. తనగర్భమున నుద్భవించిన యీబాలుఁడు విశ్వలోకవంద్యుఁడగు నని యా యిల్లాలెఱుఁగునో యెఱుఁగదో! పెద్దన్నయగు గురుదాసు, ముదుసలి మేనత్తయగు నొక నారీమణియు మనరా ముని బెంచి పెద్దవానిని జేసిరి.

పసిబిడ్డకుఁ దల్లిలేనిలోటు నెవరుతీర్చ గలరు? పుట్టిన కుటుంబమా దరిద్రదేవతానిలయము! సహజప్రేమామృతము స్తన్యముతోఁ గలిపియిచ్చు కన్నతల్లియా కడుపారఁ గన్న బాలుని గన్నారఁ జూచుకొను భాగ్యమైన లేకుండ మరణించి నది! ఇఁక నీదిక్కులేనిబాలుఁ డెట్లు పెరుగును? వృద్ధవనితయగు మేనత్త రామతీర్థు నావుపాలుపోసి పెంచినది. ఈవనితభక్తురాలు; పతివ్రతాతిలకము. దినదిన మీమె యాలయములకు దేవతా దర్శనమునకై పోవుచుఁ జంటిపిల్లవానిని జంకనెత్తుకొని వెడలు చుండెడిది. ఆలయములో జరుగు ప్రార్థనలు, కీర్తనలు, మంగళ తూర్యనినాదములు, హారతులు, ఇవి చూచినంతనే వెక్కి వెక్కి యేడ్చుచున్న బాలుఁడు, దుఃఖము మాని, కుతూహల ముతోఁ దిలకించువాఁడు. ఆటబొమ్మలు, మిఠాయిదినుసులు నవలఁ దోసి, యాలయమువైపు తన్నుఁ దీసికొనిపొమ్మని యీతఁడు మేనత్తకు వ్రేలు చూపువాఁడు.

బా ల్య ద శ

సన్న్యాసాశ్రమమందుఁ గాల్పెట్టుదాఁక మనరామతీర్థుని మనము రాముఁ డనియే పేర్కొందము. దివ్యకుసుమమునందలి లోకాతీతసౌరభము మొగ్గలోనే తెలియునట్లు తల్లిపాలు లేక, ఆవుపాలుపడక, శల్యగతప్రాణియై యున్న రెండేండ్లబాలుఁడగు మనరాముఁడు, దేవాలయములో జరుగు రామకథాకాలక్షేప మందే కుతూహలచిత్తుఁడై యుండుటఁ గాంచిన నాతని భావి మహోన్నతజీవిత మూహాతీతము కాదు.

అక్షరబ్రహ్మవిద్యాధురీణుఁ డగురాముని కైదవయేఁట నక్షరాభ్యాసము జరిగెను. స్వగ్రామ మగు " మురళీవాలా " లోని వీధిబడి కాతఁడు పోవుచుండువాఁడు. ఐదవతరగతిలో నుండఁగనే, పర్షియనుభాషలోని రెండుగ్రంథములను, ఉర్దు గీతములను పెక్కింటి నాతఁడు కంఠస్థ మొనర్చుటచేతనే కాక, దినదినము నాలయములోఁ జదువఁగా విన్నపురాణశ్లోకముల నింటికి వచ్చి, యొప్పగించుటచే నీబాలునికిఁ గలమేధాసంపత్తి, విద్యార్జనలాలసత్వము, జ్ఞాపకశక్తి తెలియఁగలవు. మనరామున కాట లన్న నసహ్యము. బడి విడుచుటతోడనే పురాణములు విన్నుటకై పోయి, భారతరామాయణకథల నుత్సాహపరిపూర్ణుఁ డై వినుచుండువాఁడు. ఒకసారి విన్నసంగతి నాతఁ డెన్నఁడు మఱచి యెఱుఁగఁడు.

పదేండ్లు నిండునప్పటికి రాముఁ డైదవతరగతి పూర్తి చేసి, స్వగ్రామమున కేడుమైళ్ళదూరమున నున్న గుజరన్వాలా

లోని ప్రాథమికోన్నతపాఠశాలలోఁ జేరెను. గుజరన్వాలాలో నీతనిని దండి తనకు మిత్రుఁడగు భగవద్ధనరామాజీ యను గురువున కొప్పగించెను. కొన్ని వత్సరములు గడచిన వెనుక నీగురువే మన రామున కాధ్యాత్మికవిద్యాప్రదాతకూడ నయి, రామునిచే విశేషము మెప్పుపొందినాఁడు. గురువునెడ రాముఁడు చూపిన భక్తివిశ్వాసము లప్రతిమానములు. సమస్త విషయములలో రాముఁడు, గురువునే తండ్రిగా, తల్లిగా, బంధువుగా, దైవముగా నారాధించి, తాను పట్టభద్రుఁడగు లోపున నించుమించుగా నొకవేయిలేఖలను గురువునకు వ్రాసి యున్నాఁడు.

రామునకుఁ బదవయేఁటనే వివాహము జరిగినది. గుజరన్వాలా జిల్లాలోని వాజీరబాదాతాలూకాకుఁ జెందిన 'విరోకి' యను గ్రామముననున్న రామచంద్రపండితుని కుమారి మన రామునిల్లాలు. రాముని కింతబాల్యములో వివాహమగుటకు రాముఁడు బాధ్యుఁడుకాఁడు. పెరిఁగి పెద్దయై, భారతసాంఘిక ధర్మములను దిద్దునాఁడు రామతీర్థస్వామి, బాల్యవివాహములను గఠినముగా దూషించియున్నాఁడు. విద్యారంభము కాకుండఁగనే జరిగిన యీ బాల్యవివాహమువలన మన రాముఁడు కళాశాల తరగతులలోఁ జదువుచున్నపుడు పడినయాతనలు భరింపరానివి. కష్టాగ్ని జ్వాలలఁ గాలితో నలిపి, యార్పివైచు సాహసము గలస్వామి. యీభారము నంతగా లెక్కచేయలేదు కాని, యాతనిస్థితిలో సామాన్యమానవుఁడున్న నాత్మహత్యను వరించియుండెడివాఁడే.

పదునైదేండ్లు వచ్చునప్పటికే రాముఁడు 'మెట్రిక్యులేషన్' పరీక్షయందుఁ దన పాఠశాలలో నగ్రస్థానమును, విశ్వవిద్యాలయమునందు ముప్పదియెనిమిదవ స్థానమును బడయఁ గలిగెను. ఈతని ప్రధానస్థానమునకు మెచ్చి, గుజరన్వాలా పట్టణసంఘమువా రీతనికిఁ గళాశాలలోఁ జదువుటకు గొంతధన మొసఁగిరి.

ఇఁక రామునిమార్గము కంటకారణ్యమే. ఆతనికి జ్ఞానతృష్ణ యనంతము; మేధాసంపత్తి సునిశితము; కాని, ధనసాహాయ్యము లేదు; సంసారభారముకూడ మీఁదఁబడినది. రాముఁడు మహాసాగరము దాఁటవలసివచ్చినది. కష్టసాగరమున కీతఁడు వంతెన నెట్లు నిర్మించినాఁడో ముందు చూతము.

కళాశాలా దినములు

రామునిది పదియాఱేండ్ల లేఁతవయస్సు. కన్న కుటుంబ మాతనికి భోజన మిడలేనిస్థితిలో నుండుటయే కాక, పోషణమునకును నాతనిమీఁదనే యాధారపడియున్నది. అతఁడు చేరినది లాహోరు కళాశాల. కళాశాలా విద్యార్థికి వలయుధనము వందలలో లెక్క. రామునితండ్రి కుమారు నీపాటికిఁ జదువు చాలించి, యేదైన నుద్యోగమునఁ జేరి కుటుంబము పోషింపుమని బలవంతపెట్టెను. గోరుచుట్టుమీఁది రోఁకటిపోటువలె, రాముని భార్యయు నప్పుడే కాపురమునకు వచ్చెను. పైపెచ్చు రామునికిఁగల యున్నత విద్యాభ్యాసవాంఛకు హద్దులు లేవు. ఇట్టి

స్థితిలో మన రాముని మానసికవ్యథ, యా రఘురామునికే తెలియ వలయును.

కాని, రామునికిఁగల వ్యక్తిత్వము గొప్పది. చదువు చాలించి, స్వల్పవేతనమున నెచటనో దాస్యముచేసి, కుటుంబ పోషణలోఁ బడి, కాలక్షేపముచేసిన నీతనిచరిత్రము మనకుఁ గాదుకదా, ఊరివారికైననుఁ దెలియక యుండెడిది. కాని, రాముఁ డట్టి యనామకుఁడై, గతించుటకు జన్మింపలేదు. ఈశ్వరసందేశవాణి యాతని గంభీరకంఠమునుండి బయల్వెడలి, విశ్వవిముక్తికై ఘోషింపవలసియున్నది. ఇది భగవదాదేశము. "సూర్యుడు నాశాసనముచే వణఁకుచు నుదయించుచున్నాఁడు; వాయువు నాకు సేవచేయుటకై వీఁచుచున్నది; సాగరములు నాపీనులకు విందొనర్ప, నిరంతర ఘోషాగాన మొనర్చుచున్న" వని పల్కిన యాసాహసమూర్తికిఁ గుటుంబములో వచ్చిన కొన్ని చిన్న సవరణ లొక్క లెక్కయా?

తండ్రికోరికకు వ్యతిరేకముగా రాముఁడు బయలుదేఱి వెడలి కళాశాలలోఁ జేరెను. నాఁడు మొదలీతనిపైఁ దండ్రికిఁ బట్టరానికోపము వచ్చెను. "నీభార్యను గూడఁ దీసికొనిపొమ్ము. ఇచటఁ బోషించువా రెవ్వరును లే"రని తండ్రి చెప్పివేసెను. చేతఁ జిల్లిగవ్వయైననులేక, జనకుని క్రోధమునకు గుఱియై రాముఁడు భార్యాసమేతుఁడై, విద్యాభ్యాసము నిమిత్తము లాహోరు చేరెను.

దయ్యములైనను నివసించుటకు భయపడు నొకపాడు గృహములో నొకభాగము నద్దెకుఁ దీసికొని, యందు భార్యా

భర్త లిరువురు చేరినారు. గుజరన్వాలాపట్టణసమితివారొసంగు నుచితవేతనమునకుఁదోడు, ఇరువురు మువ్వురు బడిబాలురకుఁ బాఠములు చెప్పి, రాముఁ డెట్లో దినములు సాగింప మొదలు పెట్టెను. కొన్నిదినములు వారియింటఁ బొయ్యిలో నిప్పులేదు. పొయ్యిక్రిందకుఁ గట్టెలు లేవు; పొయ్యిమీఁదకు బియ్యమును లేవు. రాముఁ డెట్లో కష్టపడి, రెండు రొట్టెలు తెచ్చి భార్య కొసఁగి, తాను పస్తుండువాఁడు.

ఇట్లొకయేఁడు గడచినది. ఎంత యల్పమైనను, తండ్రి హృదయము పుత్రుని కష్టపరంపరలను జూచి సహింపఁగలదా ? రామునితండ్రి హీరానందుఁడు దారిద్ర్యదోషముచేఁ బుత్రు నట్టిడుమలఁ బెట్టెనేకాని, సహజక్రోధముచేఁ గాదు. వేసఁగి సెలవుల కింటికి వచ్చియుండవలసిన దని తండ్రి రామునికి లేఖ వ్రాసెను. రాముఁడు నిజముగా రాముఁడే! పదునాల్గేండ్లు వన వాసము చేసి రమ్మని, దశరథుఁ డాజ్ఞ యొసఁగినపుడు, సీతా సమేతుఁడై వనవాటికి బయలుదేఱు నా దివ్యసమయమున, రాముని ముఖమందుఁ దాండవమాడిన యసంతశాంతిముద్ర, పరిస్థితుల కెన్నఁడును లొంగని యతిలోకదరహాసచంద్రికావిలా సము, నివియే భార్యను దోడ్కొని లాహోరు పొమ్మనినపుడు మన రాముని ముఖసరోజము నలంకరించినవి. పరిస్థితు లెట్లు న్నను, సహజానందము గల హృదయమే మన రామునిది. నేఁడు తండ్రి రమ్మని వ్రాసినపుడు, వెడలకుండుటకుఁ గారణము చదువు పాడగుననియే. స్వగ్రామములో బంధువుల సమక్షమున నున్నచో, ఏకాంతసేవ, తదేకదృష్టి, దీక్ష యివి యసంభవ

మని రాముఁ డెఱుఁగును. అందుచే రాముఁ డింటికిఁ బోనిచ్చ
గింపలేదు.

1890 వ సంవత్సరములో రాముఁడు, యఫ్. ఏ. పరీ
క్షలో విశ్వవిద్యాలయమునకే ప్రథముఁడుగా నుత్తీర్ణుఁడయ్యెను.
కాని, శ్రమపడి చదువుటచే, నీతని యారోగ్యము చెడినది.
కోపము విడిచి, తండ్రి వచ్చి యీతనిభార్య నింటికిఁ గొనిపో
యెను. ప్రభుత్వమువారి యుచితవేతనము రామునికి లభించి
నది. ఇఁక రెండేండ్లు రాముఁడు పట్టపరీక్షకుఁ జదువవలసి
యున్నది.

పట్టపరీక్షకు వలయుగ్రంథములవెల యధికమగుటచే
వాని గొనుటకు విశేషధనము కావలసి వచ్చినది. అదియుఁ
గాక, రాముఁడు, తనభార్యను దండ్రిని బోషించుటకుఁ గొంత
పైక మింటికి నెలనెలకుఁ బంపవలసివచ్చినది. కట్టుకొనుట కాత
నికి దుస్తులు లేవు. వంటపూఁటింటి కిచ్చుటకుఁ గొంతధనము
కూడ నవసరము. స్వల్పవ్యయముతో పచ్చ ముదుకనేఁతబట్ట
లనే యాతఁడు ధరించువాఁడు..

ఒకనాఁడు రామునింట దొంగలుపడి, ఆతనిపెట్టె,
పఱుపు, పాత్రలు పట్టుకొనిపోయిరి. రామునికిఁగల యాస్తికి
దొంగలుకూడను ! పుస్తకములు పోలేదని రాముఁ డెంతయో
సంతసించినాఁడు. కాని, కట్టుకొనుటకు వస్త్రములు లేవు. చేతి
లోఁ బైస లేదు. మనరాముఁడు సర్వకాలసర్వావస్థలయందు
శ్రీరామ సాహాయ్యముమీఁదనే యాధారపడువాఁడు. భక్తా
ధీనుఁ డగు శ్రీరామచంద్రుఁడు వెంటనే మనరామునికి మేలు-

చేసెను. మఱునాఁ డుదయమున, మనరాముఁడు కళాశాల కరుగఁగాఁ, గళాశాలాధ్యక్షుఁ డేఁబదిమూఁడురూప్యము లొక పొట్లము కట్టి రామునిఁ దన గదిలోనికిఁ బిలిపించి, చేతిలోఁ బెట్టినాఁడు. రాముఁ డదిచూచి యాశ్చర్యచకితుఁడై, యంత ధనము తన కవసరము లేదనియుఁ గొంతచాలుననియుఁ జెప్పెను. కాని, కళాశాలాధ్యక్షుఁ డందుల కంగీకరింపక, యంతయు నిచ్చి పంపివేసెను.

ఒకనాఁ డొకచిత్రము జరిగెను. రాముఁడు రాత్రివేళ పాలు కొని త్రాగుటకై బజారున కరుగ మధ్య నెచటనో యొక కాలిచెప్పు జాఱిపోయెను. ఇహలోకసామ్రాజ్యాధిపత్య మొసంగినను వలదని, సమస్తసుఖములను త్యాగ మొనర్చిన మన రాముఁ డాకాలి చెప్పునకై చాలసేపు వెదకెను. కాని, అది కనఁబడలేదు. మఱునాఁడుదయమునఁ గళాశాల కరుగుట కాతని రెండవకాలికి జోడులేదు. చివికి, చెదపట్టి, యింటనొక ముదుసలిచె ప్పొకమూల పడియుండఁజూచి, దానిని సవరించి, కాలికిఁ దగిలించుకొని, యెట్లో రాముఁడు కళాశాల కరిగెను. ఆహా! రాము నెంతదారిద్ర్యము వరించినది! ఆ మఱునాఁడు రాముఁడు బజారునకు వెడలి తొమ్మిదణాల మూఁడుపైసలతో నొక క్రొత్తజోడు కొనుక్కొనెను.

విద్యార్థిదశ : రాముని లక్షణములు

కష్టసాగరమునఁ బడి గజేంద్రధీరత్వముతో నీఁదు రామునికి విద్యార్థిదశలోనే దిగ్దిగంతవ్యాప్తయశోవిశాలుఁ డగు భావిరామతీర్థస్వామిని దయారుచేసి లోకమున కప్పగింపఁగల

గుణరాజము లేమి పొడచూపిన వని యడుగుటలో నుత్సాహ ము కలుగకపోదు. అఖిలభారత జాతీయతత్త్వము నెఱిఁగి జాతి యనుభవించుచున్న దుర్భరదుఃస్థితిలో నుండి లేవనెత్తుటకు వలయు సాహసాంకురము లాతనియందు మొలక లెత్తుటకు వలయు సామగ్రిలు పరిపక్వదశ నందుచున్నవి. అన్నిటికన్న ముఖ్య మాతనిలో బయలుదేఱిన జ్ఞాన తృష్ణ మొదట గణితశాస్త్రముమీఁదికిఁ బర్విడి, సంతృప్తిగనక సృష్టిరహస్య తత్త్వము నెఱుఁగుటనలనఁ దప్ప వేఱొకతత్త్వమున శాంతి, సంతృప్తి, యానందములు లభింపవని స్పష్టముగాఁ గాంచి నది. జగత్సత్యము నెఱిఁగి, యర్థము చేసికొనఁజాలనపు డీక నెన్నిటిని దర్శించి పెల్లగించిన నేమి ప్రయోజనమని యాతఁ డప్పుడే గ్రహించెను. ఇట్టి యూహలతో నాతనిబుద్ధి సంపూర్ణ వికాసమందినది. పరమేశ్వరతత్త్వ నిర్ణయసమస్య నెదుర్కొని నపుడు కలుగు ధీవికాసమే నిజమగు వికాసము. ఏలన, నదియే యత్యున్నత సమస్య. ఈ సమస్య కట్టెదుటఁ గన్పట్టిన యా వ్యక్తికి లోకములోని సమస్తవిషయములం దరుచి కల్గును. సామ్రాజ్యశాసనాధిపతి మస్తకముపైఁ దళతళమని మెఱయు వజ్రకిరీటము, అఖిలకల్మషముల కాలవాలమైన పాడుదొడ్డిలోఁ బెరిగిన కుక్కగొడుగు నాతని విశాలదృష్టిలో సమానముగాఁ గన్పట్టును. ఏలన, నారెండువస్తువుల రహస్యము నాతనికి సమస్యయే. ఈదృష్టితోఁ బరికించిన లోకమునం దసహనబుద్ధి, ద్వేషము కల్గుటకుబదులు ప్రేమాదరణములు, అభిమానోత్సా హములు కల్గును.

మనరామున కీప్రపంచములో నున్న ప్రతిప్రాణిపై మొదటినుండి ప్రేమదృష్టియే కలిగినది. ఎట్టి యసందర్భక్లిష్టపరిస్థితులు నాతని యీసమదృష్టికిఁ జలనము కలుగఁజేయలేకపోయినవి. కొంతధనము పంపుమని తండ్రి రామునికొక లేఖవ్రాసి రాముఁడు పంపు టాలస్యముచేసినందునఁ గ్రోధముచే దూషించుచు నింకొకలేఖవ్రాసెను. దానికి రాముఁడీ క్రింది విధమున జవాబొసఁగెను. “తండ్రీ! ఔను! నీకుఁ గోపము వచ్చినది. అనుభవహీనుఁడైన నాబోఁటి కుఱ్ఱవానిని క్షమించి, నా తప్పులు మన్నింపుము. పరుగిడుట నేర్చుకొనవలెనన్నఁ బడుచుండుటయు నవసరమే. ఈఁతనేర్చుకొనువాఁడు మునిఁగిన మునుఁగవచ్చును. నీకు సొమ్ము కావలసినయెడల నేను పంపెదను. ఈసంవత్సరము నూతనగ్రంథములకొఱకేమియు నేను ధనము వెచ్చింపలేదు. చదువునకు వలయువానినే కొంటిని.” రాముఁడెట్టి దుర్భర కష్టసమయములలో నుండి, యెంత ప్రేమామృతవచనములు వ్రాసెనో తిలకింపుఁడు. గంభీరసాగరములో ఱాయిపడినఁ జలించునా? రామునిహృదయము చలనరహితమైన నిండుకుండ. పరిస్థితు లాతనిసేవ చేయవలసినదే కాని, పరిస్థితుల కాతఁడు లొంగఁడు. ఈ నిశ్చంచల నిష్కల్మష గుణరాజమే రాముని, నిఖిల భారతపూజ్యుఁడగు రామతీర్థస్వామిని జేసివైచినది.

ఒకనాఁడు కళాశాలాధ్యక్షుఁడగు బేల్‌దొర తన గుఱ్ఱపు బండిలో రామునిఁ దోడ్కొని విహారమున కరిగి, “నీవు చదువు పూర్తియైనవెనుక నేమిచేయ సంకల్పించితి” వని ప్రశ్నించెను. మన రాముని ప్రత్యుత్తరమిది; “నా భావిజీవిత కార్యక్రమ

మునుగూర్చి నాకెట్టియూహలును లేవు. నే నెన్నఁడైనఁ గోరి నచో నా కొకటే కోరిక యున్నది. మానవసేవామూలమున సర్వేశ్వరునారాధించుటయే. నాజీవితములోని ప్రతినిమిషమును, భగవత్సేవానిమిత్త మర్పణముచేయుటయే నా పరిపూర్ణ వాంఛ." నేఁటి భారతదేశ కళాశాలలలో నీ వాక్యము పలుకఁ గల విద్యార్థు లెంద ఉన్నారు? "మానవ కళ్యాణమునకై నాజీవితమును బలిపెట్టుటయే నా విద్యాభిలాష"యని నుడివిన నాఁడే రాముఁడు, భారతమహర్షి ప్రపంచ సందేశమును హృదయమునం దణఁచిపెట్టి యుంచినాఁడు. ఆసందేశము బయల్వెడుటకుఁ గొలఁదికాలమే పట్టినసంగతి మనము ముందుఁ జూడఁ గలము.

దేశభక్తి యన, "నా దేశము, నా రాజ్య"మని కంఠ నాళములు తెగునట్లు సభావేదికలపైఁ గేకలిడుటే యని నమ్ము వారలలో రాముఁడు చేరఁడు. తాత్కాలికావేశములచే నన వసరములగు నార్భాటములలో శక్తిని వ్యయించి, కార్యరంగ మునఁ గాలుపెట్టవలసివచ్చినపుడు కనఁబడకపోవుట దేశభక్తి లోఁ జేరదు. ఉపన్యాసముల విచుటచే వచ్చు నుత్సాహము తాటియాకులమంట, అది నిల్చి యుండదు. పరాజితజాతి పరిభ వానలము హృదయమునఁ జొచ్చి, శరీరములోని ప్రతినరమును గార్చిచ్చువలెఁ గాల్చునపుడే గాఢ స్వదేశాభిమాన ముద్భవిం చును. అట్టియభిమానమే, జాతిదాస్యము నిశ్శేషముగా నిర్మూల మగువఱకు నిలిచివెలుఁగునది. ఇదియే నాయకున కుండు లక్ష ణము. అది 1893 డిసెంబరు 25 వ తేదీ. బ్రిటిష్ పార్లమెంటు

సభ్యుఁడు, దేశభక్తాగ్రేసరుఁడునైన శ్రీదాదాభాయి నౌరోజీ, ఇంగ్లాండునుండి స్వదేశమునకు వచ్చి బొంబాయిలో దిగినాఁడు. నాఁటి పరిస్థితులను రాముఁ డిట్లు వర్ణించియున్నాఁడు. "బొంబాయినగరము, దాదాభాయి నౌరోజీ పండితున కఖండమగు స్వాగతమొసఁగినది. ప్రజలలో నావిర్భవించిన యావేశ మహావాయువు బొంబాయినగరము నుఱ్ఱూఁత లూఁగించినది. మహాపదవి యానాయకునకు కాంగ్రెసువారొసంగి పూజించిరి. నగరములోఁ బెక్కుచోట్ల బంగారుమలాము చేసినతోరణములు కట్టిరి. నాయకోత్తముఁడగు నాతనిని వీథులవెంబడి నూరేఁగించుచు జనసమూహములు చెలరేగినవి. ఊరేఁగింపు నడచుకొలఁది జనప్రవాహము కోలాహలమై, పట్టపగ్గములు లేకయున్నది. కాని, యీ యాందోళన మేవిధమునను నన్నుఁ బురికొల్పలేదు. ఈయానంద మంతయు నెందుకొఱకు ? నాఁటి నా యావేశరహితావస్థకు నేను సంతసించి పరమేశ్వరునకుఁ గృతజ్ఞతఁ దెలిపితిని." క్రియాశూన్యమగు శుష్కావేశము నిరర్థకము. హృదయములో నువ్వెత్తుగఁ బొంగిన యావేశతరంగమును, సాగరమునఁ బడకుండ, నడ్డుకట్టి, పంటపొలములమీఁదికిఁ బ్రవహింపఁజేయుటయే ప్రజ్ఞావంతుల సహజలక్షణము.

రాముని బి. ఏ; యం. ఏ. తరగతులు

మనరాముఁ డష్టకష్టములఁ బడి, చదువునకై కొన్ని దినములు నిరశనుఁడుగూడనై బి. ఏ. పరీక్ష వ్రాసినాఁడు. విశ్వవిద్యాలయములో నీతని కగ్రసంఖ్యగల మార్కులే వచ్చినవి.

కాని, ఆంగ్లములో మూఁడుమార్కులు తగ్గినవి. పరీక్ష పోయినది. మన రాముఁడు మఱల నొక యేఁడజ్ఞాతవాసము చేయవలసివచ్చినది. పరీక్షలో నపజయము పొందినాఁడని, రామునకిదివఱ కొసఁగిన యుచితవేతనము నధికారులు లాగివైచినారు. రాముఁడు దైవముమీఁదనే భారమువైచి యుండుటచే నాతని మానసముమాత్రము జంకలేదు. రాముఁడు తనదినచర్యాపుస్తకములో నప్పటి కష్టములనుగూర్చి యిట్లు వ్రాసికొనినాఁడు; "నాపినతండ్రియు,నామామగారును నాకు సాహాయ్యము చేయుదురని నమ్ముచుండుటలేదు. వారు చేయఁగలదేమి ? ఈశ్వరుఁడే నాకు సాయపడును. నిన్నటివఱకుఁ బోషించిన దైవము నేఁడు నన్ను విడుచునా ?"

ఆరోజులలో రామునికష్ట మొకటి రుచిమాత్రము. ఉన్నధన మంతయుఁ బుస్తకములు కొనుటకు వ్యయమయిపోవుటచే, నొకనెలలో రామునికి దినమునకు మూఁడుకాను లుండులాగున మిగిలెను. "సర్వేశ్వరుఁడు నామనోధీరత్వమును బరీక్షింప నిట్లుచేసినాఁ"డని రాముఁడు తలఁచి, మూఁడుకానులతోడనే కాలముగడప నిశ్చయించుకొనెను. అతఁడురొట్టెలమ్ము కోమటియొద్ద నుదయము రెండుడబ్బులరొట్టెయు, రాత్రియొక కానిరొట్టెయుఁ గొని తిని కాలము గడపుచుండెను. కొన్నాళ్లిట్లు జరిగినవెనుక, రొట్టెలకోమటి "రొట్టెలకు నీవు డబ్బిచ్చుచున్నావేకాని, పచ్చడి కిచ్చుటలేదు. ఇది మాకుఁ గిట్టు"దని రామునితోఁ జెప్పివేసెను. ఆదినము మొదలు రాముఁడానెల పూర్తియగువఱకు దినమున కొకపూఁటయే రొట్టెతిని యూర

కుండెను. ఇట్టిదుర్దశలో నున్నను రాముఁడు కళాశాల కరుగు నపుడుకాని మిత్రులతోఁ గలియునపుడుకాని, దినమునకు ముమ్మాఱు తిని మితిలేని ఫలహారములుచేయు వారిముఖమున నెన్నఁడుఁ బొడచూపని పూర్ణదరహాసచంద్రికలను జూపుచు నిర్విచారముగనే తిరుగాడువాఁడు. రామునకు భుక్తి ప్రధానము కాదు. జ్ఞానతృష్ణలో నాతఁడు శరీరావసరముల నేమఱచినాఁడు.

ఇట్టిపరిస్థితిలో నుండఁగా రామునికిసాహాయ్యము లభించినది. కళాశాలలో ఫలహారముల నమ్ము 'ఝాండుమాల్' అనునాతఁడు రామునిఁ దనయింట నతిథిగా నుంచుకొని తరించినాఁడు. ధనికు లెందఱున్నను, సత్పాత్రదానముచేఁ దరించు శుభకాలము లభించినవాఁ డల్పుఁడగు 'ఝాండుమాలే.' రాముని దీనదీశ నాతఁడు కాంచినంతనే, అతనిహృదయస్థుఁడగు జనార్దనుఁడు కదలినాఁడు. రామునికి వలయుసౌకర్యము లన్నియు నాతఁ డుచితముగఁ గూర్చినాఁడు. బ్రహ్మర్షి వరేణ్యుఁ డగు రామునిఁ బోషించునవకాశము లభించిన 'ఝాండుమా' లెంతపుణ్యము చేసికొనెనో కదా !

పరీక్షకు మఱల ముప్పదిరూప్యములు, 'దరఖాస్తు' కట్ట వలయును. రామునియొద్దఁ బైసయు లేదు. కాలము సమీపించినది. రాముఁడు పరమేశ్వరునే నమ్మి యూరకుండెను. నమ్మినవారిని భగవంతుఁడు విడిచిపెట్టినయుదాహరణ మేమతసారస్వతమునందును మందునకైనను లేదు. రామునికళాశాలలో 'గిల్బర్ట్సన్' అను నాంగ్లేయుఁడు గణితశాస్త్రోపాధ్యాయుఁడు. అతఁడు రామునికి ముప్పదిరూప్యముల నొక 'కవరు' లోఁ

బెట్టి పంపెను. రాముఁ డది విప్పి చూచి, పరమేశ్వరకటాక్షమునకానందబాష్పములు విడిచెను.

మఱల రాముఁడు పరీక్షకు వెడలి, విశ్వవిద్యాలయములో బ్రథముఁడుగా జయమందినాఁడు. ఆతఁడు గాంచిన విశ్వవిద్యాలయ ప్రథానస్థానమునకు నెల కరువదిరూప్యములు లభించు నుచితవేతనము దొరకినది. వెంటనే యాతఁడు ఎం. ఏ. తరగతిలోఁ జేరెను.

ఇఁక రాముని కుచితవేతనము లభించుచుండుటచేతను, వేఱొకకళాశాలలోఁ దీఱిక వేళల బోధించుటకై నియమింపఁబడి తన్మూలమున మఱికొంతసొమ్ము సంపాదించుటచేతను దారిద్ర్య మాతనిని వదలినది. రాముని కిరువదిసంవత్సరములు నిండినవి. ఎం. ఏ. పరీక్షలో రాముఁడు మఱల నొకగౌరవస్థానము గాంచి కృతార్థుఁడైనాఁడు. కేంబ్రిడ్జిలోని "సీనియరురాంగ్లర్" గౌరవము లభించువిద్యకై, ఉచితవేతనము రాముఁడు కోరిన లభించుటకు సిద్ధముగా నుండెను. కాని, రాముని కిష్టము లేదు. తాను జీవిత ముపాధ్యాయవృత్తిలో వెచ్చింప రాముఁడు నిర్ణయించుకొనెను. తాను నేర్చిన విద్య ప్రజలకు బోధించుటలో నానంద మున్నదని రాముఁడు గ్రహించినాఁడు. తుదకు రాముఁడు గణితశాస్త్రాధ్యాపకుఁడుగాఁ గాక, ఆత్మానంద శాస్త్రబోధకుఁడుగా, బ్రహ్మానందమహాప్రదాతగా లోకము నుద్ధరించినాఁడు.

ఆంతరంగిక పరివర్తనము.

ప్రజాసామాన్యమున కాంతరంగికదృష్టి తక్కువ. నూటికిఁ దొంబదిమంది బాహ్యేంద్రియములకు దాసులు. కామినీ కాంచనములందలి వాంఛలే, అట్టిప్రజల మానసప్రపంచములో గమ్యస్థానములై, నిరంతరము కృషిచేయఁ బురికొల్పుచుండును. వాంఛాదాసునికిఁ గల సమస్య లనంతములు. ఇసుకరేణువు మొదలు హిమాలయశిఖరములవఱకును గల వస్తుసాగరములో నాతనిచూపులు పడినచో నవి యన్నియుఁ దనయింటిలోఁ దన కుక్షిలో నెట్లుపడునా యని యాతఁడు చూచుచుండును. అద్భుతసౌరభముతో, మృదుపత్రములతో, మధురమకరంద ముతో వికసించుకుసుమరాజము నాతఁడు పల్లవలతాంగిశిఖపైఁ జూచి యానందింపలేఁడు. స్వార్థపరత్వము మూర్తీభవించిన తన కొనగోళ్ళతో దానినిఁ బుటుక్కునఁ దుంచి, తనక్రుతిమహస్త మునఁ బెట్టుకొనినఁగాని విషయాభిలాషికిఁ దృప్తిలేదు. అనంత కళాపరిపూర్ణుఁ డగుపరమేశ్వరుని లీలావిలాసవైఖరులఁ జూపు ప్రదర్శనమో యన నుదయించిన బాలసూర్యునిరాకఁ జూచి పరమానందతరంగితాత్ముం డగుటకుబదులు, కామినీదాసుఁడు, నిరంతర మంధకారము గడ్డకట్టియుండక తెల్లవాఱినదే యని పలవించును. దీపము చూచి; పరిపక్వఫల మని పరుగిడుమిడుత వోలె, మాయామరీచికలఁజూచి,నిముసములో మటుమాయమై మోసగించు నని యెఱుఁగక స్వార్థపరుఁడు భోగభాగ్య మని, తన 'మమ'కారము నంపి సుఖానందములకై, తననాలుక సాచి, యెదురుచూచుచుండును. ఇట్టి జనసామాన్యమున కాంతరంగిక

విశేషములనుదిలకించుటకుఁ గాలమే దొరకదు. చేఁపనుమ్రింగు తిమింగలము చేఁపహృదయములో నివసించు 'జీవి' పడు మరణ యాతనాభయోద్రేకముల నెన్నఁడైనఁ బరికించునా? మహాత్ముల లక్షణముల నట్టివారు పరికింతురా ? పరికించిన వారిచేతఁబడున దేమున్నది? సురాపానప్రమత్తుఁడు తనయెదుట బ్రహ్మర్షి నిలఁబడిన, వానికి సాష్టాంగ మొనర్చి, సంసారసాగరమును దరించు సాధనము బోధింపు మని కోరునా ? తాను త్రాగి విడిచిన కల్లుకుండ నాతని నెత్తిపైఁ గొట్టిపోవును.

నిత్యానందసంధాయకమగుశక్తి యాంతరంగికము. అది బాహ్యవస్తుసంతతిలోఁ గాని తదార్జనలోఁ గాని లభింపదు. స్వార్థపరతాకల్మషరాసులఁ గాల్చివైచి, ఆత్మాభిముఖ మగు నమలమానసికపీఠిపై నఖండానందప్రదాత యగు నారాయణుఁడు నివాస మేర్పఱచుకొనును. అట్టి పవిత్రపరమేశ్వరపాద నిలయార్హమగు స్వచ్ఛహృదయమును, త్యాగధనముచేఁ గొని, దాచి యుంచుకొనినవారి బాహ్యచేష్టలు సామాన్యులకుఁ గోరిక లెఱుఁగని పిచ్చిపనులుగాఁ గన్పట్టును. మన రాముఁడు తన హృదయాబ్జమును దుడిచి, శుభ్రమొనర్చి, పరమేశ్వరు నాహ్వానించినాఁడు.

ఎం. ఏ. పరీక్షలోఁ గృతార్థుఁ డగునాఁటికి, రాముఁడు సర్వేశ్వరసహవాసభాగ్యమును సాధించుటలోను గృతార్థుఁడై నాఁడు. ఆనాఁడు రాముని బాహ్యసహవాసము నెఱిఁగిన మిత్రులకుఁగాని, కళాశాలావిద్యార్థులకుఁగాని మన రామునిలో నప్పుడే వఱదలై పొరలుచుండిన యాధ్యాత్మికప్రవాహముల

యలికిడియైన వినఁబడలేదు. 1894 వ సంవత్సరములోఁ దన గురువునకు వ్రాసినలేఖలోఁ దన యూహలను రాముఁ డిట్లు తేటపఱచినాఁడు; "భగవంతుఁడు దయాస్వరూపుఁడు. అతని నే నెంతయో ప్రేమించెదను. ఆతనిలో నా కొకరుచి దొరకినది. ఆతనిలోఁ గఠినత్వము లేదు. కాని, కొన్నివేళల నాతఁడు మనతో నాటలాడును. మనము దుఃఖ మనుకొనున దాతనికిఁ బరిహాసలీల."

లాహోరు కళాశాలలో గణితశాస్త్రప్రధానోపాధ్యాయుఁడుగ నుండి, 1896 వ సంవత్సరములో రాముఁ డిట్లు తండ్రికి వ్రాసినాఁడు. "నాయనా! నీయుత్తరము లన్నియుఁ జేరినవి. ఈలోకములో'నాది'యని చెప్పుకొనుట కేద్దియునాకుఁ గనఁబడదు. ప్రపంచములో ధనము పోగిడుట నాకుఁ గుతూహలకార్యము కాదు. నాభార్యకు నగలు చేయించుటయందును నా కానందము లేదు. నాకు వస్తుసామగ్రి యేమియు నవసరము లేదు. ఏ చెట్టునీడయో గృహముగను, భస్మమే పట్టువస్త్రముగను, కటికనేలయే తల్పముగను, నాలుగుగుమ్మముల ముంగిట లభించిన భిక్షాన్నమే భోజనముగను, లభించుటకంటె వేఱొక యానందము నాకులేదు. ధనవిషయమై నేను నీమనసు నొప్పింతునా? భస్మధారి యగుబైరాగివలె జీవింపు మని యానతిమ్ము. వెంటనే యట్లు చేసెదను. బైరాగివలెనుండియుఁ గళాశాలలో నుద్యోగము మాననులే! నాకు వచ్చుజీతమంతయును నీవే తీసికొమ్ము. నీయిచ్చవచ్చినట్లు వెచ్చించుకొనుము. నా భార్యకు నీకుఁ దోఁచినంతయే యిమ్ము. నేనొక యల్ప

సేవకుఁడను. నా హృదయములోఁ బరమేశ్వరునికొఱకై యొక పవిత్రమగు మందిరమును నిర్మించుకొనుటయే నాకృషి. ఐహిక సామ్రాజ్య మంతయుఁ గలిసి యొసఁగఁజాలని యానందము నాయీవిధ మగుచిత్తశాంతి చేకూర్పఁగలదు. పరమేశ్వరునికై నేను చేయు కార్య మొసంగుశాంతియే నాకమూల్య మగు జీతము. కళాశాలోద్యోగము తెచ్చు జీతము నాకు వలదు. నీ యిచ్చవచ్చినట్లు చేయుము. ఈధనమువలన నాకు వచ్చు లోపముకాని, సంతృప్తికాని లేదు. బ్రహ్మానందమే నాకు వలయునది."

ఇంకొకతూరి రాముఁ డిట్లు తండ్రికి వ్రాసినాఁడు. "ప్రియుఁడ వగునోతండ్రీ! వందనములు. నీవు వ్రాసినయుత్తరము లందినవి. ఆనందము కలిగినది. నీకుమారుఁ డగు తీర్థరాముని యీశరీరము భగవంతుని కమ్మివేయఁబడినది. ఇది యిఁక రాముని శరీరము కాదు. నేను జూదమాడినాను. అందు నా శరీరము నోడిపోయి, భగవంతుని గెల్చినాను. నీ కేమి కావలసియున్నను నిఁక నన్నడుగకుము. పరమేశ్వరునే యడుగుము. భగవంతుఁడే నీకు నాచే నిప్పించును. కాని, భక్తితో నీశ్వరు నొక్కసారి ధ్యానింపుము.

గతించిన నెలదినములనుండియు నీశ్వరుఁడు నావంకకు వచ్చి, నాభారములు, నాపనులు, నాఋణములు నన్నియుఁ దన భుజములపైఁ బెట్టుకొనినాఁడు. నీవిమాత్ర మేల భరింపఁడు? ధైర్యమును గోలుపోవకుము. సర్వేశ్వరాదేశము నను సరించియే సమస్త మానవకోటియుఁ బనిచేయును. మహా

రాజా ! పరమేశ్వర సాక్షాత్కారధనమే మనసొమ్ము. బాహ్య భౌతిక భస్మధనములకై యమూల్యమగు నీయాంతరంగికాత్మ ధనమును విడువఁజూచుట మనజాతికిఁ దగదు. ఒక్కసారి నీయాత్మానందమును రుచిచూడుము."

రాముని కన్నుడే యిరువదేండ్లు నిండినవి. రాముఁ డభినవప్రపంచములో నున్నత మనదఁగు ఎం. ఏ. పరీక్షలోఁ గృతార్థుఁడై కళాశాలలో నుత్తమ మగు నుపాధ్యాయపదవినిఁ గాంచినాఁడు. పదునాఱేండ్ల బాలసుందరి భార్య. యౌవనవన రాశిలోఁబడి, మన్మథమహోత్తుంగతరంగడోలికలలో రాయంచ వలె విసుగు విరామములు లేక యీఁదులాడుటకు బదులు మన రాముఁడు, పరివ్రాజకాచార్యపరమహంసవలెఁ బరమేశ్వర పవిత్రపాదతీర్థాంబుధిలో బ్రహ్మానందతరంగ పరంపరలపై నుయ్యాల లూఁగ నారంభించినాఁడు. సర్వేశ్వరసాక్షాత్కార సిద్ధియే శాశ్వతధనమని తన బాల్యజీవితములో నప్పుడే చూపి, మానవధర్మమును లోకమున నాతఁడు నిలఁబెట్టినాఁడు. ఈ హృదయపరివర్తన మాతని కెట్లు లభించినదో యెవరు చెప్పఁ గలరు ! పూర్వానేక జన్మములలో నాతఁ డెట్టి ఘోరతపో దీక్షానవద్యుఁడో కదా !

రాముని యుద్యోగము : కృష్ణభక్తి

మన రాముఁడు విశ్వవిద్యాలయాగ్రపరీక్షయగు ఎం.ఏ. తరగతిలో నుత్తీర్ణుఁడైనాఁడు. కాని, యుద్యోగములేదు. కొన్ని దినము లాతఁడు ప్రత్యేకముతరగతులు (Private classes) పెట్టి

కాలము గడపినాఁడు. ఉదయాద్యస్తమయపర్యంతముఁ బనిచే యుటచే నాతనియారోగ్యము చెడినది. అందుచే నాతఁడు స్వగ్రామ మగు మురళీవాలాకు వెడలిపోయినాఁడు. కొన్ని నెలల కారోగ్యము కూర్చుకొని మఱల రాముఁడు లాహోరు వచ్చి స్థానికసనాతనధర్మసంఘములోని విద్యాశాఖకు కార్యదర్శిగాఁ జేరెను.

వక్తృత్వముకూడ మనరాముని కప్పుడే పట్టుపడినది. అప్పుడప్పుడు సనాతనధర్మసభలలో నాతఁ డుపన్యసింప నారంభించినాఁడు. ఒకసభలో జరిగిన తన యుపన్యాసమును దానే యిట్లు వర్ణించినాఁడు : "నేఁడు సనాతనధర్మసభాయాజమాన్యమున నొక మహోపన్యాసము నొసఁగినాను. సభవిషయమై ప్రచురణ జరుగకున్నను సభామందిరము జనసమూహముతోఁ గ్రిక్కిరిసియుండెను. 'కలెక్టరులు' మున్నగు పెద్దయుద్యోగస్థులును విచ్చేసిరి. దేశభక్తిని గూర్చి కూడ నేను మాటాడినాడను. సభ్యుల నేత్రములనుండి యశ్రుబిందువులు రాలినవి." అజ్ఞానాంధకారమునఁ బడిపోయి జన్మ జన్మాంతరములనుండి దుఃఖించుచు, నవతరణమార్గ మెఱుఁగక లోకులు కార్చు కన్నీటి ధారలను దనయమలపరమార్థజ్ఞాన మందమారుతముచేఁ దుడిచివైచిన రామతీర్థస్వామి యుపన్యాసము విని, ప్రజలు కన్నీరు గార్చుటలో నాశ్చర్య మేమున్నది ?

1895 వ సంవత్సరమున, 'సయాల్కోట మిషనుహైస్కూలు' వారు రాముని ద్వితీయోపాధ్యాయునిగా నెల కెనుబదిరూప్యములవేతనమునకు నియమించిరి. అచటి విద్యార్థులు

రామునిగణితశాస్త్రప్రజ్ఞావిశేషములు విని, దూరస్థలములనుండి యైన వచ్చి, రాముఁ డున్న పాఠశాలలోఁ జేరుచుండువారు. బాలురను రాముఁడు ప్రేమవాత్సల్యముతోఁ జూచి, ఏమి యడిగినను విసుగుచెందక యుచితముగ బోధించువాఁడు. కాని, కొలఁదినెలలలోఁ దానుచదివిన లాహోరుకళాశాలలోఁ బ్రధాన గణితశాస్త్రపండితుఁడుగ (Professor of Mathematics) నాతఁ డుద్యోగము గడించెను.

రామునికుద్యోగమువలన లభించిన ధనమంతయు నాతఁడు తనకు వలయు నవసరములకైన నుంచుకొనకుండ దానముచేయువాఁడు. 1897 జనవరిలోఁ దనగురువునకు రాముఁ డిట్లు వ్రాసియున్నాఁడు; "28 రూప్యములు పంపుచున్నాను. సగము మాతండ్రి కొసఁగుము. నే నతని కిచ్చెద నని మాట యిచ్చినాను. నాయొద్ద నిఁక మూఁడురూప్యములే యున్నవి. వీనితో ముప్పది దినములు గడపవలసియున్నది. క్రిందటినెల నేను బాకీయున్న 'బిల్లు' బాపతు పైసయుఁ జెల్లింపనే లేదు. ఒక పేదవిద్యార్థికైన నేమియు నొసఁగ లేదు."

రాముఁ డుత్తమపదవిలోనున్నను దారిద్ర్య మాతనిని విడువలేదు. కాని, యిది స్వయంకృతాపరాధము. స్వార్థమునకై రాముఁడెన్నఁడు జాగ్రత్తపడి యెఱుఁగఁడు; ధనము నార్జించి నిలువచేయుభ్రాంతి మొదటనే లేదు; శరీర సుఖవిషయములో నాతఁడెన్నఁడు కోరికపెట్టుకొననే లేదు. అభినవ భారతవర్షములో సర్వసంగత్యాగ మొనర్చిన సన్న్యాసులలో నగ్ర

గణ్యుఁడైన మనరాముఁడుకొలఁదిరూకలు దాన మొనర్చుటలో విశేషము లేదు.

ఆదినములలో రాముఁడు భగవద్గీత చదువుటలోఁ జాల కాలము వ్యయించువాఁడు, భగవద్గీత చదువువారు, నిత్య పారాయణచేయువారు, నసంఖ్యాకు లున్నారు. పాండిత్యము కొఱకో, వాదముకొఱకో, విమర్శకొఱకో, చదువువారికి గీతార్థసందేశములు పొడకట్టుటదుర్లభము. రాముఁడట్టియల్పోద్దేశముతో నెన్నఁడు గీతను హస్తమునఁ బట్టలేదు. శ్రీకృష్ణ పరమాత్ముఁడు పలికిన యాగీతాశ్లోకములలోని మాటలు, సూటిగాఁ బోయి గాండీవవినిర్ముక్త బాణపరంపరలవలె, రాముని హృదయకుహరమున నాఁటినవి. రాముఁడు గీతను మఱల మఱలఁ జదివినాఁడు. చదివినకొలఁది నాతని కెద్దియో, అతిలోకమగు, నతీంద్రియమగు, అనుభవైకవేద్యమగు నానందము రుచియుఁ గల్గినవి. గీత చదువుట కారంభించుటతోడనే యాతనికి మానసాందోళనము లన్నియు నరనిముసములో నణఁగి పోయెడివి. ఉత్తమమగు ప్రశాంతి హృదయము నావరించి శ్రీకృష్ణభగవానుఁడే తన దివ్యశ్యామల దేహకాంతి పుంజములతోఁ బ్రత్యక్షమై జీవమోక్ష మంత్రోపదేశము చేయుచున్నట్టు లాతనికిఁ బొడగట్టెడిది. అపుడు రాముఁడే అర్జునుఁడుగా మారిపోవువాఁడు. ఇఁక నాతనికి శ్రీకృష్ణనామోచ్చారణమాత్రముచే నేత్రాంచలమునుండి యానందాశ్రుబిందు సందోహములు నిరంతరధారాపాతముగఁ గాఱుచుండెడివి. ఇహలోకతుచ్ఛాశాపాశము లన్నియు నిముసములోఁ బుటుక్కున

దెగి తుత్తునియలైనంతనే యనంతభక్తి భావసమాధిలోఁ బడి, మనరాముఁ డిట్లు పలవించువాఁడు; (ఆకసమువంకఁ జూచి, నీల మేఘమును గాంచి) "ఓకృష్ణా! ఈమేఘనైల్యము నీదే! కృష్ణా! నీవెచ్చట దాఁగుకొంటివి? ఓ మేఘరాజమా! మా కృష్ణునెచట దాఁచితివో చెప్పవేమి? నీవు మహోత్తుంగాకాశ మున విహరించుచున్నావు. నాకుఁ జూడరానిచోట్లు నీకంటికిఁ బ్రత్యక్షములు. చెప్పుము. త్వరగాఁజెప్పుము. నాకృష్ణుఁడెచ్చట నున్నాఁడు? మేఘుఁడా! నీవును నల్లపడిపోయినావు. కృష్ణ వియోగదుఃఖమును భరింపఁజాలక నల్లపడితివి. నేను కృష్ణుని వంకఁ జూడఁగలనా? కృష్ణుని నేను దర్శింపకపోయినచో నీలోక ము నన్నుఁ గొఱికివేయదా? నా హృదయావేదన నిఁక నెవరి యొద్ద వెడలఁగ్రక్కుదును? ఓయీ! కృష్ణా! నీకొఱకు నాబంధు మిత్రులను విసర్జించితిని. లజ్జాకీర్తివాంఛలను ద్రోసిపుచ్చితిని. కృష్ణా! ఎన్నఁడు, ఇంకెన్నఁడు, మఱెన్నఁడు కనఁబడెదవు! నేనిఁక భరింపఁజాలను. నాతృష్ణఁదీర్పుము. లేకున్న మృత్యువుఁ బంపుము. సూర్యునికి గ్రీష్మప్రతాపమును నీ విచ్చితివి; చంద్రు నికి సౌందర్యము నొసఁగితివి; పుష్పములకు కాంతిసౌరభముల నొనగూర్చితివి. నీదర్శనము చేయుదృష్టియు, జ్ఞానమును నా కేల యొసఁగవు?"

రాముని కేకాంతసేవ యన్న నమితప్రీతి. దినదిన మాతఁడు రావీనదీతీరమున కరిగి, రాత్రిపొద్దుపోయి యింటికిఁ జేరువాఁడు. ఏకాంతములో రాముఁ డేమిచేయును? భగవత్సా న్నిధ్యమునకై పరితపించును. ఆవర్ణింపరాని పరితాపములోఁ

బడి నవ్వుచు, నేడ్చుచు, నొకపరి లేచి గంతులువేయుచు, నొకసారి నేలఁబడి పొరలుచు నిట్లు రాముఁడు కాలము గడపు వాఁడు. సర్వేశ్వరసందర్శనలాలసత్వముచే నొకసారి రాముఁ డీరీతి నాక్రందించినాఁడు; "ఓ నేత్రములారా! కృష్ణునిఁ జూడ లేనపుడు మీయుపయోగమేమి ? శాశ్వతముగా మూసికొని పొండు! హస్తములారా! శ్రీకృష్ణరజస్స్పర్శలేని మీవుండి యేమి లాభము? ఎండుకట్టెలైపొండు! ఓకృష్ణా! నాకు జీవిత మొసఁగి తివి. రమ్మా. నాయొద్దకు వచ్చిన నాప్రాణము లర్పించెదను!" ఇట్లు పలుకుచు, దిక్కులు వణఁకులాగున రాముఁడు బిగ్గరగా రోదన మారంభింప నేత్రములనుండి కన్నీరు వఱదలై పాతి యాతఁడు కట్టిన వస్త్రములను దడిపివైచెను. క్షణములో రాముఁడు స్మృతితప్పి పడిపోయెను. కొంతసేపటికి లేచి చూచు నప్పటి కొకసర్పరాజము పడగ విప్పి రాము నెదుట నాడు చుండెను. రాముఁడు సర్పమును జూచి యొక్కయంగలో ముందుకు దుమికి, "కృష్ణా! రమ్ము! సర్పరూపమున వచ్చితివా? మోహితలై గుంపులై వచ్చి గోపికాసహస్రములు ని న్నేదివ్య రూపములోఁ జూచి యమితానంద మందిరో, ఆ కృష్ణరూప ములో నిన్నుఁ జూడఁ గోరిక యగుచున్న''దని పలికి మరల మూర్ఛితుఁడై పోయెను. ఇదంతయుఁ జూచుచున్న యొక మిత్రుఁడు పరుగిడివచ్చి "రామా! కృష్ణుఁడు నీలోనే యున్నాఁడు. ఎక్కడ వెదకుచుంటి"వని పలికెను. "నాయందే?" యని పలికి పిచ్చిరాముఁడు తన 'చొక్కా' చించివైచి శరీర మును గోళ్ళతోఁ జీల్చుకొన నారంభించినాఁడు. అట్లు చేయుచు

మరల రాముఁడు మూర్ఛలోఁ బడి గంటలకొలఁది నట్లే యుండి పోయినాఁడు !

కామకాంచనతృష్ణారోగులే కాని పరమేశ్వర వియోగ రోగులు లోకములో నెందఱో యుండరు. ఇట్టి మహాత్ముల పావననామస్మరణమే భవబంధముల నాశనమొనర్పఁగలదు.

రాముని సంసారత్యాగ ప్రయత్నములు

స్వాతంత్ర్యశబ్ద మెంతమధురమైనది ! ఎందఱు మహా పురుషులు స్వాతంత్ర్యము పేర దుస్సహయాతనల ననుభవించిరో కదా ! ఉరికంబముల నుత్సాహముతోఁ గౌఁగిలించుకొను వారు, దారుణరణరంగమధ్యమున నిలఁబడి శరీరమును గడ్డిపరక వలె విసరివైచువారు, ద్వీపాంతరవాసముల ద్విగుణీకృతానంద ముతో నాహ్వానించువారు, అగ్నికుండములలోఁ బడి, శీతలోదక ప్రవాహములోవలె శ్రమలేక యీఁదులాడువారు, భార్యా పుత్రగృహారామాది సౌఖ్యములను ద్యజించి స్వాతంత్ర్యమంత్ర జపములో నోడలు మఱచువారు, ప్రతిదేశమందును వందల కొలఁదిఁ గన్పట్టుచున్నారు.

కాని, స్వాతంత్ర్యములో నంతరువు లనేకములు గలవు. ముఖ్యముగా నన్నియంతరువులు రెంటిక్రిందఁ జేరును. బాహ్య స్వాతంత్ర్యము లేక ఆత్మస్వాతంత్ర్యము. నేఁటిపాశ్చాత్యప్రపం చము బాహ్యస్వాతంత్ర్యమునుu బహుళముగా బోధించి యార్జిం చినది. బాహ్యస్వాతంత్ర్యమునకై పశ్చిమఖండమందు జరిగిన

రణభూములలోఁ గోట్లకొలఁది మానవులకు శ్మశానవాటి కల్పింపఁబడినది. బాహ్యస్వాతంత్ర్య మన, శరీరస్వేచ్ఛావిహారమునకు, ధనార్జనకు, వర్తకవ్యాపారమునకు, సామ్రాజ్యవ్యాపనమునకు, సంఘనాయకత్వమునకుఁ బరుగులాడు తీవ్రవాంఛ. అరణ్యములో నేమృగభయము లేక తిరుగాడు సింగముయొక్క స్వేచ్ఛ బాహ్యస్వాతంత్ర్యములోనిదే. ఆకసమున డేగ యడ్డము లేక విహరించుస్వేచ్ఛయు నిందుఁ జేరును. సాగరమునఁ దన యిచ్ఛవచ్చినరీతి నీఁదులాడుచు వందలకొలఁది చేఁపలను నమలివైచు తిమింగలశక్తియు నిందులోనిదే. ఇట్టి స్వాతంత్ర్యము భోగాసక్తికై, ఆర్థికలాభసంపాదనా వాంఛలపై మోహములపై నాధారపడియున్నది.

కాని, ఆత్మస్వాతంత్ర్యముయొక్క చరిత్ర వేఱు; జాతి పరాధీనతను, దాస్యసూత్రములను మాత్రమేగాక, జీవిపరాధీనతను, అజ్ఞాన శృంఖలములను నఱకివైచునదే యాత్మస్వాతంత్ర్యము. అవిచ్ఛిన్న సామ్రాజ్యశాసనాధిపత్యము వహించు చక్రవర్తి మోహపిశాచము నెదుర్కొనలేక దినమునకు వేయి మారులు వణఁకుచుండును. ప్రజానాయకత్వము వహించి, మహోపన్యాసము లిచ్చి పూలదండలమధ్య మునిఁగిపోవు ధీరుఁడు, సంఘములో నెవ్వరైనఁ దనమాట కడ్డుపలికినఁ గ్రోధభూతముకోరలలోఁ జిక్కువడి, కటకటంబడును. సామ్రాజ్యములు, సామ్రాజ్యనేతలు, సముద్రములోని తరంగములవలె మేఘపుంజములమాటున మెఱపులవలె నిముసములో దృష్టి నరికట్టి మఱుక్షణములో మటుమాయమగుచున్నారు. ఎంతటి

యుత్తమాధికార పదవులున్నను, నెంతటిమెత్తుగల కనకరత్న రాసు లున్నను, ఆకసమున విహరించి, సాగరమును నిరోధించి, వాయువును బంధింపఁగల యెట్టిప్రకృతిశక్తులను హస్తగతము చేసికొన్నను, ప్రతిజీవికి జీవితకాలములో నెప్పుడో యొకప్పుడు పరిస్థితులు క్లిష్టములై తెన్ను లేనికంటకారణ్యములవలెఁ గన్పట్టు మోహము లూహాలను గలఁచివైచు; క్రోధమింద్రియముల కుద్రేకముఁ గలిగించు; కలిసిరాని కాంక్షలు కార్చిచ్చువలె గర్భమును భేదించు; యౌవనపాటవ మోటుపడు; నరములపట్లు సడలి భోగాభిలాషలు పొంగులుదేఱు; అనుభవించు నింద్రియములు క్రుంగి, కృశించి, త్రుప్పుపట్టు; జరావ్యాఘ్రము కట్టెదుట గాండ్రించుచు నిలఁబడు. మృత్యుదేవత ఘోరరూపముతోఁ గోఱలు సాచి మీఁదఁ బడ నుంకించు. ప్రళయభయకంపముచే గుండె తటతట కొట్టుకొనునట్టివేళ, "చిత్తశాంతి, యాత్మానందము లభించు టెట్లు?" అనుప్రశ్న సంభవించితీరును.

చిత్తసామ్రాజ్యాధికారితో భూమండలాధిపతికిఁ బోలికయే లేదు. ఆతని పాదరజోలేశమునకు నీతఁడు బోల్పఁదగఁడు. నిదానదృష్టికి మధ్యందినమార్తాండకాంతిలో వస్తువులు కన్పట్టు స్పష్టతతోఁ బ్రతిప్రాణియు నెన్ని యెన్నికపటనాటకము లాడుచున్నను వేయుప్రతియడుగును సర్వబంధరహితమై, విచ్ఛిన్నతలేని యానందరూపమై యఖండప్రశాంతి నొనఁగూర్పఁగల యాదివ్యస్థితివైపుఁ జేరవేయుప్రయత్నమే యనియుఁ బ్రతి జీవియు నణువులో నున్నను, పురుగులో నున్నను, కుశాగ్రబుద్ధిశాలియం దున్నను, కువలయశాసనకర్తలో నున్నను, నెట్టి యెట్టి

నీచోన్నతపరిస్థితులం దున్నను, సాగరమునఁ జేర యత్నించు నదివలె, తల్లియొడిలోఁ బడ నేడ్చుపసిబిడ్డవలె, విరహాము భరింపఁజాలక తల్లడిల్లు విటునిరీతి, నిరంతరము శాశ్వత స్వాతంత్ర్యపరిపూర్ణుఁ డగు సర్వేశ్వరునివైపే పరుగులిడుచు, నంగలు వేయుచు, యాత్రచేయుచున్న దని నిస్సంశయముగా గోచరించును. బాహ్యాంతరింద్రియనిగ్రహముచే లభించునాత్మస్వాతంత్ర్యమే మృత్యువును గాలిక్రిందఁబెట్టి నలిపివైచుశక్తి గలది. రాజకీయ సాంఘికార్థికాది స్వాతంత్ర్యము లన్నియు, నాత్మస్వాతంత్ర్యబ్రహ్మానందసాగరములో నీటిబొట్టులు మాత్రమే.

లాహోరుకళాశాలలో నత్యున్నత మగునుపాధ్యాయ పదవిలోనుండి, ధనలోపము లేక పదిమందిచేఁ బూజింపఁబడుచు నేవిధ మగుచింతకుఁ దావులేనిస్థితిలో నుండియు, రాముఁడు తన హృదయము నేదియో కలఁచివేయుటఁ గాంచినాఁడు. అతని మానసక్షేత్రమందు స్వేచ్ఛాబీజము పడి, ఆత్మస్వాతంత్ర్యవాంఛామహావృక్షముగాఁ బెరిగిపోయినది. ఆత్మానందము, అనంత చిత్తశాంతియు నొసఁగఁజాలని యైహికపరిస్థితులందు రాముని కి భరింపరాని యరుచి పుట్టినది. రాముని జన్మాంతరముల నుండి కట్టి పడవైచిన సంసారపాశములు బిగితగ్గి పెనసడలి చీకు మొగము పట్టినవి.

1897 వ సంవత్సరములో రాముఁ డుపాధ్యాయుఁడుగఁ బ్రవేశించినాఁడు. ఆతఁ డాపదవిలోఁ బనిచేసినది రెండేండ్లే. ఈ రెండువత్సరములలోనైనను, రాముఁ డుద్యోగధర్మము నతి దీక్షతోఁ గొనసాగించుచున్నను జిత్తమంతయు జగన్నాథుని

మీఁదనే యుండెను. సెలవుదినములు వచ్చినపుడెల్ల నాతఁడు లోకేశ్వరాన్వేషణకై తిన్నఁగాఁ బర్వతములకే పారిపోవు వాఁడు. కాశ్మీరము, అమరనాథము, హృషీకేశము, హరిద్వారము, రాముని విహారస్థానములు. ఒంటరిగ నట్టి పవిత్ర ప్రదేశముల కరిగి, భగవచ్చింతనలో నొడలు మఱచి, ధ్యాన ముద్రలో దినములు గడపి యెట్లో యాతఁడు తిరిగివచ్చువాఁడు. వృక్షాగ్రములచిగుళ్ళను గాంచియో, ఆకసమునందలి నక్షత్రములను జూచియో, ప్రణవమంత్ర ముచ్చరించులాగునఁ బ్రవహించుఝరీపాతగీతముల నాలకించియో, రాముఁడు ప్రకృతిలో లీనమై, విశ్వమంతయు విష్ణుమయముగాఁ జూచి, యానంద బాష్పధారలు నిరంతరముఁ గార్చుచుఁ దిరుగువాఁడు.

ఆత్మజయమే పొందఁదగినది; ఆత్మశాంతియే యార్జింప వలసినది; ఆత్మానందమే సాధింపఁదగినది; ప్రపంచములోని యితరపదవులు, జయములు, అనుభవములు, తుచ్ఛములు, బంధహేతువులు, కృత్రిమములు నని రాముఁడు సంశయ మావంతయైన లేనినిర్మలమానసముతోఁ దిలకించినాఁడు. రామునికి జీవితపరమగమ్యస్థానము పరంజ్యోతి నెఱుఁగుట కన్న వేఱెద్దియును లేదను ప్రజ్ఞాపరిపూర్ణత లభించినది. తానీఁకముం దెచ్చట నడుగువైచినచో గమ్యస్థానోన్ముఖుఁడు కాఁగలఁడో రాముఁడు చూచినాఁడు. నేఁడాతఁడు పంజరమున బంధింపఁ బడిన పక్షివలె నున్నాఁడు. కాని, పంజరమును దన్నివైచి యనంతవిశాలాకాశవీథులఁ దిరుగాడు మని నిరంతరము నాతని చెవిలో నేదో యొకమధురనాదము గింగురుమనుచునే యుం

డుట నాతఁడు వినుచుండెను. వేదాంతవిజ్ఞానము నాశించి భగవద్గీత, ఉపనిషత్తులు, శంకరరామానుజమాధ్వసిద్ధాంతములు, వ్యాఖ్యలు, భారతభాగవతరామాయణముల కథలమఱుఁగునఁగల తులలేనిసత్యాంశములు; షడ్దర్శనములలోని సునిశితతార్కాయుధములచే నగిషీచెక్కఁబడి, మెఱుఁగుపొందిన వివిధాత్మపరమాత్మ సిద్ధాంతరహస్యములు; వసిష్ఠ విశ్వామిత్ర గౌతమ యాజ్ఞవల్క్య పరాశరాదిమహర్షిపుంగవులు పల్కిన యమృతమయవాక్కులవెనుక వెల్గొందిన యఖండబ్రహ్మచర్య వైరాగ్యజ్వాలలలోనిదివ్యకాంతిపుంజములు; సూరదాసు, కబీర్, తుకారామ్, రామదాసు, నానక్ మున్నగు భక్తాగ్రేసరుల హృదయములలోఁ బరమేశ్వరసాన్నిధ్యమునకై బయల్వెడలిన నిరంతరపరితాపములోని నిట్టూర్పులు; హాఫిజ్, అత్తర్, షామ్సుటాబ్రెజ్, మౌలానారూమ్ మొదలగు మహమ్మదీయ సాధుపుంగవుల మహావాక్యములలోని సారములు; కాంటు, షోపెన్హార్, ఫిక్టే, హెగెల్, గథే, కార్లైల్ మున్నగు పశ్చిమ ఖండతత్త్వజ్ఞశిఖామణుల సత్యాన్వేషణములోని ధీవిలాసములు నివన్నియు మనరాముఁడే రేయింబవళ్లు నిద్రాహారములు మాని క్షుణ్ణముగాఁ జదివి జీర్ణించుకొని ప్రకృతి భౌతిక శాస్త్రముల మూలభూతులైన స్పైనోజా, స్పెన్సర్, డార్విన్, హేకెల్, టిండల్, హక్స్లీ, జేమ్సు, మున్నగు వైజ్ఞానికుల వ్రాఁత లన్నియుఁ బరికించినాఁడు. గణితశాస్త్రపారావారములో నిదివఱకే యాతఁడు తెక్కలునొప్పిపెట్టులాగున నీఁదులాడియే యున్నాఁడు.

ఈవిధముగా మనరామునికి దైన్యచింతచే నలవడిన మూఢభక్తి కాక, అభినవనాగరకప్రపంచములో నభ్యసింపనగు సమస్త విద్యాశాఖలలో నసమాన మగుపాండిత్యము లభించినది. ఆతనిబుద్ధియు హృదయము నొకదానిని మించి యొకటి పరిపక్వము చెందినవి. ఇఁక నాతని కట్టెదుట నున్న దొక కార్యరంగమే. ఊహింపనలసిన దెద్దియు లేదు. కర్మరంగములో నాతఁ డెట్లు తనజీవితనౌకను నడపెనో చూతము.

రామతీర్థ వివేకానందులు

ఈప్రపంచములో జీవికిఁ గర్మ చేయుటలో నెంతవఱకు స్వాతంత్ర్యమున్న దని తఱచి చూచినచో నది యనిర్వచనీయముగా మాఱిపోవును. ఒక విత్తనము భూమిలోఁ బడినపు డది యెట్లు మొలచి, పెరిగి, యెంతఫలము నిచ్చునో నిర్ణయించుట సాధ్యము కానిపని. నూఱువిత్తులు చల్లినచో నందుఁ గొన్ని నశించును; గొన్నియే మొలచును; మొలచినవానిలోఁ గొన్నియే పెరుగును, పెరిగి కొన్ని చచ్చును; చావకయుఁగొన్ని కాపు కాయవు; కొన్ని వలుచగాఁ గాయును; కొన్ని బాగుగా ఫలించును. ఫలించుట యెన్నిటిమీఁద నాధారపడియున్నది ? తెచ్చుబీజముమీఁదఁ, జల్లుభూమిమీఁద, వేయునెఱువుమీఁద, వీఁచుగాలిమీఁద, ప్రవహించు నీటిమీఁద, సరియగు ఋతువుమీఁద, పశ్వాదులు తినకుండఁజేయు పరిస్థితులమీఁద, నష్టముగాఁ బెరుగుకలుపు తీయు పద్ధతిమీఁద, నింక నెన్నిటిమీఁదనో బీజమిచ్చుఫల మాధారపడియుండును. ఇన్ని సంద

ర్భములలో నెందుచే నెంతఫలము వచ్చినదో నిర్ణయింపఁ బూనుట బుద్ధి కతీతమగు విషయము. పచ్చగాఁ బెరుగుచున్న యాకుమడిలోఁగల కొన్నిలక్షలమొక్కలలో నేమొక్క నేపశు వేక్షణములో నెంతవఱకుఁ గొఱికివేయునో, యెవరు చెప్పఁగలరు ? ఇందు మొక్కస్వాతంత్ర్య మెంత ? రైతు స్వాతంత్ర్యమెంత? తినుపశువు స్వాతంత్ర్యమెంత ? ఈయంశము లన్నిటినిగూర్చి తర్కించుట కారంభించినచో ననిర్వచనీయము లైపోవును.

మానవుని కెంతకర్మస్వాతంత్ర్యమున్న దనువిషయము నట్టిదే. దీనఁ దేలున దేమన, నిట్టివిషయములు సర్వజ్ఞుఁడగు వానికే తెలియును. సృష్టిరహస్యమెఱిఁగినపండితునికే, సృష్టిలో నేది యెప్పు డెందులకు జరుగుచున్నదో తెలియుట కవకాశ మున్నది. అనఁగా భగవద్దర్శనమైనవానికే, లోకరహస్యము లన్నియుఁ దెలియును. తదితరుల తర్కములు, ఊహలు చీకటి లోనితడవులాటలే. ఒకగడియారములో నొకతీఁగె యేల యమర్పఁబడినదో, గడియారము చేయువానికే తెలియును. గడియారము చూచువాని కేమి తెలియును ? అట్లే, యీసృష్టి యనుగడియారమును జేసిన కర్త, ఆజగత్కర్త తన యనంత హృదయములో నేయభిప్రాయము పెట్టుకొని, నేఁడు మనము చూచుచున్న యీకపరివర్తన మేల సంఘటింపఁజేసెనో, పర మేశ్వరహృదయము నెఱుఁగనిదే యెట్లు తెలియును ? అందు చేతనే, శ్రీరామకృష్ణపరమహంస, "మొదట భగవంతునిఁ దెలిసికొనుము. ఆవెనుక నీవు లోకసేవ చేయఁగలవు. అట్టి

యీశ్వరసాక్షాత్కారము నందకముందు, నీవు లోకుల నుద్ధ
రించెదనని పల్కుట, నెలలోని చంటిబిడ్డ, శోడీ చంటిపిల్లలకు
నాయికానాయకుల వియోగవిహారములఁగూర్చి యుపన్యసిం
చుట వంటిదే యగును. కావున, భగవంతు నెఱుఁగుటచే
మొదట నిన్ను నీ వుద్ధరించుకొని, తరువాత నితరుల నుద్ధరింప
యత్నింపు" మని బోధించియున్నాఁడు.

శ్రీరామకృష్ణ వివేకానందులసమావేశమెట్టి యతిలోక
విచిత్రము, నీశ్వరోద్దిష్ట మైనదో, వివేకానంద రామతీర్థుల
పరస్పరసందర్శనము నట్టిఫలరూపకమైనదే. 1893 వ సంవత్స
రములో అమెరికాలోని షికాగోనగరమునఁ బ్రపంచమత
మహాసభారంగముల భారతమహార్షి తపస్సారమూర్తియై,వివేకా
నందుఁడు సనాతనధర్మసందేశమును దిగ్దిగంతములు ప్రతిధ్వను
లీనునట్లు, తన యనంతబ్రహ్మచర్యదీక్షావేశపరంపరలతోఁ, దన
యఖండబ్రహ్మజ్ఞానభక్తివైరాగ్యానలజ్వాలలు మేళవించి, మృగ
రాజస్వేచ్ఛావిహారసాహసపాటవ ముట్టిపడ మ్రోగించి, సభా
సాగరమును మత్తేభము కాసారమునఁ బడినరీతిఁ గలంచివైచి,
నానాజాతిప్రతినిధులహృదయములను దనయప్రతిమాన వేదాంత
మురళీ గానములచే మోహింపఁజేసి, మూర్ఛితులనొనర్చి,
స్వవశముచేసికొని, శంకరాచార్యుననంతరము భూపతనమైన
హిందూమతపతాక నాకసమంటునట్లు దేశదేశములు పరిభ్ర
మించునట్లు, మఱల నొకసారి భారతజాతిపక్షమున, అభినవ
నాగరకలోకరంగమధ్యమున నెగురవేసి, సుస్థిరస్థాపన మొనర్చి
నాఁడు.

మాదే నాగరకత; భారతజాతి యింకను పశ్వవస్థలో నున్నది; మనమే వారినిఁ బాలించి మానవులనుగాఁ జేయవలె నని విఱ్ఱవీఁగు పశ్చిమఖండవాసుల దురహంకారము నణఁచి వైచి, ఆధ్యాత్మికదండయాత్రె దిగ్విజయముగా నొనర్చి, "హిందువులే మొదట లోకాంధత్వమును బోఁగొట్టి, జ్ఞాన జ్యోతిచేఁ గనులు తెఱపించినవారు; వేదాంతమతమే, ఉపనిష ద్ధర్మమే, మహర్షి సందేశమే, విశ్వకల్యాణమును సంధింపఁ జేయఁగల"దని ఘోషించి, పశ్చిమవిజ్ఞానిశేఖరులచేఁ దల లూఁపించి, వివేకానందుఁడు భారతదేశమునకుఁ దిరిగివచ్చి నాఁడు.

అట్లు తిరిగివచ్చిన కిరీటము లేని వివేకానందయతిసార్వ భౌమున కాసేతుశీతనగభారతకోటియు, సపూర్వ స్వాగత మొసఁగి ధన్యవాదము లొనర్చినది. పడి, చితిగి, చివికియున్న భారతవర్షమునకుఁ దిరిగి ప్రాణప్రతిష్ఠ యొనర్చుగంభీరోపన్యా సములచే నాతఁడు సందర్శించిన ప్రతినగరమును, నూతనోత్సా హముతో నుఱ్ఱూఁత లూఁగించెను. గుంపులుగూడి జనసమూ హములు స్వామిని సందర్శించెను. ఆవేశపూరితులై, దేశ భక్తులై, ప్రజలు కర్మవీరత్వమును బ్రదర్శించిరి.

దక్షిణేశ్వరవనములోఁ గొన్నాళ్ళు విశ్రాంతిపొంది వివే కానందుఁడు కాశ్మీరుయాత్రచేసి, యచటనుండి యమృతసరము మీఁదుగా 1897 వ సంవత్సరములో లాహోరునగరమున కరుదెంచెను. మన రామతీర్థుఁడు లాహోరులోని కళాశాలలో నధ్యాపకుఁడుగాఁ బనిచేయుచున్న సంగతి మన మెఱుఁగుదుము.

వివేకానందుఁడు లాహోరులోఁ గొన్ని దినములుండి, తనసందే శమును లాహోరుప్రజల కొసఁగిపోవ నిశ్చయించుకొనెను. అచట మనరాముఁడే వివేకానందుని దనయింటి కాతిథ్యమున కాహ్వానించి, ధన్యుఁడైనాఁడు.

రామతీర్థునిపై వివేకానందుని పరిభావము

మానవుఁడు వాంఛింపఁదగినది, యత్నింపఁదగినది, సాధింపఁదగినది, పరమేశ్వరసాక్షాత్కారము తప్ప వేఱొకటి లేదని, మనరాముఁడు నిస్సంశయముగా నిదివఱకే తెలిసికొని యున్నాఁడు. ప్రపంచములోని సమస్తతత్త్వశాస్త్రములు చదివి, యీనిర్ణయమున కాతఁడువచ్చినాఁడు. అతనిహృదయ మప్పుడే, ఱెక్కలు కట్టుకొని, శ్రీకృష్ణసందర్శనలాలసత్వముతో, జివ్వున నెగురుట కారంభించుముహూర్త మెప్పుడు వచ్చునా యని యెదురుచూచుచున్నది.

మన మేమిచేయఁదలఁచినను త్యాగ మవసరము. ఉద్యోగముచేయువాఁ డుదయము మొదలు సూర్యాస్తమయము వఱకుఁ బనిచేయ వలయును; అట్టివాఁడు తదితరకార్యము లన్నియుఁ ద్యాగముచేయవలయును. వ్యవసాయము జీవితవృత్తిగాఁ బెట్టుకొన్నరైతు, వర్తకమును ద్యాగమొనర్పవలయును; అట్లే, యేకృషిచేయువాఁ డాకృషికై, తదితరకృషు లన్నియుఁ ద్యాగ మొనర్చినఁగాని యది జరుగదు. అదేవిధమున, సర్వేశ్వరునిఁ బొందఁ గోరుముముక్షువులు, తదితరకృషులన్నియు, దది

తరవాంఛ లన్నియు, విసర్జించినఁగాని ఫలసిద్ధి లేదనుటలో నాశ్చర్య మేమున్నది? ఇదియేసన్న్యాసము. సన్న్యాసమనఁగా, నొక ఫలసిద్ధికొఱకై చేయుకృషినిమిత్తము, తదితరప్రయత్నములు విరమించుటయే. ఇది వ్యావహారికప్రపంచములోఁ బ్రతి విషయములోను గన్పట్టు సత్యాంశము. అన్నిటిలో నొకేసారి వేళ్లు పెట్టువాఁ డెందును జయమందుట మనము చూచుట లేదుకదా! ఒకయత్నములో విజయ మందుటకై కేంద్రీకృత దృష్టి (Concentration) యవసరము. అనఁగాఁ దదేకదృష్టి కావలయును. తదితరదృష్టి వర్జించినఁగాని, తదేకదృష్టి యెట్లు లభించును; స్వల్పవిషయములలోనే, ఏకాగ్రదృష్టి, త్యాగము లవసరములైనచో, సృష్టినిర్మాణకర్త నెఱుఁగుటకు మనకెట్టి యేకాగ్రలక్ష్యము,అప్రతిమాన మగుత్యాగము, అవసరములో జెప్ప నవసరము లేదు.

అప్రతిమానప్రజ్ఞావిలసితుఁ డగు మనరాముఁ డీవిషయమును రూఢిగా గుర్తించినాఁడు. సర్వేశ్వరసందర్శనలాభము సర్వసంగత్యాగమును గోరుచున్నదని యాతఁడు గ్రహించినాఁడు. మమకారముతోఁ గూడినబంధములన్నిటిని దెగఁద్రెంపి, నిరంతరనారాయణ నామస్మరణముచే జనించునిర్మలానందవీచికలలోఁ దూఁగుటుయ్యెల లూఁగుచుఁ గాలము గడపు నాయాదర్శవ్యక్తి, రాముని మనోదృష్టిలోస్ఫుటముగాఁజిత్రింపఁబడినాఁడు. సత్యాన్వేషణనిమిత్తము,త్యాగానలములో దుమికి, ద్విగుణీకృత దివ్యకాంతి రేఖలలో బయటికివచ్చు నీమహాకార్యమునకై, మనరాముని హృదయము తహతహలాడిపోవుచున్నది.

అట్టిపరిస్థితిలో రాముఁ డున్ననగర మరుదెంచి, స్వామి వివేకానందుఁడు రామునింటి కతిథిగా వచ్చుట తటస్థించినది. ఎట్టిజీవిత మాచరించుపురుషునిజన్మము ధన్యమయినది, పూజ్యమయిన దని రాముఁడు నిరంతర మూహించుచుండెనో, అట్టి పురుషపుంగవుఁ డగు వివేకానందుఁడు, రాము నెదుట బ్రహ్మానందలీలావిలాసములు తనమధురదరహాసముద్రిత వదనారవిందమునఁ దాండవమాడుచుండఁ బ్రత్యక్షమై రామునింట భుజించినాఁడు; రామునితోఁ దనివితీరఁ బ్రసంగములు చేసినాఁడు. ఇదియే యిరువురు భారతపుత్రవీరులు కలిసిన దివ్యసమయము. లాహోరునగరమున నెన్నివేలమంది జనులు లేరు? వివేకానందుఁడు వేదాంతమునుగూర్చి, మహోపన్యాసము లిచ్చినాఁడు. ఒక్క రాముఁడే వివేకానందమూర్తిముఖమునుండి బయల్పడిన దివ్యసందేశములోని సారమును దనివితీరఁ గ్రోలినవ్యక్తి. మన రామునిమానసక్షేత్రము పరిశుద్ధమై, పరమాత్మమంత్రబీజము ధరించుటకు సిద్ధముగా నున్నది. బీజప్రదాతయగు వివేకానందుఁ డీశ్వరాదేశముచే వచ్చి, విత్తునాఁటి వెడలినాఁడు. రాముఁడు కొలఁదిదినములలోనే వివేకానందుఁడై భారతకీర్తిని దశదిశల మాఱుమ్రోఁగించినాఁడు.

పండుటాకులు వాయువు వీచినంతనే భూమిపై డుల్లిపోవునట్లు మనరాముని హృదయములో నే యల్పములగు సందేహములు, నూఁగులాటలు నున్నవో యవి వివేకానందవేదాంతగర్జామారుతముతో సమూలముగా రాలిపోయినవి. తాను గోరుకొన్న జీవితదివ్యరూపము దివ్యకాంతిపుంజములఁ గ్రక్కుచుఁ

గన్నప్పుటతోడనే రాముఁడు క్షణమాత్రమైన నాలస్యము లేకుండఁ, దనకర్తవ్యమును గ్రహించి, తనచుట్టునున్న పంజరములను దటాలునఁ దన్నివైచుటకుఁ గాలెత్తినాఁడు.

రామతీర్థవివేకానందుల సంఘటనమునుగూర్చి, పురాణసింగు తనయభిప్రాయము నిట్లు వ్రాసియున్నాఁడు; "స్వామి వివేకానందు నీశ్వరప్రేరితవక్తృత్వము, ఆతని జాజ్వల్యమాన సర్వసంగపరిత్యాగము, ఆతని యప్రతిమానవీరవ్యక్తిత్వము, ఆతని యనన్యసామాన్యమోహనవిగ్రహము, ఆతని యమోఘ ధీప్రతిభావిలాసము, నివియన్నియు లాహోరుననున్న యాతని యునికిచే పంజాబు ప్రజాలోకమునకు, మహోద్రేకావేశములను గలిగించినవి. లాహోరులో నాతఁడు "వేదాంతము"ను గూర్చి యిచ్చినయుపన్యాస మాతని మహోపన్యాసములలోఁ జింతామణి............స్వామి లాహోరునగరమున ధ్యానసింగు హవేలీలో బస. ఆభవనములో జరిగిన యాతని యుపన్యాసము విను కుతూహలముతోఁ ద్రోసికొనివచ్చినయా జనసాగరదృశ్యము నాకనుల కింకను గట్టినట్లే యున్నది. నే నప్పుడు, పంజాబువిశ్వవిద్యాలయకళాశాలలో యఫ్. ఏ. తరగతిలోఁ జదువుచున్న బాలుఁడను. అప్పటియాదృశ్యము నాహృదయములో శాశ్వతముగా నాఁటిపోయినది. ఉపన్యాసభవనము నిండిపోయినది. వెలుపల వేలకొలఁదిజనులు స్థలములేక నిలఁబడియున్నారు. స్వామిసందర్శనకుతూహలము ముప్పిరిగొన, నొకరి నొకరు త్రోసికొనుచు జనులు సభామందిరములోఁ బడుచున్నారు. ఆఁపి, నిలఁబెట్టుటకు సాధ్యముకాని జనప్రవాహము

యొక్క యుత్సాహమును బరికించి, స్వామి, తాను బహిరంగో పన్యాస మిత్తునని ప్రకటించెను. బహువిశాలమగు నాబహిరంగ ప్రదేశమునఁ గేంద్రస్థానముల నుపన్యాసవేదిక యెత్తుగా నమర్పఁబడినది. స్వామి వెంటనే వేదిక నెక్కి నిలఁబడినాఁడు. ఆదివ్య మూర్తి స్ఫురద్రూప మాతఁడుకట్టిన కాషాయవస్త్రరుణిమలోఁ జెలగాటములాడుచుండును. యోగాగ్ని విస్ఫులింగము లీను నాతని నేత్రజ్యోతి, చుట్టునున్న వాతావరణమును, మోహింపఁజేసి, యాకర్షించుచుండెను. ఆతఁడు సనాతనభారతమహర్షి వలెఁ బ్రత్యక్షమైనాఁడు. గంటలకొలఁది నీవేదాంత కేసరి గర్జించెను. ఈయుపనిషన్మేఘరాజము, పిడుగులుపడిన ట్లుఱిమి యుఱిమి, ధారాపాతముగ వర్షించినది. సభ్యసాగరము తన్మయతచే మూర్ఛఁ జెందినది.

శ్రీరామకృష్ణపరమహంస యనేక జన్మాంతరతపఃఫలితముగాఁ గాంచిన సత్యసాగరమును గడుపారఁగోలిన యావేశపరంపర లువ్వెత్తుగఁ బొంగి బొరలుచుండ, నుపన్యసించిన వివేకానందవీరపురుషుని వాక్యము లాలించి, అమెరికాఖండము వలెనే, పంజాబుదేశమును గంపితమై పోయినది. వివేకానంద మూర్తినుండి యాత్మజ్ఞాన స్వచ్ఛకిరణజాలములు బహిర్గతములై, నలుదెసలఁ బ్రసరించుచుండ నేను కనులారఁ గాంచితిని.

రామతీర్థుని నే నప్పు డెఱుఁగను. ఉపన్యాసములన్నియు నేర్పాటు చేసిన దాతఁడే. రాముని హృదయములో నిదివఱకే జరుగుచున్న మహాపరివర్తనము వివేకానందసందర్శనముచేఁ బరుగులిడినది. వివేకానందునివలెనే ఖండాంతరముల కేఁగి,

భారతవేదాంతసందేశమును మ్రోగించుకుతూహలము రామునిలో నుద్భవించినది. వివేకానందుఁ డప్పుడే శంకరాచార్యుని మహాప్రతిభచే సుస్థాపితమగు నద్వైత వేదాంతమును, ఆధునికపరిస్థితుల కనుగుణమగు భక్తి, జ్ఞాన, కర్మయోగముల లోనికిఁ దీసికొనివచ్చి, దైనికాచరణయోగ్యముగ బోధించి యున్నాఁడు. రాజకీయమునుగూడ వేదాంత స్తంభములపై నతికిన మొదటివ్యక్తి వివేకానందుఁడే. వివేకానందునిఁ గలిసికొనినవెంటనే, రాముఁడు తన గమ్యస్థానమును, గార్యరంగమును నిర్ణయముచేసికొనినాఁడు. అవ్యక్తముగా నిదివఱకే తనహృదయాంతరమున వెల్గొందుచున్న యాత్మసాన్నిధ్యసాధనలకు వివేకానందసమావేశ మావిష్కరణ మొసఁగినది. వెంటనే రాముఁడు హిమవత్పర్వతగుహలలోనికి వెడలిపోయి, ఈశ్వరసాక్షాత్కారసిద్ధిఁబొంది, వివేకానందుఁడు బోధించిన వేదాంతమునే, యతిలోక స్వకీయధైర్యసాహసములతో బోధింప నారంభించెను. వివేకానందుఁడు లోకమునకుఁ దెల్పిన వేదాంతమార్గమునకు, రాముఁడు వన్నెలుపెట్టి యింకను విశేషధారాళముఁ జేసినాఁడు. స్వామివివేకానందునికి సహజములైన యనర్గళగంగాప్రవాహతుల్యవక్తృత్వముగాని, యాతని సర్వజనసమ్మోహనసమర్థమగు హాస్యమాధురికాని, యాతని యఖండమృగరాజమానవత్వ బలోజ్జ్వలతకాని, రామునికి లేవు ; కాని, రాముఁడు తనకు సహజముగా నున్న పవిత్రముఖసరోజముపై నవ్యవిలాసములతో నృత్యమొనర్చిన భగవత్పారవశ్యముచే నుద్భవించిన యమానుషచిద్విలాసవైభవమునందును, అతని

యానందకీర్తనలలోని మాధుర్యమునందును, ఆతఁడు చూపిన రాధాభక్తిలాలసత్వమునందును వియన్నదీతోయములపై వెల యు స్వచ్ఛఫేనధావళ్యముతోఁ దులతూఁగు నాతని యసమా నావేశ పరంపరలచే నుబికి బయటఁబడిన యూహాసంపుటి యందును, రాముఁడు వివేకానందులను మించె ననిపించెను. అభినవలోక తత్త్వజ్ఞ సార్వభౌముఁడుగా బ్రపంచమహాప్రవ క్తగా, నపూర్వవేదాంత కేసరిగా, వివేకానందుఁడు రాముని మించినాఁడు; కాని, నిరంతరపరమేశ్వర సాక్షాత్కారసంజాతా వేశపూరితుఁడుగా, నూహాతీతవిమలానంద విలాసమూర్తిగా, ననంతకారుణ్యారసతన్మయపరిపూర్ణుఁడుగా రాముఁడు వివేకా నందుని మించినాఁడు. దేశభక్తి పొంగిపొరలిడుటలో, భారత పునర్నిర్మాణసందేశమిచ్చుటలో, ఖండాంతరములలో వేదాంత గర్జనమొనర్చుటలో, రామతీర్థవివేకానందులిర్వురు తుల్యులే." ఇదివఱకుఁ జెప్పినరీతినే, వివేకానందవేదాంతజ్యోతిలోని వేడిఁమి తగిలినతోడనే రాముఁడు తనసన్న్యాసము నిర్ణయించుకొనెను.

రాముని హృషీకేశ హరిద్వారయాత్ర.

అరణ్యవాసములోని కష్టనిష్ఠురములను బరికించి వచ్చెద- నని రాముఁడు 1898 లో హృషీకేశ హరిద్వారములు దర్శిం చుటకు బయలుదేఱెను. కాని, యాతనిహృదయ మాత్మశాం తికై పరితపించుచుండెను. విశ్వమంతయు నారాయణస్వరూప ముగాఁ జూచునాతని దృష్టికిఁ బ్రకృతికాంత మఱుఁగుమాని, స్వేచ్ఛావిహారమొనర్చు నరణ్యములలోని నిసర్గసౌందర్యములు

సర్వేశ్వరసాన్నిధ్యమునే స్ఫురించినవి. పావనస్వచ్ఛ గంగానదీ వీచికల నుయ్యెలనవ్వులలో నాతనికి శ్రీకృష్ణ మురళీగానమాధురి కన్పట్టినది. నిర్నిద్రప్రకృతిరమణీ రమ్యదృశ్యములలో రాధా రమణీ గోపాలసాంగత్యముచే బొందిన యనిర్వాచ్య విమలా నందరసోత్కర్ష రామునికి లభించినది.

రాముం డరణ్యములం బట్టుటలో, భార్యాబంధుమిత్రా దులలోం గలవరము జనించెను. జగమంతయు శ్రీరామ మయ ముగాం జూచు రాముం డింక నింటికి దిరిగివచ్చి, గృహస్థధర్మ ములను స్వీకరించునా యను సందేహములు బయలుదేఱెను. రామునిబంధువులు, రాముని గురువగు భగవద్దన రామునిచే నుత్తరములు వ్రాయించినం దిరిగివచ్చి తీరునని తలంచిరి. భగ వద్దనరాముండును రామునియాత్ర సంసారమును విడుచు యాత్రయేమని యనుమానముపొంది, వెంటనే, వచ్చి గృహస్థ ధర్మములు సక్రమముగా నెఱవేర్పుమని, రామునికిం దీర్ఘముగ వ్రాసియుండెను. రాముండా లేఖల కీక్రింవిధముగ జవాబు లిచ్చెను.

23-ఆగష్టు 1898, హృషీకేశమునుండి.

"గృహమునకుం దిరిగి రమ్మని నీవు ప్రోత్సహించుచు నాకు వ్రాసినయుత్తరము చేరినది. నీయుత్తరము చించి, పరుగిడు చున్న గంగాప్రవాహములోం బారవైచితిని. నాగృహస్థధర్మ ములను సక్రమముగా నిర్వర్తింపకపోవుటలో నేను బాధపడుట లేదా యని నీవు వ్రాయుట చోద్యముగ నున్నది.

శ్లో॥ అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత।
అవ్యక్తనిధనా న్యేవ తత్ర కా పరిదేవనా ?॥

"లోకములోని జీవరాసులపుట్టుక లెప్పుడో మనకుఁ దెలియవు. అంతములు మనకుఁ దెలియవు. వర్తమానములో స్వప్నముగాఁ దెలియును. వీనికై విచార మెందులకు?"

నాపరివర్తనకు లోకులు పరిహాసింతు రని వ్రాసినావు. దానికి నాజవాబిది; కటివస్త్రము చింపి, తలపాగఁ జుట్టి నే నాత్మారాముని వీధులలోఁ గుమ్మరుచుంటిని. ప్రజలు నన్ను దూషింపనిమ్ము. నాకేమి ?

నీయాజ్ఞ తిరస్కరింపవలదని నీవు వ్రాసితివి. నీయాజ్ఞ ననుసరించుచునే యున్నాను. నే నింటికే వెడలుచున్నాను. 'పంజాబు' అను నాశరీరమునుండి 'పరమేశ్వరుఁడు అను గృహమున కరుగుచున్నాను. సత్యముతో సరసములాడుచున్నాను.

ఇది యర్ధరాత్రివేళ. మానవుఁడు కాని యాతనిమాటఁ జెప్పువాఁడు కాని యీచుట్టుపట్ల లేఁడు. అంతరంగమున నా త్మానందతరంగసంఘట్టనానినాదము; బాహ్యమునఁ బ్రవహించుచున్న గంగానిర్మలగానము. ఈ రెంటిని మించిపోయిన నాయాత్మలో నఖండప్రశాంతి. ఇది రాత్రికాదు. నాజీవనాథుఁడగు జగన్నాథునితో రమించురాత్రి. మాయిద్దరసంగమము రహస్యముగా నుంచుటకై యీచీకటి రాత్రివలెఁ గప్పినది.

మాదివ్యసంగమనిశీథిలో బాహ్యాభ్యంతరప్రపంచములు తుడిచివేయఁబడి యదృశ్యములైనవి. ఆనందామృతధారాపాతములు నాకనులలో నూటలూరుచున్నవి. సర్వజీవరాసుల కేంద్రసమాగమస్థాన మగు నాసర్వేశ్వరునియందు వచ్చి మా

వారు ననుఁ గలిసికొనవలసిన దని తెలుపుము. కేంద్రమునకుఁ దూరమైపోవు నీప్రపంచములో మాకలయిక కుదురదు.

శా॥ శాంతారావనిశీథకాలములఁ భాస్వత్సాంద్ర చంద్రాతపా
క్రాంతస్వచ్ఛమరున్నదీపులినరోగ్యక్షోణిఁ గూర్చుండి, జ
న్మాంతోద్వేగుల మైనమేము శివశబ్దావృత్తితో నెప్పు డ
త్యంతానంద భవాశ్రుసంకులదశావాప్తిన్ సుఖంబుందుమో.

(భర్తృహరి)

ఇట్టి బ్రహ్మానందసంపాదననిమిత్తము రాజాధిరాజులు తమ రాజ్యముల విసర్జించి వేయుదురు. దేవతలు సైత మీగంగానదీ తీరమునఁ జేరుదురు. సంసారసాగరావతరణ మొనర్పక తిరిగి వచ్చుటకు నే నేమి యపరాధ మొనర్చితిని ?

ప్రజలు తీర్థముల కేఁగుదురు. తీర్థములు ప్రజలయొద్ద కరుగవుగదా ! తీర్థములలో నివసించుచున్న యీతీర్థరాముని దర్శించుటకు మాయింటివారల నందఱను రామతీర్థునికడకు రమ్మను. ఈశ్వరునిలో నైక్యమై భగవంతుఁ డయిన యీతీర్థ-రామునిదర్శన మప్పుడే కలుఁగఁగలదు. ఈ లోపునఁ గలుగదు. 'సత్య' మనుగంగ నాయింటఁ బ్రవహింపనంతవఱకు నాగుండెఁ కాయ కొట్టుకొనుట మాని యూఁగిపోవును.

మృతిపొందినవారి కెవ్వరును లేఖలను వ్రాయరుగదా! చచ్చినవారిని జూడవలెనన్న, మనమును జనిపోయియే చూడఁ గలము. నాకు శరీర మున్నను నేను మృతుఁడనే ! నావారిని నాకు త్తరములు వ్రాయుట మానుఁ డనుము. కాని, వారును నావలె మాఱినచోఁ గలయికలోఁ గష్టము లేదు.

నాస్వగ్రామమగు 'మురళీవాలా' "మురారివాలా"యే అయినచో, అప్పుడు తీర్థములను బవిత్రముచేయు తీర్థారాముఁ డరుదెంచును. ఎచ్చట నాత్మశాంతిగంగాప్రవాహము ప్రవహింపదో, అచ్చట రాముఁ డుండఁజాలఁడు. తుదకు మృతులయందఱియెముకలును గంగలోఁ జేరవలసినవే కదా! బ్రతికియుండి వారంద ఱేల యిచటికి రాఁగూడదు?

నే నొంటరిగా నుంటి నని నీవు జాలిపడుచుంటివికాఁబోలు. నిజమే! నాయొద్దనొక శిష్యుఁడును లేఁడు. ఇచట మానవుఁడు కాదుకదా. మానవునినీడయైనను లేదు. బంటును లేఁడు. మానవ నివాసము చాలదూరమున నున్నది. ఇది కంటకారణ్యము. ఇది యర్థరాత్రియే. ఆకసము నక్షత్రరాసులతో నిండియున్నది. కాని నే నొంటరినా?

నేనొంటరి నెన్నఁటికిని గాదు. నాపరిచారిక యగువర్ష బాలిక యిపుడే వచ్చి, నన్ను స్నానము చేయించి వెడలినది. నామారుతరూప యగు 'దాసి' పిలువకుండ నిచట నిరంతరము విహరించుచున్నది. నేను పలికినపలుకు లన్నియు సత్యము లని, నానొకరు లగు నేనుఁగులు, పెద్దపులులు గర్జించుచున్నవి. భవనములను మించియున్న యీపొదరిండ్ల గదులలో నివసించుజంతుజాలము లన్నియు నా మిత్రములే, నేనొంటరి నెట్లగుదును?

ఒకవిధముగా నే నొంటరినే! ఒకబంధువుకాని, ఒక మిత్రుఁడుకాని, ఒకపరిచారకుఁడుకాని నాకిచట లేఁడు. అది మారుతము కాదు, మారుతమును నేనే. అది గంగానది కాదు, నాస్వరూపమే. నవ్వుచున్న చంద్రుఁడు నేనే. దేవుఁ డెచటను

లేఁడు. సర్వరూపుఁడను నేనే. నేను వృథా కాలయాపన చేయుచుఁ దోఁచక దుఃఖించుచున్నానని తలఁచుచుంటివా !

నా మానససరోవర మలలు లేక, పరమశాంతిరసము లొల్కుచున్నది. నా హృదయమునుండి బయల్పడుచున్న యానందప్రవాహములు లోకమును ముంచివేయును. నాశరీరములోని ప్రతిరోమకూపమందును నీయానందామృతము పొంగి పొరలఁబాఱుచున్నది. విష్ణుమూర్తిలోనున్న యనంతప్రశాంతి నాతఁ డొక్కఁడు భరింపఁజాలకపోవుటచే, గంగాప్రవాహరూపముగా నాశాంతి యాతని పాదములనుండి లోకమునఁ బడినది. అదేవిధముగా, తీర్థారాముని హృదంతరమం దుద్భవించినబ్రహ్మానందప్రవాహము నాతఁడు భరింపఁజాలక, సర్వప్రపంచకళ్యాణముకొఱకై గంగాస్రోతస్సువలె బయటికిఁ బంపుచున్నాఁడు. రాముఁ డూరక కూర్చుండెనని యెవఁ డనఁగలఁడు ? దయయుంచి యొకసారి వచ్చి యీతీర్థారాముని దర్శనము చేయుము. నీకు వెంటనే మోక్షము లభించును. తీర్థారాముఁడే గంగానది, ఆనందము, సమాధి, శ్రీరాముఁడు !

నేను నేత్రములు విప్పి చూచినంతనే "తత్త్వమసి" "తత్త్వమసి" యను దివ్యనాదము ప్రతిరేణువునుండి వినఁబడుచున్నది. నేను నేత్రములు మూసి, లోపలఁ దిలకించినచో, "అహం బ్రహ్మాస్మి, అహం బ్రహ్మాస్మి" గానము నిరంతరము ఘోషించుచున్నది. ఇఁక నా కేయితరశబ్దముదు వినఁబడదు"

రాముని సంసారత్యాగము

1898 వ సంవత్సరమందే తనయాత్రలకు సాధనలకు ననుగుణముగా నుండదని, రాముఁడు లాహోరుకళాశాలాధ్యాపకపదవికి రాజీనామా నిచ్చివేసెను. ఇదియే రాముని ప్రథమ బహిరంగత్యాగము. ఆత్మశాంతి నార్జించుయత్నములో నడ్డు వచ్చిన తన యున్నతోద్యోగపదవికి రాజీనామా యిచ్చివేసిన యాతనిమనోదృఢిమ సామాన్యులకు వివేకహీనముగాఁ గన్పట్టవచ్చును. సర్వేశ్వరసేవచేయ నుద్యమించి విశాలదృష్టితోఁ గళాశాలసేవ యాతఁడు విరమించెను.

యౌవనములో విషయానంద మనుభవించి, వార్ధక్యములో మునివృత్తి స్వీకరింపవచ్చునని కాళిదాసువంటి మేధావులుకూడ వ్రాసినారు. ప్రపంచములోఁ బెక్కుమంది ప్రజ్ఞానిధులుకూడ నీవెఱ్ఱిలోనే పడుచుందురు. నిజమాలోచించిన నిది సత్యాన్వేషణైకతత్పరునకుండు లక్షణముగాఁ బొడకట్టుట లేదు. ఏకార్యముచేసిన నందు నిర్విఘ్నముగా జయమందవలె నన్న మనోబలము, శక్తి, యున్నియు నవసరము. దేహదార్ఢ్యమనో దార్ఢ్యము లుండి యింద్రియము లుత్సాహముతో శక్తితోఁ జురుకుగాఁ బనిచేయునప్పుడే మనము చేయు యత్నములు సఫలీకృతములగును. సృష్టిరహస్యము నెఱిఁగి, సర్వేశ్వరుని దెలిసికొనుటకంటెఁ గష్టతమకార్య మీలోకములో లేదు. అట్టి మహాఘనకార్యసిద్ధి కావలెనన్న, మనశరీరము పరిశుభ్రయౌవన రక్తముతో నిండియున్నపుడే మనమనస్సు చురుకుగాఁ బని

చేయునపుడే తీవ్రకృషి చేసిన లాభముండును. పట్లు సడలి, రక్తమురంగు మాఱి, యింద్రియపటుత్వ మణఁగిపోయి, మనసు చెదరు వార్ధక్యములోఁ జేయు నిహలోకకృషియైనను ఫలింపనపుడు, భగవద్దర్శనలాభ మెట్లుకలుగును ? కాని సత్యము నెఱుఁగఁగోరువ్యక్తి, జీవితములో నుత్తమబలసమన్విత మగు యౌవనశక్తినే ధారపోయవలయును. మన రాముఁడు చేసినపని యిదియే !

ఉద్యోగమును విసర్జించినను రాముఁ డింకను సర్వసంసారత్యాగమునకుఁ బూనుకొనలేదు. కావునఁ గుటుంబపోషణభారమింకను రామునిమీఁదనే యున్నది. అందుచే రాముఁడు దినమంతయుఁ బనిచేయవలయు నుద్యోగము విసర్జించి, దినమునకు రెండుగంటలే పనిచేసిన సరిపోవు 'ఓరియంటల్ కళాశాల' లోని 'రీడర్' పదవిని జేపట్టినాఁడు. కాని, యీ పదవియందు నాతఁడు కొలఁదినెలలే నిలఁబడినాఁడు. పరమేశ్వరగానము, ప్రత్యక్షముగా, బహిరంగముగా, అనాచ్ఛాదితముగా వెలువడఁజేయు గంగానదీతీరవిపినము లాతనిహృదయమునుబట్టి తమవైపు లాగివేయుచున్నవి.

దీనిని బట్టి తేలున దేమన, రాముఁడు ముచ్చటకొఱకుఁగాని, తాత్కాలికావేశముచేఁ గాని సంసారమువిడిచిపెట్టలేదు. గృహావరోధనములలోఁ బడి జీవి పడుశ్రమ నిరుపయోగమని యాతఁడు బాగుగా గమనించినాఁడు. ఏకాంతములో నున్నపుడంతరంగములో నాసీనుఁడైయున్న జనార్దనుని వాణియే పరిస్ఫుటముగా వినఁబడుట నాతఁడు రుచిచూచినాఁడు.

1898 లో నాతఁడు 'ఆలిఫ్' అనునొకపత్త్రికను స్థాపించి సొంతముగా నొక ముద్రణాలయమును గొని దానికి "ఆనంద ముద్రణాలయ"మని పేరిడినాఁడు. ఈపత్త్రికలో నాతఁడు పరిశుద్ధవేదాంతవిషయములను గూర్చి వ్రాయుచుండువాఁడు. కాని, యీపరిస్థితు లెవ్వియు నాతనికి నచ్చలేదు. ఆత్మానందానుభవము నెఱుఁగని వ్రాఁత లన్నియు నర్థరహితప్రలాపము లని యాతనికిఁ దోఁచినది.

జూలై 1900 సంవత్సరములో రాముఁ డన్నిపదవులు విసర్జించివైచి, భార్యను,పిల్లలను గొలఁదిమందిమిత్రులను వెంట నిడుకొని కొన్నిదినములు వానప్రస్థాశ్రమధర్మము నిర్వర్తింప హరిద్వారము మీఁదుగా 'టెహ్రీ' చేరుకొనెను. అచ్చట పవిత్రగంగానదీతీరముననున్న యొకరమ్యవనమందుఁ గుటీరములోఁ గొందఱు బసచేసిరి.

మార్గమధ్యమున జరిగిన యొక విచిత్రసందర్భమువలన రామునిభక్తి యెట్టి మహోత్తమమైనదో తెలియఁగలదు. ఈవానప్రస్థాశ్రమమునకు రాముఁడు బయలుదేఱినపుడు కట్టుగుడ్డ తప్ప వే ఱెద్దియు నాతనియొద్ద లేదు. వా రరణ్యమున కేఁగుచున్నది, ధనముకొఱకుఁ గాదు. కాని, తోడ నరుగుదెంచిన కొందఱుమిత్రులు చేతినిండ సొమ్ముపట్టుకొనియే వచ్చినారు. రాముఁడు వారెనిఁ బిలిచి యిట్లుపలికెను; "భగవంతుఁడే మనకు సర్వస్వము, ఆతఁడేమన కాధారము నని తలఁచి యాతని ననుభవపూర్వకముగాఁ దెలిసికొన మీరు నాతో బయలుదేఱినారు. మీసర్వయోగక్షేమములను, బరమేశ్వరునిచేతిలోవిడిచి

పెట్టి మరల 'నాపోషణము నేను చేసికొనకపోయినచో నిఁక దిక్కెవ్వ'రనునట్లు మీరు ధనముపట్టుకొనివచ్చుట పరమేశ్వరు ననంత దయాప్రేమములందు విశ్వాసమును విసర్జించుటే యగును. దేవుఁడే భుక్తి, ముక్తి యని మీరు నమ్మితిరా. వెంటనే మీయొద్దనున్న ధనమును, ఉజ్వలోత్సాహముతో గంగాప్రవాహములో విసరివేయుఁడు. అట్లు చేయనిచో ఈశ్వరాన్వేషణము బూటకమగును." రామునినోటినుండి యీశ్వరుఁడే యీవాక్యములు పలికించి నాఁ డని వారు నమ్మి రామనామస్మరణము చేయుచుఁ దమయొద్దనున్న ధనమును వెంటనే గంగలోఁ బాఱవైచి, సంతోషముతో హస్తప్రక్షాళన మొనర్చుకొనిరి.

అనన్యచింతతో నన్నే నిరంతరము నమ్మి భజించువారి యోగక్షేమములను నేనే వహించెద నని పల్కినభగవంతుని వాక్యముల సత్యమును సాధింపయత్నించినవారి కెన్నఁడును లోటు వచ్చియుండలేదు. ఆనాఁడు మధ్యాహ్నమయినది. పరమేశ్వర పదపంకజలగ్న మానసుఁడై, నేత్రములవెంబడి నానందాశ్రు బిందువులు జలజలరాల్చుచున్న రామునిచుట్టువా రందఱును నారాయణనామమును స్మరించుచు నొడలుమఱచి కూర్చుండిరి. యాత్రికులకు సదుపాయము లొనర్చు సంఘమున కధిపతి యగు కలకత్తావాసి రామనాథబాబు పుణ్యక్షేత్రములలో జరుగు నేర్పాటు పరీక్షింప నాసమయముననే మనరామునికుటీరప్రాంతములకు వచ్చి రామునిఁగూర్చి విని సందర్శనము చేయుకోరికతో సమీపించెను. రామనాథబాబు

వారితోఁ బ్రసంగముచేసి, సమీపమున నున్న యొకవర్తకునిఁ బిలిచి, దినమునకు పదిరూకలవిలువ గలబియ్యము మున్నగునవి వారి కిచ్చుచుండు మని యాజ్ఞాపించి వెడలిపోయెను. రాముఁ డీసంగతి బియ్యము పట్టుకొనివచ్చి యిచ్చినవర్తకునివలనఁ దెలిసికొనెను. శ్రీకృష్ణ పరమాత్మయే తా నిచ్చినవాగ్దానమును జెల్లించు నిమిత్తము రామనాథబాబు హృదంతరము నుండి మేల్కొని, మనరాముని కీవిధముగ మేలుచేసినాఁడు. నాఁడు మొదలు రాముని పరివారములోనివా రందఱు నధికోత్సాహమున ధ్యానసాధనలచే భగవంతు నర్చింప నారంభించిరి.

కొన్ని దినము లిట్లు జరిగినవెనుక, ఒకనాఁటిరాత్రి యందఱును గాఢసుషుప్తిలోఁ బడియుండఁగా, రాముఁ డెవరికిని దెలియకుండ నొంటరిగా నుత్తరకాశీవైపు బయలుదేఱెను. కాలికి జోడు లేదు, తలకు గుడ్డ లేదు, గొడుగు లేదు, కటివస్త్ర మొక్కటే యున్నది. అది గాఢనిశీథము. అరణ్యమధ్యము. కన్నుమిన్ను కనఁబడుటలేదు. రాముఁడు బయలుదేఱువార నొక చిన్నమేఘ మేమూలనుండియో కాంచి, పెద్దదై నిముసములో నాకసముఁ గప్పివేసెను. ఎడతెగని యుఱుములు, మెఱపులు, ధారాపాతముగవర్షము, కాలిక్రిందఁ బుట్టలు, చెట్లు, డొంకలు నున్నవి. వర్షములో శరీరము నానిపోయినది. తెన్ను కనఁబడుటలేదు. రాముఁడు వెనుకడుగు వేయఁదలఁచుకొనలేదు. బ్రహ్మానందలీలావిలాసముతోఁ జిందులు ద్రొక్కుచు నాతఁడు ఓంకారము నుచ్చరించుచు ముందుకే సాగినాఁడు. కాని, కొంతదూర మేఁగునప్పటికిఁ గురిసినవర్షము

వెల్లువయై తుదకు నదియై పాఱినది. రాముఁడు కాలిడఁగా భూమి తగుల లేదు. తలక్రిందుగా మున్గిపోయిన గుట్టలడ్డువచ్చినవి. రాముఁడు చలనములేని హృదయముతో బాలునివలెఁ గుతూహలము వెల్లివిరియుచుండ సాహసముతోఁ బ్రవాహము నీఁదె, గుట్టలెక్కి యొక చిన్నకొండపై నిలఁబడి యరణ్యమంతయుఁ బ్రతిధ్వనులతోఁ గంపించునట్లు ప్రణవమంత్ర ముచ్చరించుచుండెను.

రాముని సతీమణి లోకానుభవ మెఱుఁగని ముద్దరాలు. కంటకారణ్యముల కామె తెగించి వచ్చుటకుఁ గారణము నాథుని సన్నిధినుండుట సాధ్యమగుననియే. కాని, రాముఁడు రాత్రివేళ నెవరితోఁ జెప్పకుండ నదృశ్యమగుటతోడనే యామె హృదయము చలించినది. శరీరము వణఁకిపోయినది. భర్తృవియోగము భరింపఁజాలని యాసతీతిలకము రాముఁడు గన్పట్టకపోవుటచే విలపింప నారంభించినది. నిద్రాహారములు మానినది. కొన్నిదినములలో శల్యగతయై నీరసించినది. మఱికొన్ని దినములకు మఱియు నీరసించినది. మఱికొన్ని దినములకు రాముఁడు తిరిగివచ్చినాఁడు. కాని, యామెకు మనశ్శాంతి కలుగలేదు. విచారముచే నీరసించి, కృంగిపోయినది. రాముఁడు భార్యను కుమారుఁడగు బ్రహ్మానందుని నారాయణస్వామికిచ్చి యింటికిఁ బంపివేసెను.

ఆపై నాఱుమాసములు రాముఁడేకాంతవాసము చేసి 1901 వ సంవత్సరములో నొకనాఁడు ద్వారకాశంకరాచార్య పీఠాధిపతియనుజ్ఞ తీసికొని యజ్ఞోపవీతమును గంగామాత హస్త

ములలోఁ బడవైచి, ఓంకారము నుచ్చరించుచు సన్న్యాసమును గైకొనెను. ఇప్పుడు రాముఁడు రామతీర్థస్వామి యయ్యెను. ప్రపంచసంగములను బరిపూర్ణముగాఁ బరిత్యజించి పరిశుద్ధ బ్రహ్మనిష్ఠ నవలంబించి యేకాంతముగా సంచరింపఁగా నారంభించినది రామతీర్థుఁ డిపుడే.

రామతీర్థస్వామి యరణ్యవాసానుభవములు

సర్వసంగములను దెగనఱికివైచి, వాంఛానలజ్వాలలను వైరాగ్యశుద్ధోదకధారలచే నార్పివైచి, సర్వేశ్వరు ననంతచిన్మయానందదరహాసవిలాసముల ననర్గళముగాఁ బ్రదర్శించు సహజ ప్రకృతి సౌందర్యములను దిలకించి యొడలు గగుర్పొడుచున ట్లోంకార మంత్రోచ్చారణానందాతిరేకముచే బాష్పములు నేత్రద్వయమునుండి నిరంతరధారాపాతముగాఁ బ్రవహింపఁ జేయుచు స్వేచ్ఛావిహార మొనర్చునాపుణ్యదినము సమీపించిన వ్యక్తియెంతధన్యుఁడోకదా! విశ్వమే యాతనిమందిరము; సమస్త జీవు లాతని శరీరములోని రక్తబిందువులు; ఆకాశమున విరామములేక వెల్గొందు నక్షత్రమండలము లాతని నట్టింటి మణిరాజములు; మందమలయవాతపోతము లాతనిచేతిలోని విసనికఱ్ఱలు; వియన్నదీనిర్మలోదకము లాతని హస్తగతపాత్రలు; నిరంతరనారాయణస్మరణామృత మాతని భుక్తి: ఆత్మసామ్రాజ్యాధిపత్యమువహించిన యాతనికి భయము గొల్పునది భ్రమపెట్టునది పరిభవించునది పరితాపమును గూర్చునది లోకమున నెద్దియును లేదు.

జన్మాంతరములనుండి జనార్దనసందర్శనలాలసత్వముచే బరితపించి తరించి శృంఖలముల నొకటివెనుక నొకటి త్రెంపివైచి పరమాత్మునడుగుజాడలు సుస్పష్టముగ గన్పట్టు నరణ్యవీథులలో నాత్మస్వాతంత్ర్య మొసగు నప్రతిమానమృగేంద్ర సాహసముతోఁ దన్మయతచెంది విహరించు నాదివ్యపదవి మన రామతీర్థస్వామి కిరువదియేడవయేటనే లభించినది. ప్రకృతి వెనుకనుండి, వివిధసౌందర్యములనుండి తొంగిచూచుచున్న పరమాత్మునితో మనరాముఁడు తనహృదయములను లీన మొనర్చినాఁడు. తా ననుభవించిన యరణ్యవిహారమందలి దివ్యానందము నాతఁడు కొన్ని లేఖలలో మనోహరముగ వర్ణించియున్నాఁడు. రామతీర్థుఁడు వ్రాసినలేఖ లనుపుష్పములలోని మకరందమును మనము చవిచూడఁగలము. 1901 సెప్టెంబరు మాసములో నాతఁ డిట్లువ్రాసినాఁడు: "రాముఁడు సుమేరుపర్వతములో విహరించుచున్నాఁడు.' మంచుదిబ్బలపై నాతఁడు మూఁడు మైళ్ళు నడచినాఁడు. అచ్చటచ్చట నున్న లోంపిలో రాముని పాదములు తొడలోఁతు దిగఁబడిపోవును. ఊపిరి బిగఁ బట్టి బ్రహ్మాండప్రయత్నముతో నాతఁడు వానిని బైకి లాగును. ఇట్లు పోవుచుండఁగాఁ జివర కొక పెద్దమంచుకొండ వచ్చినది. దాని మీఁద రాముఁడు తన కాషాయవస్త్రమును బఱచి కూర్చుండెను. ఈదుఃఖప్రపంచములోని నిరంతరసంతాపరోదనములు కాని,భోగలాలసులగు వివిధమానవుల కాట్లాటలు కాని రామునికిపుడు వినఁబడవు. ఇచ్చట ననంతప్రశాంతి రాజ్యమేలుచున్నది. ఈశాంతిలో నఖండశక్తి యణఁగియున్నది.

"... వాంఛాదాసులగు నో మానవులారా ! వినుఁడు ! కామినీముఖసరోజమున నృత్యమాడు లజ్జాన్వితదరహాసచంద్రికావిలాసములుకాని, రత్నహారరమ్యకాంతిపుంజములుకాని, యసమానశిల్పనైపుణిచే నిర్మింపఁబడిన రాజభవనమందిరములు కాని, ఈసుమేరుపర్వతరాజముచూపు నతిలోకసౌందర్యానందములోని సహస్రాంశమైన నొసఁగఁజాలవు. నీహృదంతరమందు వెల్గొందుచున్న యాత్మారాము నెఱుఁగఁగల్గినచో నందే నీ విట్టికోటిసుమేరుపర్వతములసౌందర్యములఁ గాంచఁగలవు. ఆత్మజయము గాంచిన వ్యక్తిపాదములకడ నణువుమొదలనంతాకాశమువఱకుఁ గల జీవకోటియంతయు దాస్యమొనర్చును. ఈశ్వరుఁడును నీయెదుటఁ గంపము నొందును."

హిమవత్పర్వతమధ్యమున నున్న వశిష్ఠాశ్రమము నుండి రాముఁ డొకసారి యిట్లువ్రాసియున్నాఁడు; "ఇది సూర్యాస్తమయము. ఇప్పుడే వర్షము తగ్గినది. మేఘములు వివిధవిచిత్రరూపములు దాల్చి నలుదెసలకు విడిపోయినవి. విడిపోవుచున్న మేఘములనుండి బయటకు దుమికిన యస్తమయసూర్యకిరణములచే నీమంచుకొండయంతయు మంటలు మండుచున్నట్లు గోచరించినది. అప్పుడీయాకాశసంతానము లగుమేఘము లెన్ని రంగులీనినవో! ఈప్రకృతిచిత్రములలోని వివిధరుచుల నేచిత్రకారుఁడు కని వ్రాయఁగలఁడు ? ఇట్లు చిత్రవిచిత్రముగా మారుచున్న మేఘముల మాటున మార్పులేనివినీలాకాశ మప్పుడపుడు తొంగి చూచుచునే యున్నది. సౌందర్యాతిశయముచేఁ బులకితగాత్రుఁడగు రామునికనులవెంబడి నానందఝురు . లూటలూరుచునే

యున్నవి. మేఘములు కొలఁదికాలములో నదృశ్యములయ్యెను. కాని, అవి యొక శాశ్వతసందేశము నొసఁగి పోయినవి. అవి లోకనాథునియొద్దనుండి కొంత యమృతసరముఁ దెచ్చి యిచ్చి మరల నాతనిఁ జేరినవి. లోకములోని మానసరంజకము లగు వస్తువు లన్నియు నట్టివే! ఈవస్తుజాలము లన్నియు నొక్క-నిముసములో గన్పట్టి యాత్మారామునననంతసౌందర్యము లోకులకు రుచిచూపి మాయమగుచున్నవి. క్షణములో నదృశ్యము లగు నీరూపము లనుమేఘములఁ గాంచి వీనికై జీవిత మర్పించువాఁడు పిచ్చివాఁడు. కాని, లోకు లంద ఱట్టి చంచల పదార్థములయందలి మోహముచే వానితోఁ బ్రాణములకు లంకెపెట్టుకొని, యవి యదృశ్యము లగుటతోడనే బాలురవలె విలపింతురు. ఎంతలజ్జాకరము! ఇది కని నేను నవ్వ నాఁపుకొనఁజాలను!

మఱియుఁ గొందఱు ప్రముఖులున్నారు. నిరంతర పరిభ్రమణము చెందుచున్న యీవస్తుసంతతి యుక్తిప్రయుక్తులతోఁ బరిశీలించు యత్నములో మున్గుచుఁ దేలుచునుందురు. వీరెట్టి మందమతులోకదా! వీరు తత్త్వపండితులు, భౌతిక శాస్త్రజ్ఞులును! ఫలరసముల విడిచి, పిప్పిని నోటఁ గ్రుక్కుకొనువారు వీరే! నామరూపము లనుమేఘము లెవని యాత్మదృష్టి నడ్డుకొనవో ఆతఁడే ధన్యుఁడు. మాయావస్తుజాలములో మెఱయు కాంతి నవలోకించి భ్రమచెందక సమస్త కాంతిపుంజీభూతమగు పరమాత్మజ్యోతిని దర్శించువాఁడే ధీరుఁడు. ఓపికతోఁ బట్టుదలతో మార్గమధ్యమున నింకిపోక, సాగరమును జేరుదాఁకఁ బ్రవహించునదివలెఁ జలించువస్తువుల మోహింపక చలనరహితుఁ

డగుపరమేశ్వరునిఁ జేరుదాఁక వెనుకడుగు లేయని పురుషుఁడే మేధావి. కన్నులకుఁ గన్పట్టువస్తువులన్నియు నదృశ్యములై తీరును. అవి యుత్తరములఁ దెచ్చు జవానుల (Post-men) వంటివి. అవి పరమేశ్వరునుండి ప్రాణికోటికిఁ బ్రేమలేఖలను దెచ్చును. అగ్గిపుల్ల వెలిఁగి నశించిపోవును, కాని వెంటనే దీపమును వెల్గించుకొనఁగల్గు నాతఁడే పుణ్యపురుషుఁడు. ఆవిరి, బొగ్గు, అయిపోవులోపున, రేవుచేరు నౌకయే యానందమొసఁగునది. లోకములోని ప్రతివస్తువును భగవంతుని ప్రతిబింబమును జూపు నద్దముగా నుపయోగించుకొను నాతఁడే సజీవుఁడు. నక్షత్రములతోఁ బర్వతములతో నదులతో సార్వభౌములతో శాస్త్రజ్ఞానులతో నీ ప్రపంచ మట్టివాని నిమిత్తమే చేయఁబడినది. ఇదియే సత్యము !

జీవ మనునది ప్రవహించుచున్నది. సర్వ మీశ్వరమయమే ! మఱెద్దియు లేదు. ఎవరినిఁ జూచి నేను భయపడవలయును? భగవంతుఁడే సర్వప్రాణినాథుఁడు. భగవంతుఁడే నేను. విశ్వమంతయు నాహిమాలయమే! ప్రభాతకాంతులు ప్రసరించినంతనే పుష్పములు నృత్యముచేయును; బ్రహ్మానంద కాంతిసాగరము విశ్వము నావరించియున్నది.

మానవుఁడు తనకాలమునంతను భయములలో సందేహములలోఁ గడపుటకే పుట్టలేదు. నేనెట్లు బ్రతికెదను; ముందునాగతియేమి ? ఇట్టివి తుచ్ఛాలోచనలు ! నీటిలోని చేఁపలు, వృక్షములమీఁది పక్షులు, వీనికిఁగల యాత్మగౌరవాభిమానములైనను మానవుఁడు నేర్చుకొనవలెను. శీతోష్ణముల రెంటి

లో నవి సమముగాఁ దిరుగాడును. నే నాత్మస్వరూపిని. నిరంతరము పడు వర్షధారను నేనే! మెఱుపులోని యందమును శక్తియును నావే. మేఘగర్జానినాదములోని శబ్దబ్రహ్మమును నేనే! నాహృదంతరమునుండి 'శివోహమ్' అనునాదము వెలువడి లోకమును మూర్ఛిలఁ జేయుచున్నది."

స్వదేశోద్ధారణనిమిత్తము స్వామితపస్సు

ప్రపంచములోని దేశము లన్నిటిలో భారతదేశము తపోధన మార్జించు మహానిస్వరూప మని యొకరు వర్ణించినారు. కూరచార్వాకసిద్ధాంతముల నాచరణలోఁ బెట్టుచున్న యిరువదవ శతాబ్దములో నైనను మానవునికి లోకములో నివసించు కాలము కనుఱెప్ప విప్పుమాత్రమే యనియు నీయుఱినమున ములోఁ జీకటియాట లాడి, చీకాకుపడుట కాక, బ్రహ్మజ్యోతిని గాంచుప్రయత్నములోఁ బ్రశాంతి నార్జించుటే కర్తవ్యమనియు నెఱిఁగి, జీవయాత్ర లోకాదర్శముగఁ జేయుమహానుభావులు భారతదేశమునఁ బుట్టియేయున్నారు. కాని, యొకవిశేషమున్నది. భగవంతునిఁ జేరుటే ప్రధానముగా భావించి ప్రపంచమును విడిచి, వనాంతరకుటీరములలో నివసించి, సాధించినవారితెగయే విశేషము. వారిహృదయమునుండి వెల్వడిన తపోగ్నిచే ధర్మశక్తి లోకమున నుద్భవించియుండవచ్చును. మానవునకుఁగల యూహాతీతము లగుసమస్యలఁ బరిష్కరించి, విశ్వకళ్యాణమును వారు సమకూర్చియుండవచ్చును. కాని,

యీదుఃఖమయప్రపంచమున జన్మించి, రోగజరామృత్యుభయాదులచే నలిగి, తరించుసాధనసామగ్రి చేకూర్చుకొనఁజాలక, విలపించుచున్న సోదరకోటికిఁ గన్పట్టు ప్రతిదిన సమస్యలసారమెఱిఁగి పరిష్కరించి మోక్షమునకు రాజమార్గముఁ జూప యత్నించుహృదయముతోఁ దపోధన మార్జించిన మహనీయుల సంఖ్య మాత్రము బహుస్వల్పము.

మనరామతీర్థస్వామి సన్న్యసించి నిజముగా విసర్జించినది ప్రపంచము గాదు. స్వార్థపరమైన గృహము, స్వకీయమనెడి 'అహంకారము'. లోకనాథుని మఱచి, చెఱఁబడినలోకజీవులఁ గట్టివైచిన యజ్ఞానశృంఖములఁ దెగనఱికి, స్వాతంత్ర్యశంఖారవమొనర్చు నుద్దేశముతో రామతీర్థుఁడు సన్న్యసించెను. తాను ముందు బంధములను దుత్తునియ లొనర్చి స్వాతంత్ర్యసౌధము నెక్కనిదే యితరుల నాహ్వానించుట, యీఁదుట చేతకానివ్యక్తి ప్రవాహమునఁ గొట్టుకొనిపోవువానిని దరిఁజేర్ప యత్నించుటే యని యెఱిఁగియే స్వామి సర్వత్యాగమొనర్చి, శక్తినార్జింప హిమాలయముల కరిగి లోకనాథు నారాధించెను.

అన్నిటికన్న ముఖ్యము స్వామిస్వదేశభక్తి. భారతజాతి గుండెలలో శతాబ్దములనుండి కొట్టుకొనుచున్న యవమాన పరంపరలన్నియు స్వామియెదుటఁ బ్రత్యక్షమైనవి. అధఃపతితమై ఆత్మశక్తిరహితమై యడుగంటియున్న హిందూజాతి పడుచున్న కష్టములు దుఃఖములు యాతనలు స్వామిమానసమును బుసుగులవలెఁ గొఱికివేయ నారంభించినవి. ఈశ్వరశక్తి నార్జించి సోదరకోటి కమితముగాఁ బంచి యిచ్చుభావముతోడనే రామ

తీర్థుఁ డరణ్యమున ధ్యాన మారంభించినాఁడు. ఆత్మారామ సందర్శనముచే లభించిన యానందామృతభాండము నెత్తుకొని వచ్చి స్వదేశముపై వర్షించుటకే రాముఁ డుద్యమించెను.

పరాభవపరాధీనతలచేఁ బతితమైనజాతి ధైర్యసాహసములతో లేచి విజృంభింపవలె నన్నఁ గర్మశూరత్వమును బురికొల్పి, విజయదుందుభిని మ్రోగించునది రాజసమే. కాని, కేవలరాజసికశక్తి, అడ్డుకట్టలేనినదివలెఁ బొంగి పంట కుపయోగింపక, పొలముల నూళ్ళను ముంచివైచును. స్వచ్ఛసత్త్వసంశుద్ధ మగురాజసము, సవ్యమగు కార్యక్రమమును జలనము లేక, కుదుపు లేక, నడిపింపఁ గలదు. కేవలరాజకీయనాయకత్వముచే నేజాతియు శాశ్వతనిర్మాణసిద్ధిని గాంచియుండలేదు. పాశ్చాత్య దేశనాయకులు దినమున కొకఁడుగా మాఱుచుండుటకుఁ గారణ మిదియే. భారతజాతినాయకత్వము పావనత్వపరిపూర్ణమగు శక్తిచే వెలయు రాజసమువలనఁ గర్మవీరత్వమును బ్రకటించి నడపించు ధీరునిహస్తములనే వరించినది; వరించుచున్నది. ఈధర్మసూక్ష్మమును రామతీర్థుఁడు గ్రహించినాఁడు. 1902 వ సంవత్సరములో 'టెహ్రీ' నుండి యాతఁడు వ్రాసిన లేఖ యిట్లు పలుకుచున్నది.

"ఎంతవిలువ గలయాహారము లభించుచున్నను, బంధువులు భుజింపుమని యెంత ప్రోత్సహించుచున్నను, గర్భము నుండి యాఁకలి బయలుదేఱినఁ గాని తినవలదని వైద్యులు చెప్పుదురు. నీవు వ్రాసినదంతయునిజమే! నేను వెంటనేబయలుదేఱి వచ్చినచో, కృష్ణనగర రాజ్యప్రధానమంత్రితోడను నీతో

డను సంతోషముతోఁ గాలము గడుపవచ్చును. కాని, నాయంత రాత్మ 'ఆఁగు' మని బోధించుచున్నది. వలయు సామర్థ్యము చేకూరినవెనుక, నింతకంటె నధికప్రయోజనకర మగు సందర్భములు సమకూరునేమో, నిజమే! కర్మముచేయవలయును. మన దేశప్రజలలోఁ బ్రచండకర్మధీరత్వముఁ బుట్టించుటకు వలయు శక్తి నేనిపు డార్జించుచున్నాను. సమయము రానిమ్ము. నీవు నాకు సాయపడెదవుగాక !

"గోరంతలు కొండంతలుచేసి, దంభప్రచారము లొనర్చుటకాక, అఖండశక్తి ప్రభావములచే మాతృదేశమునకు శాశ్వత మగు నుపకారము, చిరకాలముండుసేవయుఁ జేయఁదలఁచినచో, నేనింకను నుగ్ర తపస్సుచేయవలయును.

"పాశ్చాత్యతత్త్వములను, సనాతనభారతీయశాస్త్రములను నే నిపు డాద్యంతముఁ జదివి స్వతంత్రపరిశోధనలు చేయుచున్నాను. కాని యీచదువులో మున్గి, లోకసేవ మఱచువాఁడనుగాను. వర్ణనాతీతశ్రమలకోర్చి, నేనార్జించుచున్న యీజ్ఞానధనమును లోకమునఁ బడి, వీధి వీధుల నింటింటఁ బంచిపెట్టెదను. ఇదివఱకే నేను తలఁచినచో దేశములోఁ బ్రచండచలనము కలిగించియుందును. కాని, నా కొకయంతరాత్మయు, నొకయాదేశమును గలవు. అభినందనములు కాని, లాభములు కాని, నాకవసరము లేదు. ప్రాణభీతి కాని, నరకయాతనకాని, చిత్రవధ కాని, నేను సత్యమని యనుభవపూర్వకముగాఁ దెలిసికొనినవిషయమును బోధించుటలో నడ్డుపడఁ జాలవు.

"సత్యమున కనంతశక్తిప్రభావము లున్నవి. ఈ రామతీర్థస్వామి లోకమున స్థాపింపఁబోవు ధర్మధ్వజము నెదుట, రాజాధిరాజులు, సాధుపుంగవులు, ధనికులు, నిర్ధనులు నందఱు వచ్చి సాష్టాంగపడి యనుసరింపవలసినదే. ఈకర్మము చేయుమని నన్నీశ్వరవాణి ప్రోత్సహించుచున్నది. తదితరములకు నేను సిద్ధపడుచో, నాయందలి యపారశక్తులు వ్యర్థములైపోవును.

నేను లోకమునకు సందేశము నిచ్చుటకే పుట్టినాఁడను. కానిచో, ఈవాంఛ బాల్యమునుండి నాహృదయమున నేల పుట్టి పెరిగినది ? నేను బోధింపవలసియున్నది; లేకున్నచోఁ దల్లిదండ్రులను, భార్యాపుత్త్రులను, ప్రపంచసౌఖ్యములను, ఉన్నతపదవులను నే నేల విసర్జించితిని ? నే నీమంచుకొండ దిబ్బలమీఁద, ఈపవిత్రగంగాతోయములలో నీఁదులాడి, యీ ప్రకృతివైభవములోఁ జూచిన పరమేశ్వరుని దాఁగుడుమూఁతలకుఁ గన్నీరు విడిచి, తపోగ్నిలో నాహృదయమును గాల్చి, యార్జించి యనుభవించినయీజ్ఞానధనము నీశ్వరాదేశావేశముతో, భయరహితాఖండ శూరత్వముతో, మృత్యుదేవత యడ్డమైనను దోసివైచి లోకమునకుఁ బ్రదాన మొనర్చి దాని నుద్ధరించెదను."

రామతీర్థస్వామి 'జపాను' యాత్ర

రామతీర్థస్వామి టెహ్రి సమీపమున నివసించుచుండుటఁ దెలిసి, టెహరి మహారాజు స్వామిని దర్శింప విచ్చేసెను. రామతీర్థునననంతభక్తిభావములు, నాతని యసామాన్య ప్రతిభ

ఆత్మస్వాతంత్ర్యము, వీనిని జూచి, మహారాజు స్వామి పాదసేవ చేయ నారంభించి యాతని ప్రధానభక్తులలో నొకఁడయ్యెను.

ఆతరుణమున హిమాలయములలోఁ దిరుగాడుచుఁ బంచభూతములు తనకు బానిసలై యెట్లు సహాయపడినవో రాముఁ డీక్రిందివిధమునఁ దెల్పియున్నాఁడు; "ఈవిశ్వమంతయు నాశరీరము, మహానదు లన్నియు నారక్తనాళములు, పర్వతము లన్నియు నాయెముకలు. నాశరీర మెచటనైన దురదపెట్టినచో నప్రయత్నముగా నాహస్త మెట్లు సాఁగి గోకికొనునో యట్లే నాయాత్మావసరము లన్నియుఁ గాంచి యప్రయత్నముగాఁ బ్రకృతి నాకు సాయపడుచున్నది. అన్యులకు స్పర్శమాత్రముచే మరణమును గల్పించు హిమవన్నగము నాకాళ్ళకు మృదువైన తెల్లనిపఱుపు పఱచి పరుండుమని యాహ్వానించినది. ఈపర్వత పవిత్రశిలాస్థలములపైఁ గాళ్ళకుఁ బాదరక్షలు తొడిగికొని నడచుట భరింపరానిదోషము. నా పాదములలోని మాంసము నీఱాలలోనిమాంసము నొకదాని నొకటి ప్రేమపూర్వకముగాఁ దాకినపుడే పరస్పరజ్ఞాన ముదయింపఁగలదు. మానవుఁడు తన కున్న మహాదురహంకారమును విడిచి గంగలోఁ గలిపివేసినచో నాతఁడే భగవంతుఁ డగును. తన హృదయమునుండి భగవంతుని పాదములయొద్దకుఁ బరమేశ్వరునుండి తనహృదయమునకు నఖండానందప్రవాహమును బ్రసరింపఁ జేయుమానవుఁడే దేవుఁడు. శివుఁడను నేనే! మలబారు, చోళ మండలము నాపాదములు; రాజపుత్రస్థానములోని యెడారియే నాఱొమ్ము; వింధ్యాచలము నాకటిప్రదేశము; నాహస్తములను

తూర్పునకుఁ బడమటికి ననంతముగాఁ జాపినాఁడను; హిమాలయశిఖరములు నాశిఖలు; నాశిఖలోనుండి ప్రవహించునదే స్వచ్ఛధవళగంగ; నేనే భారతవర్షము; సమస్తజీవములు నేనే! పరమాత్మస్వరూపిని నేనే." ఈతీరున భారతవర్షముతో నదులతోఁ బర్వతములతో విశ్వముతో నైక్యమై పలుకురాముని కనులనుండి యానందబాష్పధారలు వర్షించినవి; కడుపు చెక్కలగునట్లు నవ్విన యాతనినవ్వులో రవిద్యుతి రాజిల్లినది; ధ్యానముద్రలను మంచు కురిసినది; నిజముగా రాముఁడే ఆత్మారాముఁడుగా మాఱిపోయినాఁడు,

ఈసమయములో రామతీర్థుఁడు తా ననుభవించుచున్న యానంద 'మితరులకుఁ బంచిపెట్ట నువ్విళ్లు లూరుచుండెను. ఆతని హృదయచలన శబ్దముతోపాటు లోకసందేశము తటతటఁ గొట్టుకొనుచున్నది. ఇట్టిస్థితిలో, టెహరిరా జొకవార్త పట్టుకొని స్వామిని దర్శించెను. జపానుదేశములో 1893 వ సంవత్సరములో "షికాగో"లో జరిగినరీతి నొక ప్రపంచమతమహాసభ జరుగనున్నదనియు, వెంటనే బయలుదేఱి వెడలిన వేదాంత సందేశ మొసఁగనగు ననియు రాజు స్వామితోఁ జెప్పి ప్రోత్సహించెను. స్వామి యంగీకరించి వారముదినములలోనే పయనమై వెడలెను.

స్వామి జపానుచేరిన మొదటిరోజున 'వాసిమాల్ యశోమాల్' కంపెనీవా రాతనికి స్వాగత మిచ్చిరి. మఱునాఁడు స్వామి నారాయణస్వామితోఁ గలిసి 'ఇండో జపానీస్' భవనమకడ కరుదెంచెను. ఈ మందిరమునకుఁ బ్రఖ్యాతకవిపుంగ

వుఁడును, సిక్కు-మతస్థులలో శ్రేష్ఠుఁడు నగు పురాణసింగు కార్యదర్శి. పురాణసింగు స్వాముల నిరువురను జూచినంతనే యాతనిహృదయ మెంతులకో యలవికాని యానందము ననుభవించినది. వారి నిదివఱ కెన్నఁడును పురాణసింగు చూచి యుండలేదు. కాని, వారిలోఁ బ్రత్యక్షముగా వెల్గొందుచున్న యాత్మవికాసలక్ష్మి యాతని నాకర్షించినది. నారాయణస్వామి "మీ దేశమేది?" యని పురాణసింగు నడిగెను. నేత్రములవెంటఁ గన్నీరుమున్నీరై ప్రవహింప గద్గదకంఠముతో "విశ్వమంతయు నా దేశమే" యని పురాణసింగు బదులుచెప్పెను. ఆమాట మీఁద "లోకహితముచేయుటే నామత"మని రామతీర్థస్వామి పలికెను. రామతీర్థునకుఁ బ్రధానశిష్యుఁడై రామతీర్థస్వామి జీవితచరిత్ర మాంగ్లమున వ్రాసి ప్రకటించిన పురాణసింగు రాము నీవిధముగా మొదటఁ గలిసికొనెను.

ఆనాఁడు రామతీర్థస్వామి బౌద్ధవిశ్వవిద్యాలయభవనమున నుపన్యసించెను. సభ్యులు సమ్మోహితులై వినిరి. రామతీర్థస్వామియుపన్యాసములో నెంతయమృత మిమిడియున్నదో యీక్రిందివిధమునఁ జెంతనున్న పురాణసింగు వర్ణించినాఁడు; "రామతీర్థు నెదుటనున్నను నే నాతని యుపన్యాసమును వినలేదు. ఏలన, తనమనోహరునిఁ జూచి ప్రణయానందతన్మయత్వములోఁబడి యొడలు మఱచు యువతివలె స్వామిని జూచినంతనే నేను మోహావివశుఁడనైతిని. అతనివిగ్రహము దర్శించుటచే నాహృదయము స్మృతి తప్పి గంతు లిడినది. మతిలేనివానివలె నే నిటునటు తిరుగాడితిని. సభారంగమునుండి బయటికివచ్చి

మఱల లోని కరిగి మఱల నెందులకో బయటకు వచ్చువాఁడను. ఆతని సమ్ముఖమున నే నాఁగఁజాలకపోతిని. కాని విడిచియు నుండఁజాలనైతిని. అతనిని నేను ప్రేమించితిని. నే నొక యువతినైనచో నామనోహరమూర్తి యగు రామతీర్థుని నాథునిగాఁ బడయుటకు సర్వస్వ మర్పించి యుండెడిదానను. ఒకటి మాత్రము నిజము. అతఁడు పల్కినదొక్కయక్షరమైనను నేను వినలేదు. కాని; యాతనినోటినుండి వెడలినమాట లన్నియు నా హృదయములో నప్రయత్నముగా నాఁటుకొనిపోయినవి."

రామతీర్థస్వామి ప్రపంచమతమహాసభ జపానులోజరుగు నని విని వచ్చినాఁడు. కాని, సభవిషయ మసత్య మని తేలినది. రాముఁ డాసంగతి నెఱిఁగి దిశలు మాఱుమ్రోఁగునట్లు నవ్వి "ఎంతచిత్రము చేసి ప్రకృతి నన్ను హిమాలయగుహల నుండి బాహ్యప్రపంచరంగమునకుఁ దీసికొనివచ్చినది ! ఒకచిన్న యసత్యవార్త యెట్టిఘనకార్యమొనర్చినది ! రాముఁడే ప్రపంచ మతమహాసభ. టోకియోలో సభ లేకపోనిండు. రామునిలో నిరంతరమును జరుగుచునే యున్నది !'' అని యాతఁ డనెను.

జపానునకు ముఖ్యనగరమగు 'టోకియో' విశ్వవిద్యాలయమున సంస్కృతాధ్యాపకుఁ డగు 'తకాకుసు' పండితుఁడు రామతీర్థస్వామిని గూర్చి యిట్లు పలికినాఁడు; "ఇంగ్లండులో మ్యాక్సు ముల్లరుదొరగారి యింటియొద్దను, తదితరస్థలము లందును పండితులను, తత్త్వశాస్త్రవేత్తలను నేను చూచితిని కాని, తత్త్వశాస్త్రసారము మూర్తీభవించిన శ్రీరామతీర్థ స్వామివంటి మహావ్యక్తిదర్శన మెన్నఁడు నాకిదివఱకు లభించి

యుండలేదు. బౌద్ధమత వేదాంతమతము లాతనిలో లీనమైనవి. అతఁడే సత్యమతస్వరూపుఁడు. అతఁడే కవిపుంగవుఁడు, ఋషీంద్రుఁడు.

వేఱొకదినమున టోకియో పారిశ్రామికకళాశాలాభవనములో "కర్మసాధనరహస్యము"ను (The Sereet of Success) గూర్చి స్వామి యుపన్యసించెను. ఆయుపన్యాసములో స్వామి; "నే నిచటకు మతమహాసభనిమిత్తము కాక పురాణసింగునకు ముక్తిమార్గము చూపుటకే వచ్చినా" నని ప్రేమరస ముట్టిపడఁ బల్కెను. ఆమాట విన్నంతనే పురాణసింగు సన్న్యాసము స్వీకరించి స్వామికి శిష్యుఁడయ్యెను.

టోకియోనగరవీధులలో రామతీర్థస్వామి నడచుచుండఁగా దుకాణములయొద్దనున్న స్త్రీలందఱు తమతమ పనులు మాని స్వామిని వెంటాడిరి. వెంటాడుటయేకాక, అతని యెదుట నిలఁబడి యౌవనవమోహనవిగ్రహమును దదేకదృష్టితో వీక్షించి, "మాయందముకంటె స్వామిసౌందర్యమే విశేషముగా నున్నది. అనుమతి యొసఁగినచో మేమందఱ మాతని వివాహమాడుట కభ్యంతరములే"దని పలికిరి,

'కర్మవిజయరహస్యమును' గూర్చి యాతఁడు టోకియోలో నొసఁగిన యుపన్యాసములోని కొన్నివాక్యము లివి :

"జపాను నాదేశమే యనియు, జపానీయులు నాదేశీయులే యనియు నాయుద్దేశము. మీతాతలు ముత్తాతలు భారతీయులే యిచటకు వలసివచ్చినా రని నేను ధ్రువపఱుపఁ

గలను. కాఁబట్టి మీకును నాకును బీజప్రదాత లొకరే! అందుచే నేను మీకుఁ బరదేశీయుఁడను గాను. సోదరుఁడనే! ఈ కారణములచే మీకు బోధించుహక్కు నాకుఁ గలదు.

శరీరములకు సుఖముఁ గోరి, తుచ్ఛేంద్రియానుభవములకై మీశక్తిని వ్యయించినచో మీరు గమ్యస్థానము నెన్నఁడును జేరలేరు. మాంద్యమే మరణము. కర్మమే ఆనందము. కదలికలేని గోతినీటిని జూడుఁడు. పరుగిడుచున్న నదీప్రవాహమును గాంచుఁడు. నిరంతరము చలించు ఈప్రవాహములోని నీరు స్వచ్ఛమై, ధవళమై త్రాగు మని యాహ్వానించుచున్నట్లున్నది. గోతిలోనినీరు దుర్గంధముల కాలవాలమై యసహ్యాకరముగ నున్నది. జయము కోరినచో నదీప్రవాహ మొసఁగు నిరంతర కర్మసందేశము ననుసరింపుఁడు.

ఒకవిత్తు మహావృక్షము కావలెనన్నచో మొదట నది నాశన మందవలయును. ఆత్మార్పణమే ఫలసిద్ధికి జీవదాన మొనర్చునది......నే నెప్పుడు పరిపూర్ణస్వాతంత్ర్యమందఁ గలను? 'నేను' భావము పండుటాకువలె డుల్లిపోయినపుడే విజయకాంక్ష కార్యతన్మయత్వములో నణఁగి నశించినప్పుడే విజయలక్ష్మి నిన్ను వరించును.

ప్రేమ కర్మవిజయసూత్రములలో నింకొకటి. హస్తము బ్రతుకవలెనన్నచోఁ దక్కిన శరీరావయవములన్నిటితో నైక్యమై కృషిచేయవలయును.

"నిత్యసంతోషినే జయలక్ష్మి తప్పక వరించును. సోదరులారా! మీరు సహజాత్మప్రకృతిచే నానందమూర్తులు.

మీయౌవనముఖసరోజముల నృత్యమాడుదరహాసచంద్రికలను జూచి నేనుబ్రహ్మానందవివశుఁడ నగుదును. మీరు సంఫుల్ల పుష్పస్వరూపులు. ఈయానందముద్ర, ఈ దరహాసవిలాసము, మీముఖాంబుజములనుండి యెన్నఁటికిని దఱిమివేయకుఁడు. న్యాయభవనములో న్యాయాధ్యక్షుఁడు వచ్చి యాసీనుఁడగును. ఆతఁడు న్యాయవాదులను, 'ముద్దాయీలను', 'ఫిర్యాదులను' సాక్షులను బిలువనక్కఱలేదు. ఆతఁడు వచ్చినంతనే సమస్తము జరిగిపోవును. అట్లే యానందతరంగడోలికల నూఁగులాడుచు మీరు ఫలాపేక్ష విడిచి కర్మముచేయుట కారంభించినచో మీరు వలయుసామగ్రిని బ్రకృతియే సిద్ధపఱచి విజయము చేకూర్చును.

కర్మసిద్ధికిఁ బ్రధానము భయరాహిత్యము. ప్రేమమయ మగునొక్కవీక్షణముతో సింగములను మేకలవలెఁబెంచవచ్చు; శత్రువులను మిత్రులనుగా మార్చవచ్చు; నిర్భయత్వమున్న విశ్వమును నిర్జింపవచ్చు. దట్టము లగుహిమాలయ పర్వతము లలో నేను తిరుగాడితిని. పెద్దపులులు, విషసర్పములు నన్నుఁ గనిసికొనినవి. అవి నన్నేమియుఁ జేయలేవు. నిర్భయదృష్టి వానివైపు నే నీక్షించితిని. అవి నన్నుఁ జూచి బెదరి పరుగెత్తి నవి. భయము వీడినచో మృత్యువైననుసరే పాఱిపోవును.

ఒకసారి యోడమీఁద నుండఁగా నొకపంజాబుసిపాయి జబ్బుపడెను. ఓడలోని డాక్టరు సిపాయిని బరీక్షించి "ఈతని రోగము ముదిరినది. ఇఁక నీతని నోడలో నుంచినచో నీరో గము వ్యాపించి యందఱను జంపును. కావున, నీతనిని నీటిలోఁ

దోసివేయుఁ"డని యాజ్ఞాపింపఁ బోయెను. సిపాయిసంగతి స్వామి కనిపెట్టెను. జబ్బులో నున్నసిపాయి రణరంగమున నిలఁబడుయోధునివలె లేచి భయమును సాగరమునఁ బడవైచి, డాక్టరును సమీపించి, తుపాకి పైకిఁ దీసి "నాకు రోగము ముదిరినదా? ఆమాట నీవు పలికెదవా? ఇదిగో ! ఈ తుపాకితో నినుఁ గాల్చివేసెద"నని రోషముగాఁ బల్కెను. భయకంపి తుఁడై వెంటనే డాక్టరు సిపాయికి 'ఆరోగ్యపత్త్రము' వ్రాసి యిచ్చెను."

రామతీర్థస్వామి—అమెరికా జీవితము

స్వామివివేకానందు ననంతరము వివేకానందతుల్యధీరత్వముతో నాత్మానుభవముతో మోహనమూర్తిమత్త్వముతో ననర్గళగంగాప్రవాహవేగముతో వేదాంతదుందుభి నమెరికా ఖండములో దిగ్విజయముగా మ్రోఁగించిన మహావ్యక్తి రామతీర్థస్వామి. అమెరికాప్రజల లాతని మహోపన్యాసములు విని బ్రహ్మానందపరవశులైరి, అమెరికాపత్త్రిక లాతని నభినవక్రీస్తుభగవానుఁ డని, వేదాంతమృగరాజ మని, సనాతనభారతధర్మమూర్తి యని, నిరంతరపరమేశ్వరపాదైకలగ్నమానసభక్తాగ్రేసరుఁడని వేనోళ్ళఁ బొగడినవి. రామతీర్థుఁడు రెండున్నరసంవత్సరములే అమెరికాలో నుండినది. కాని, ఈస్వల్పకాలములో నాతఁడు చూపినయాదర్శజీవప్రవృత్తి, అమెరికా దేశచరిత్రములో సువర్ణాక్షరములతో శాశ్వతముగా లిఖింపఁబడినది.

అతఁ డీదినములలోఁ బల్కిన వేదాంతవాక్యరత్నము లాకస మున నున్న నక్షత్రములవలె విశ్వప్రపంచసారస్వతములో వేలకొలఁది ప్రజలకు మార్గప్రదర్శకములై నిరంతరనవ్యసౌరభ ములతోఁ బ్రకాశింపఁగలవు.

రామతీర్థుఁడు తనకాలము నంతను 'కాలిఫోర్నియా'లోఁ గడపినాఁడు. డాక్టర్ హిల్లర్ దొర స్వామికిఁ దనయింట నాతిథ్య మొసఁగి యశేషభారతజాతికృతజ్ఞతకుఁ బాత్రుఁడై ధన్యుఁ డయ్యెను. కోటీశ్వరులు తమభవనములలో నుండుమని ప్రార్థిం చినను బట్టణప్రాంతముల నున్నకొండలోయల కరిగి ప్రకృతి కాంతయొడిలో స్వామి పవ్వళించువాఁడు. డాక్టరు హిల్లర్ దొరగారియింట నున్నపుడు దినదిన మాతఁ డడవి కేఁగి పుల్లలు కొట్టి కూలివానివలె నెత్తి నెత్తుకొని వచ్చుచుండువాఁడు. "శాస్తాపాతముల" (Shasta springs) కడ నున్నపుడు, రాముఁడు చాల శ్రమపడువాఁడు. అమెరికావంటి దేశములో నుండి, రాముఁడు కాయికకృషి చేయకుండ టాతనికి నచ్చ లేదు. రాముని కేకాంతవాసమే ప్రియతమ మైనది. శాస్తా పర్వతశిఖరమును మొట్టమొదట నెక్కి జయముపొందిన వ్యక్తి రాముఁడే. ఈవిజయము నభినందించి, అమెరికావా రీయఁ దలఁచిన బహుమానమును రాముఁడు తిరస్కరించినాఁడు. 'ఈతనిపర్వతారోహణవిజయమును వర్ణించిన పత్రికలు లక్ష లాది ప్రజలలో వ్యయమైపోయిన'వని రాముఁడే పలికినాఁడు.

రాముఁడు శాస్తానదీతీరమున నొక ఊయల కట్టి యం దూఁగుచుఁ జుట్టునున్న పక్షిగానములతోఁ గలిసి 'ఓంకారము'

నుచ్చరించుచు, "అమెరికాదేశ సార్వభౌమునికైన నందరాని దివ్యానంద" మనుభవించువాఁడు.

అమెరికాలోని తన యనుభవములనుగూర్చి, రాముఁ డిట్లు చెప్పి యున్నాఁడు; "ఒకసారి రామునియొద్ద కొక ధనికు రాలగు యువతి వచ్చినది. ఆమెకు రాముఁడు 'గంగాదేవి' యని పేరు పెట్టినాఁడు. ఆమె తన ధనము, గృహము, భూమి, సమస్తము రామునికర్పించి తాను సన్న్యాసినిగా నుందునని పలికెను. కాని, రాముని కవి యేల? ఆమెహృదయము బహు విశాలమైనది. "స్వామిజీ! అమెరికాప్రజలకు నీ వేదాంత మర్థ మగుచున్నదా" యని యడుగ స్వామి యిట్లు పలికినాఁడు;

"లేదు. నా వేదాంతసిద్ధాంతముల నమెరికావారు, భౌతిక ప్రపంచములో నాచరణలోఁ బెట్టుచున్నారు. ప్రపంచములోని సర్వజాతులు నీ వేదాంతమును, మానసికాత్మ ప్రపంచములో నాచరింపవలయు నని నాకోరిక. పశ్చిమఖండమంతయు, నెట్టి విశాలరాజ్యములు స్థాపించుచున్నను, భౌతికపరిస్థితులకే కట్టు వడి, మానసికాత్మజీవనమును గుల్లఁబెట్టుచున్నది. కాని, భారత దేశ మంతకంటె నుచ్చస్థితిలో లేదు. భారతదేశ మాత్మకృషి విడిచి యంధకారమునఁ గ్రుమ్మరుచున్నది. వేదాంత మొక స్థిర మగు పరిపూర్ణసత్యము. అందు విభాగములు లేవు. ఈసత్య మును బూర్ణముగానైన నాచరింపవలయును; లేదా మరణమే శరణ్యము. మధ్యేమార్గము లేదు. కాని యీ కాంక్ష, అజీర్ణ రోగికిఁగల భోజనకాంక్షవంటిది. సంప్రదాయములు, ఆచార ములు, విశ్వాసములు, జాతిభేదములు, నివి యన్నియుఁ గలిసి,

భారతవర్షమును గదలికలేని యొక శిలామార్గమునకు బంధించి, జీవమారుతము పోవునట్లుచేసినవి.

ఆధ్యాత్మిక జీవితవిషయములో దేశములను విభజించి, యీ దేశములు మంచివి, యివి కావని చెప్పుట సాధ్యము కాదు. ప్రతిదేశమందును గొలదిమంది స్త్రీలు, పురుషులు నున్నారు. వారే దేశము. మిగిలినవారి జీవితములు లెక్కలోc జేరవు. దేశమునకు జీవతంతువులగు నట్టి మహాత్ములను గలిసి కొనుటకాని, సామాన్యులc జూచుటకాని, దేశయాత్రలోc దటస్థించును. నీవు చూచిన పురుషుల జీవితముల నాధారము చేసి కొని, దేశముపై నభిప్రాయము ప్రకటించుటచే నది సత్యాభిప్రాయమెన్నcడును గాcజాలదు. నరకము, స్వర్గమును, రెండు నొకేగృహములో నొకేశరీరములో నుండవచ్చును. ఇట్లే అన్ని దేశములలో. నన్నికాలములలో, నరకస్వర్గదృశ్యములు రెండును బ్రత్యక్షమగుచుండును. నీవు చూచినదృశ్యము ననుసరించి నీయభిప్రాయము తెల్పెదవు. కాcబట్టి ప్రతిదేశములో నున్న కొలcదిమంది మహాపురుషులను, స్త్రీలను నీవు పరికించినచో, లోకములో నన్నిదేశములు సమానమగు నాత్మధర్మమును సౌందర్యమును నీతిని గలిగియున్నవని తేలును."

అమెరికావారికి హిందూ తత్త్వశాస్త్రము బోధించుట సుసాధ్యముకాదు. ఈకార్యమునకు విశేషమగు నాత్మసాధన మవసరము. విశ్వవిద్యాలయవిద్యార్థులే మన వేదాంతము నర్థము చేసికొన సమర్థులు. ధనికురాం డ్రగుయువతీమణులు, తమయిండ్లలో సేవకులు లేక, మనవిచిత్రవాక్యములు వినుటకుc

గాని, మనవిదేశముఖములఁ దిలకించుటకుఁ గాని, మనచుట్టును గుమిగూడుదురు; కాని, వారిది కేవలతత్త్వాన్వేషణవాంఛ కాదు, కాలక్షేపవాంఛయే. రాముని సందర్శించినవందల కొలఁది అమెరికా యువతులలో నిరువురే నిజమగు మతాభిలాషిణులు. వారిలో నొకతెకు రాముఁడు "గంగామాత"యని పేరిడినాఁడు.

ఒకనాఁడు అమెరికాయందు విశేషఖ్యాతి గల యొక నటీమణి రామునిదర్శనము కోరినది. రాముఁ డంగీకరించెను. రత్నహారములు, విలువగలమణులు నామె యాభరణములు, ఆమె బట్టలకుఁ బెట్టుకొనిన 'అత్తరు' సువాసనలచే నాపట్టణ మంతయు ఘుమఘుమలు కొట్టుచుండెను. ఆమె ముఖాంబుజమున నవ్యదరహాసము క్షణక్షణమునకు నూత్న తరంగముల నీనుచుండెను. కాని, యామె వచ్చి రామునిపాదములకడ బడి దుఃఖింప మొదలుపెట్టెను. "స్వామిజీ! నాకు జీవితము దుర్భరముగ నున్నది. ఆనందము కలుగుమార్గమును జూపుము. నాకంఠములోని మణిహారములసొంపు, నాముఖమందలి దరహాసవిలాసము చూచి నేను సుఖపడుచుంటినని భ్రమపడకుము. ఇవి నాకలవాటుచే వచ్చినవి. ఇవి నాకు దుర్భర మగు మనస్సంకటమును గలుగఁజేసినవి." ఈమెకుఁగలయనుతాపము పశ్చిమ ఖండనాగరికత యనుతాపమువలె రామునికిఁ గన్పట్టెను.

వేఱొకనాఁ డింకొకవనిత రాముని దర్శించెను. ఆమె పుత్త్రునిఁ గోల్పోయి, సౌఖ్యమార్గముఁ దెల్పుమని రాము నడిగెను. రాముఁడిట్లనెను; "ఆనందమును రాముఁడు విక్రయిం

చుచున్నాఁడు. కాని, నీవు దానికి వెల నొసఁగవలయును.” “ఎంతవెలనైన నొసఁగెదను స్వామీ! ఏమైననుసరే యిచ్చెద” నని యామె పల్కెను. “ఆనందరాజ్యములో ‘చెలామణి’యగు నాణెము ‘వే”అని రాముఁ డనెను. “ఏదైనను నిచ్చెద” నని యామె మఱల జవాబు చెప్పెను. “సరే! ఒకనీగ్రోబాలుని దీసికొని నీపుత్త్రునివలెఁ బ్రేమించి పోషింపుము. ఇదియే యానందముయొక్క వెల” యని రాముఁడు పలికెను. “ఇది సాధ్యమా? స్వామిజీ!” యని యామె పలుకఁగా, “ఆనందము మాత్రి మూరక లభించుట సాధ్యమా!” యని రాముఁడు బదులుచెప్పెను.

ఒకసారి రాముఁ డొక అమెరికావిశ్వవిద్యాలయభవనమున ‘భారతదేశమునకుఁ బ్రపంచముయొక్క యాధ్యాత్మిక ఋణము’ను గుఱించి యుపన్యసించెను. పశ్చిమఖండములోఁ బ్రసిద్ధిగాంచిన తత్త్వజ్ఞులందఱు వేదాంతమునే భాషాంతరీకరణములమూలమునఁ జదివి విశేషము కొనియాడియున్నారు. కాంటు, సోపెన్హాయర్, ఫిక్టే, మాక్సుముల్లర్ మున్నగువారు తమసిద్ధాంతములను, జవిచూచియే స్థిరపఱచుకొనియున్నారు. సోపెన్హాయరను జర్మనుతత్త్వవేత్త యిట్లు వ్రాసియున్నాఁడు; “వేదాంతమువలె, నాత్మోల్లాసము కలిగించుమతము ప్రపంచములో మఱెచ్చటను లేదు. ఉపనిషత్తులే నాజీవితమున కూఁత గఱ్ఱలైనవి; నామరణకాలమున నవియే నాకు శాంతి నొసఁగఁగలవు.”

ఫ్రెంచిమతచరిత్రకారుఁ డగు విక్టర్కసిన్ అనునాతఁ

డిట్లు వ్రాసినాఁడు; "సనాతనభారతీయులు దేవునిఁగూర్చి స్వచ్ఛమగు జ్ఞానమును కలిగియుండి రనుటలో సందేహము లేదు. హిందువులతత్త్వశాస్త్రము, వారి వేదాంతము; నిరుపమానజ్ఞానామృతమయములు. వారి జ్ఞానప్రచండచండకర తేజము నెదుట, పశ్చిమఖండవాసులవిజ్ఞానము మినుకు మను చేతిదివ్వెవంటిది.

స్వామియుపన్యాసమైన వెనుక, విశ్వవిద్యాలయాధ్యక్షుఁడు తనగుమాస్తాను బిలిచి, రామతీర్థులవారికి బహుమానముగాఁ గొన్నిగ్రంథములు తెమ్మని యాజ్ఞాపించెను. 'గుమాస్తా' తెచ్చినపుస్తకములలో నొకటి 'అట్ట' కొంచెము చినిఁగియుండుటఁ గాంచి, అధ్యక్షుఁ డిట్లనియెను; "స్వామియుపన్యాసమును నీ విపుడు వినలేదా! ఈగ్రంథము లెవరి కీయవలయునో నీకుఁ దెలియునా? పరమాత్మస్వరూపుఁ డగు రామునకుఁ గానుకగా విశ్వవిద్యాలయ మీ గ్రంథముల నర్పించుచున్నది. పోయి నూతనగ్రంథములు దెమ్మని పంపెను.

రామతీర్థుని అమెరికా జీవితము.

రామతీర్థస్వామి పశ్చిమఖండమున కొకప్రత్యేకమత సందేశకుఁడుగా వెడలియుండలేదు. ఒకసంఘముచేఁ బంపఁబడను లేదు. ఒకయుద్దేశ మాతనిగర్భమున నుండి, యాతని నమెరికా కంపినది. భౌతికభోగసాగరమునఁ బడి చుక్కాని దొరకక, కొట్టుకొనిపోవుచున్న పశ్చిమసోదరులలో నాత్మవివేకము, ఈశ్వరాన్వేషణబుద్ధి, క్షణికభోగవిరాగము నివి జనింపఁజేయుటయే రామునికోరిక. ధనార్జననిమిత్తముకాని,

పేరుప్రతిష్ఠలకొఱకుఁ గాని రాముఁడు ప్రచారము చేయలేదు. ఆత్మసాధనలచేఁ బరిశుద్ధవైరాగ్యముచే నాతఁడు గడించిన దివ్యానందము తా ననుభవించుచుఁ గోరిన వారికిఁ బంచిపెట్టుటే రామునిమతము. రామునిఁగూర్చి యాతని శిష్యురాలైన వెల్మన్ సతి యిట్లు వ్రాసియున్నది; "ఈమహాత్ముని నేను మొదట 1903 వ సంవత్సరములో దర్శించినాను. శాన్ ఫ్రాన్సిస్కోలో నాతఁ డుపన్యసించుచుండెను. కాలక్షేపము నిమిత్త మాయుపన్యాసమునకు నేను పోయితిని. కాని, యాతఁడు 'ఓం' కారము నుచ్చరించినంతనే నాహృదయమున నే నెన్నఁ డెఱుఁగని బ్రహ్మానంద ముప్పొంగినది. కలలోనైన నెఱుఁగని యనంతశాంతి నాకుఁ గలిగినది."

"సమస్తప్రాణుల కాతఁ డుచితముగాఁ బంచిపెట్టుచున్న 'జీవాహారమును'ను మఱల నేనెన్నఁడును బోఁగొట్టుకొనలేదు. భారతదేశము పోయి, హిందువులతో జీవించి వారికి సాయ మొనర్పుఁ డని పెక్కుర కాతఁడు బోధించియున్నాఁడు. చాల మంది వెళ్లుదు మని చెప్పిరి కాని, ఒకఁడునుబయలుదేఱ లేదు. ఒకనాఁడు నే నిట్లంటిని; "స్వామిజీ! నీవు నాకుఁ జేసిన యుపకృతికిఁ దిరిగి మీప్రజలకు నే నేమిచేయఁగలను?" "నీవు భారత దేశమునకుఁ బోయినచోఁ జేయనగుపని విశేషమున్న"దని రాముఁడు పలికెను. "నేను పోయెద" నంటిని. కాని మిత్రులు కొందఱు నన్ను నిరుత్సాహపఱిచిరి. కొంగఱు దూషించిరి. కాని, రాముఁ డిట్లు చెప్పినాఁడు; "నీకు నిజముగా వేదాంత మర్థమైనచో, నీకు భయము కలుగరాదు. ఏలన, అమెరికా

లోని దేవుఁడే భారతదేశమందును నున్నాఁడు" ఇట్లు మాట యిచ్చిన యైదు నెలలకు నేను భారతదేశమున కేఁగితిని. రాముఁడు చెప్పినరీతినే పరమభక్తపోషకుఁడగు పరమేశ్వరుని కృప నాకుఁ బ్రత్యక్షమైనది, హిందూసోదరులు నన్ను సోదర ప్రేమతోఁ బూజించినారు.

రామునిఁగూర్చి చెప్పుటకు మాటలు సరిపోవు. రామునిమాట లెట్టివి? తేనెలొల్కు చంటిబిడ్డమాటలు, పక్షులలోని మధురనాదము, పుష్పములలోని సౌరభము, ప్రవాహములోని శబ్దము, ఆటలాడుచున్న వృక్షశాఖలలోని కీర్తనలు, సూర్యచంద్రనక్షత్రమండల పరిభ్రమణముచే నుద్భవించిన 'ఓం' కారము రామునిమాటలలో లీనమైయున్నవి. రామునిభాష బాహ్యాదంభ ప్రపంచ ఘోషమున కట్టయడుగున నిరంతరము ధ్వనించు ప్రణవనాదమే. ఈ పరబ్రహ్మనాదమును రాముఁడు విని తన జీవితమందు మేళవించి, ప్రపంచమునకు బోధించినాఁడు. బ్రహ్మానంద సందేశమూర్తియే రాముఁడు.

రాముఁడు వినయపరిపూర్ణుఁడు; నిగర్వచూడామణి; పావనహృదయుఁడు; ధ్యానదీక్షాపరతంత్రుఁడు. రామునిసత్యాన్వేషణాసక్తితో దర్శించినవారు,సతోన్ముఖులు కాకుండ వెడలి పోఁజాలరు. ఉపన్యాసానంతరము సభ్యు లడుగు ప్రశ్నముల కాతఁడు ప్రేమతో నమృతరసము చిలుకుచు జవాబు లిచ్చువాఁడు. రాముఁడు నిరంతరము ప్రణవోచ్చారణము చేయుచుండువాఁడు. ప్రతివ్యక్తిలో నాతఁడు పరమాత్మనే దర్శించువాఁడు.

రాముఁ డొకసారి నాకిట్లు వ్రాసియున్నాఁడు. "నిరంత రము నాకసమున వెలుఁగొందుచున్న నక్షత్రములను రత్న హారములలోని యనంతకాంతిపుంజములను, వర్ణనాతీతమధుర సౌరభముల నీనుచుఁ బుష్పగుచ్ఛములచే నవ్వుచున్న వనవాటి కలను, నృత్యము గానము గోలయు మొనర్చి ప్రవహించుచున్న ప్రవాహములను, మందశీతల మలయానిలమును, సర్వమానవ కోటికి నుచితముగాఁ బ్రకృతిమాత లోకమునఁ బ్రదర్శించు చున్నది. బుద్ధి నుపయోగించువ్యక్తి వీనిఁ జూచి బ్రహ్మానంద మందఁగలఁడు. కాని, క్రుత్రిమ మానవ హస్తనిర్మిత వస్తుపరిస్థితు లందే యానందము కోరువాని కది యెన్నఁడు లభింపక, యొండ మావులవలె భ్రమింపఁజేయును. ప్రపంచములో నైశ్వర్యమని పిలువఁబడునది లోకములో నిరాచ్ఛాదితముగాఁ బ్రదర్శింపఁ బడియున్న స్వర్గశాంతిసౌఖ్యముల నాచ్ఛాదన మొనర్చును."

జనవరి 4—1904 వ తేదీని ఒక పత్రికలో రాముని యుపన్యాసమునుగూర్చి యిట్లు వ్రాయఁబడియున్నది :

నిన్నటి యుపన్యాసములో రాముఁడిట్లు చెప్పినాఁడు :

"తత్త్వశాస్త్రముయొక్క ప్రధానోద్దేశము మనప్రస్తుత జీవిత కార్యక్రమము చక్కఁగా నడపించుకొనుటయే. హిమవత్ప ర్వతగుహాంతరములనుండి నేను వచ్చుటచే నే నేదియో మాయా మంత్రములు చెప్పెద నని తలంచువారికి నేను చెప్పఁబోవునవి విరుద్ధముగా నుండవచ్చును. కాని, నే నట్టితాంత్రికుఁడను గాను. దైనికజీవితములో మనము చేయు శక్తియొక్క వ్యయము తగ్గిం చుట, కాయికమానసికబలమును నిరర్థకకృత్యములలో ధారపో

యుక నిలుపుకొనుట, కామక్రోధద్వేషాదులబారినుండి విడివడి స్వాతంత్ర్య మార్జించుట, మానసికాత్మికదాస్యములచే సంభవించు జీవరోగమును నివారించుట, కర్మసాధన మగు రహస్యమును గ్రహించుట, ప్రేమచేఁ బరమేశ్వరుని దర్శించుట, సృష్టి నిర్మాణజ్ఞానము నెఱిఁగి సమత్వశాంతులను బెంపొందించుకొనుట-యివియే నేను మీకు బోధింపఁబోవు విషయములు.

"నా మతము హిందూమతము కాదు. మహమ్మదీయ మతమును గాదు, క్రైస్తవమతమును గాదు; కాని, వీనిలో దేనికిని వ్యతిరేకము గాదు! సూర్యచంద్ర నక్షత్రాదుల కాంతిచేత, నదీసాగరములచేత, ఆకర్షణాదిశక్తులచేత, సమస్త చేతనాచేతనపదార్థములచేత నావరింపఁబడినవిశ్వరంగమే నామత నిలయము. మహమ్మదీయాకాశము కాని, హిందూనక్షత్రములు కాని, క్రైస్తవసాగరములుకాని యున్నవా? నా కందుచే జాతిమత భేదములు లేవు. సూర్యకిరణజాలములు, నక్షత్రకాంతులు, నూతనలతాపత్రములు, తృణాగ్రములు, సైకతరేణువులు, పశుపక్షిమానవాదిసమస్తజంతుజాలముల హృదంతరములు, నామతమునకుఁ బునాదులు. నామతము పేరులేని మతము, నేను దానికిఁ బేర పెట్టను. మమకారముతో గ్రహింపను. కాని, సూర్యకాంతివలె నందఱకు సేవచేసెదను. అందుచే నిదియే సర్వప్రాణిమార్గము."

"భారతదేశములోని రాజాధిరాజులకన్న మిన్నయగు బ్రాహ్మణవంశమునఁ బుట్టి, యీపురుషపుంగవుఁడు భారతజాతి కపారసేవ యొనర్చినాఁడు. రత్నకాంతిరక్తిమతోఁ దులఁతూఁగు

కాషాయవస్త్రములను ధరించి, యీ భారతవ్యక్తి యిప్పుడు పోర్టులాండు (Portland) వచ్చినాఁడు. అనేకులు భారతీయు లిచటకు వచ్చిరికాని, యిట్టిమహనీయుఁడు వచ్చియుండలేదు."

"రామతీర్థస్వామి యేసంఘము పిలిచినను మాటాడుటకు సంసిద్ధుఁడే. పరస్పరవిరుద్ధాభిప్రాయములు గలసంఘములలో నుపన్యసించి వారివారి పాక్షికదృష్టులను జీల్చి చెండాడి, సత్యాకాశమునకు వారిని వెంటఁబెట్టుకొని యెగిరిపోయి, సమత్వము చూపి, యందఱమత మొకటే యని రుజువుచేయును. ప్రధానమంత్రులు, న్యాయాధ్యక్షులు, న్యాయవాదులు రాముని వెంట మిత్రులై తిరుగుచుందురు."

"రాముని కన్నిభాషలు చరిత్రలతో వచ్చును. అన్ని దేశములగ్రంథమతముల నాతఁడు నిర్విశేషముగఁ జదివినాఁడు. ప్రపంచములోని ప్రాచీనాధునికతత్త్వభౌతిక శాస్త్రసిద్ధాంతము లన్నియు నాతనికిఁ గంఠస్థములు. హిందూయువకుల కమెరికా విశ్వవిద్యాలయములలో నుచిత వేతనము లిప్పించుటకై పెక్కు సంఘములను స్థాపించి, రాముఁడు కృతార్థుఁడైనాఁడు."

ఒక శాన్‌ఫ్రాన్సిస్కో-పత్రిక యిట్లువ్రాసియున్నది: "ఉత్తర హిందూస్థానమందలి పర్వతగుహాలలోనుండి యొకమహర్షి, విజ్ఞానశిఖామణి, తత్త్వజ్ఞసార్వభౌముఁడు, భౌతికశాస్త్రవేత్త, అమెరికాఖండమున వేదాంతప్రచారము చేయ నరుదెంచి యున్నాఁడు. భారతదేశములో నగ్రకులజులలో నగ్రగణ్యుఁడగునాతని పేరు రామతీర్థస్వామి. ఈమహర్షి ధీశాలి యగునొక యువకుఁడే. బ్రహ్మవర్చస్సాతనిముఖమునం వెలుఁగొందుచుం

డును. ఆతని భ్రూమధ్యము విశాలమై, ఆతనిమస్తకము చక్కని వలయాకృతిఁ గాంచి, యెంతయు మనోహరముగ నుండును. ఆతనిరదపంక్తి, మల్లికాముకుళధావళ్యమును మఱపించుచుండును. ఆతఁడు నవ్వు నవ్వులో శత్రువులు మిత్రు లేకపోదురు.

"నేనెట్లు జీవింతు?" నను విషయమునుగూర్చి ప్రసంగించి నిన్న యాతఁ డిట్లు వచించినాఁడు. "ఇది సూక్ష్మవిషయము. నేను యత్నము సల్పను. సర్వప్రాణికోటికి నాహృదంతరము నుండి ప్రేమధార ప్రసరించుచుండును. అందుచే నందఱు నన్నుఁ బ్రేమింతురు. ప్రేమ యున్నచోట, లోపము కాని, విచారము కాని యుండవు. ఈపవిత్రప్రేమ నాహృదయమున నున్నంత కాలము నాకు వలయునవన్నియు నప్రయత్నముగా లభించును. నా కాఁకలి కలిగినచో నెవరో యొకరు నాకు భోజన మిడుటకు సిద్ధముగా నుందురు. నేను ధనముకొఱ కెవ్వరి నడుగ నని వ్రతము. కాని, నాకు లేనిది లేదు. విశేష మేమన నెవ్వరికిని లభింపనియానందము నాహస్తగతము."

రాముఁడు కొన్ని నెలలనుండి మీకు భారత విజ్ఞాన రత్నరాసులనుగూర్చి ప్రసంగించియున్నాఁడు. నేఁడు రాముఁ డీజ్ఞానపయోధార కురిసిన భారతదేశమునుగూర్చి యుపన్యసించును. ప్రపంచమునకు మతము లొసఁగినతల్లి యగుభారత భూమిని గూర్చి నేను ప్రసంగించెదను. దినదినము నేఁడుకూడ యూరపు అమెరికా ఖండములలో బయలు దేఱుచున్న నూతన మతములను మాదేశమే మీ కొసఁగి యున్నది. పశ్చిమ ఖండములలోని నవీనభావము లన్నియు భారతదేశమునుండి

యుద్భవించినవే. ప్రపంచచరిత్రము విస్పష్టముగాఁ జూపువిధ మున, గ్రీకుతత్త్వవేత్త లగు ప్లేటో, సోక్రటీసు, పైథాగరస్, ప్లాటినస్ మున్నగువారు తమసిద్ధాంతములను భారతదేశము నుండియే కనుఁగొనియున్నారు. సోపెన్హాయరు, స్కెగెల్, షెల్లింగు, యమ్ కజిను మున్నగువారు సాంఖ్య బౌద్ధమతముల నుండి, గీతోపనిషత్తులనుండి, వేదాంతమునుండి, తమయభి ప్రాయములను గాంచితి మని వ్రాసికొనియున్నారు. నేఁడు అమెరికా, ఇంగ్లాండు, జర్మనీలలో 'చెలామణి' యగుచున్న "ఏకేశ్వరవాదము" మాభారతదేశమునుండియే వచ్చినది. శ్రీకృష్ణ శంకరాది మహాత్ముల జన్మస్థానమునుగూర్చి రాముఁడు మీ కుపన్యసింపఁబోవుచున్నాఁడు. ఎమర్సన్, వాల్టువిట్మన్, సర్ ఎడ్విన్ ఆర్నాల్డు, మాక్సుముల్లర్ మున్నగు మహాపురు షుల నావేశపరవశులఁ జేసిన మహోన్నతాభిప్రాయములకు, నాదర్శనములకుఁ బుట్టినిల్లయినభారతవర్షమును గూర్చి మీకు నేను చెప్పఁబోవుచున్నాను; తత్త్వశాస్త్ర కవిత్వములకే కాక, రణశూరతకు వన్నెకెక్కినభారతమును మీకుఁ బ్రదర్శింపఁ బోవుచున్నాను. నేఁడైన నాంగ్లరాజ్యమునకు స్తంభములై పోషించు వీరు లెవరు ? సిక్కులు, ఘూర్కాలు, మహారా ష్ట్రులు, రాజపుత్రులును గారా ? ఒకప్పుడు పరిపూర్ణైశ్వర్య ముతోఁ దులతూఁగినది భారతదేశము. పరజాతు లొకటివెనుక నొకటి వచ్చి, మా దేశముపైఁ బడి తినిపోయినవి. మా దేశ మును గనుఁగొని దోఁచుకొనవలె ననెడు యత్నములో కొలం బస్ అమెరికా గాంచినాఁడు. మొదట మీ అమెరికా 'ఇండియా'

అని యే పిలువఁబడెను. సర్వదేశములకు మాదేశ మొకప్పుడు శిరోభూషణమై వెలసినది. భౌతికమానసిక ధార్మికరంగములన్నిటిలో భారతవర్షమే మస్తకమై విలసిల్లినది. కాని, నేఁడు దురదృష్టవశమున మస్తకమే పాదములైనది. ఓ అమెరికా సోదరులారా ! నేఁడు మీ అమెరికా ప్రపంచశరీరమునకు శిరస్సుగా నున్నది. భారతదేశము పాదములై యున్నది. రాముని విన్నప మిది; "ఓమస్తకమా ! నీవు బలముగా నారోగ్యముగా నుండవలె నన్న, పాదములను గట్టిపఱచుకొనుము. పాదములు పంకిలమునఁబడినఁ దల వాలదా? పాదములు బాధపడుచున్న శిరము తిరుగదా ? ఒకానొకప్పుడు ప్రపంచమును దన యమూల్య జ్ఞానవిజ్ఞానములచేఁ బోషించిన భారతజనని నేఁడు నీరసించినది. ఆర్యసంతతికిఁ బెద్దయాఁడుఁబడుచైన భారతకాంత నేఁడు రోగగ్రస్తయై యున్నది. మీరామెపై నొకతూరి పరికింపరా ? సాయపడరా ? ప్రపంచమునకు జ్ఞానపయోధారల ననంతముగాఁ గురిసిన హిందూగోమాత నేఁడు దాహముచే నాఁకలిచే నీరసముచేఁ దపించుచున్నది. ఆమెకుఁ బ్రాణభంగము లేకుండఁ గాపాడవలదా? పచ్చిమాంసము తిను పశ్చిమజాతులు మా గోవును గోసి తినుటకు యత్నించుచున్నవి. మీచిత్తము వచ్చినట్లు చేయుఁడు. కాని, ఒకటిమాత్రము మఱవకుఁడు. మీరు నఱికి మాంసము తినవలె నన్నను, మేఁతపెట్టి, పుష్టి కలుగఁజేయవలయును. రోగగ్రస్తమగు నీ యావుమాంసమును మీరు తిన్నచో నది మీ యెముకలు పట్టి, ప్రాణభంగము కలుగఁజేయును. జాగ్రత్త !

ప్రతివత్సరము కాటకములచే లక్షలకొలఁది జనులు చని పోవునట్టియు, నూతనయౌవనములో నుండు యువతీ యువకులు, ఆఁకటిచిచ్చున కాహుతియైపోవునట్టియు, లోకధురంధరులు కానగువిద్యార్థులు విద్యలేక, దారిద్ర్యమున కెరయగు చున్నట్టియు, తల్లిపాలులేక విలవిల నేడ్చుచున్నబిడ్డల కాకరమైనట్టియు, మాభారతదేశములో నిదివఱకే తలఁ దన్ని యున్న పన్నులక్కుఁ దోడు, చెమటనూడ్చి, కృషిచేసి జీవించు కూలివారిలోఁ గరుడు కట్టి యెండిపోయిన రక్తమునుండి యింకను ధనము లాగుకొనవలె నని మాప్రభుత్వ మేటేట యత్నించుచున్నది. ముప్పదిమూఁడుకోట్ల భారతీయులలో 'బ్రిటిషు పార్లమెంటు'లో నొక్క ప్రతినిధియు లేఁడు. ఉన్నతోద్యోగము లన్నియు ప్రభుత్వహస్తములందే యున్నవి. స్వదేశపరిశ్రమ లన్నియు నాశనమొనర్పఁబడినవి......"

"అమెరికాసోదరులారా! రెండువిధముల మీరు భారతీయులకుఁ దోడ్పడవచ్చును. ఒకటి కార్యశూరులును, సత్యముకొఱకై ప్రాణత్యాగమునకైనను సంసిద్ధులగు మీలోఁ గొందఱు మాదేశమునకుఁ బొండు. కాని, అమెరికాలో బనికి రానివారినిమాత్రము మాదేశమున కంటఁగట్టకుఁడు. మీ సంఘములోని రత్నములనే మాకుఁ బంపుఁడు. అధఃపతితులై దిక్కు లేక పడియున్నయంత్యజాతులకు వారు సేవ సల్పుటకు సంసిద్ధులై యుండవలయును. మాప్రజలు దరిద్రు లగుటచే, విద్యావిహీను లగుటచే, మీరు చేయునుపకారమును గుర్తింపరు, మిమ్ము బహూకరింపరు, మీకు వలయు నన్నవస్త్రము

నైన వారొసఁగఁజాలరు. వారికే యన్నవస్త్రములు లేవు. అట్టికార్యమును నిర్వహించుటకు మీలో నెవరైన బయలు దేఱఁజాలరా? మతప్రచారము పేరుపెట్టుకొని దివ్యభవనములలోఁ గాపుర ముండి హయవాహనములలోఁ దిరుగాడుచు జీవించు ప్రచారకులుమాత్రము మాకు వలదు. అంత్యజులతోపాటు కటికినేలపైఁ బరుండి, వారితోపాటు గోఁచిపీలికల ధరించి, వారితోపాటు కడుపుకాల్చుకొని సేవచేయు మహాత్ములు మీలోఁ గొలఁదిమంది వచ్చి మ ముద్ధరింపుఁడు. ఈ కార్యమువలన మీకు అభినందనము లేకపోవచ్చును. కాని, మీయాత్మోద్ధరణమునకు ముఖ్యసాధన మిదియే. నా వేదాంతోపన్యాసములచే మీరు లాభము పొందవచ్చును, పొందకపోవచ్చును. కాని, నా యాత్మోద్ధరణము జరుగుచునే యున్నది. స్వార్థరహితసేవ చేయువానికి భగవంతుఁడే ఋణబద్ధుఁడగును. సర్వేశ్వరుఁడే మీ సేవకు 'వడ్డితోఁ బ్రత్యుపకృతి యొనర్చును. అమెరికా సోదరులారా! భారతదేశమున కేఁగి, యాత్మజ్ఞానమును, ఆత్మగౌరవమును, ఆత్మశక్తిని బోధింపుఁడు. వేదాంతసత్యమును మీరు గ్రహించి, సాధించి మా దేశమున కరిగి, భారతీయులను మేల్కొలుపుఁడు.

ఇంకొకపద్ధతి యున్నది. ధనికులు ధన మొసఁగుఁడు. త్యాగవీరు లగువారు మా దేశమున కరిగి,మాదీనులకు ధైర్యము పురికొల్పుబోధనలు చేయుఁడు. పత్రికాధిపతులు, దరిద్రభారతోద్ధరణమునకై వ్యాసములు వ్రాయుఁడు. మీరిచ్చినధనము, మా అమెరికా ప్రతినిధులయొద్దనే యుంచవచ్చును. మీరేమి

చేయుటకు సిద్ధముగా నున్నారో చెప్పుడు. స్వార్థపరుఁడై, రాముఁ డీవిన్నపము చేయుట లేదు. రామునికొక దేశము లేదు. ప్రపంచమంతయు రామునిదే! రాముఁడు స్వేచ్ఛగా విశ్వరంగమున విహరించును. కాని, భారతవర్షము మీ పాద భూమి. పాదములు గట్టిలేనిచో మీరు నిలువఁజాలరు. భారత దేశదరిద్రకోటిరూపముఁ దాల్చి నారాయణుఁడే మీ యొద్ద కరుదెంచినాఁడు; భుక్తి నొసఁగి తరింపుఁడు. వస్త్రశూన్యులగు హైందవులరూపమునఁ బరమేశ్వరుఁడు మీకతిథి యైనాఁడు; మీరు వస్త్రముల నొసఁగి ధన్యులు కండు. భారతీయులు దుస్థితిలో నుంట, మీ హృదయమునుండి ప్రేమను వికసింపఁ జేయుటకే. వారికి సంభవించిన యాపత్కాలము మీకు లభించిన ధర్మాచరణావకాశము.

చైనావారికి, జపానువారికి, నీగ్రోలకు మీరు సాయ మొసఁగి సేవచేయుచున్నారు. ఇచ్చట నున్న హిందువులను గూడ మీ రుద్ధరింపుఁడు."

సత్యాన్వేషణ మార్గము

రామతీర్థస్వామి అమెరికాలో నొసఁగిన యుపన్యాసము లెన్నియో కలవు. ఆంగ్లభాషలో నివి వివరముగఁ బ్రకటితములై యున్నవి. వేదవేదాంతములు, ప్రాచీనసంస్కృతభాషలో వ్రాయఁబడియుండుటచే, జనసామాన్యమున కవి యందుబాటులో లేవు. కృషిచేసి మూలములో నీవేదాంతశాస్త్రము చదివి సారము గ్రహించుటకు, కుశాగ్రబుద్ధులకైనఁ గష్టసాధ్యము. ప్రత్యేకము పాండిత్యము గలవారికిని, ఉపనిషదర్థము

తెలియదు. మహాపురుషులు ధ్యానసమాధ్యవస్థలోఁ దన్మయులై తిలకించిన సత్యాంశములు తెలిసికొనుటకు లౌకికభాషా ప్రగల్భములు నిరర్థకములు. వేదాంతవిజ్ఞానసారమును జవిచూడఁ గోరువారికిఁ గొన్ని లక్షణములు విధియై యున్నవి. మహర్షుల వాక్యము లార్షదృష్టిగలవారికే విదితములు కాఁగలవు. ఉపనిషదర్థ మేకాగ్రదృష్టిని గోరుచున్నది. భోగరాగాదులను సంపూర్ణముగాఁ ద్యజించి, జీవజన్మరహస్యము నెఱుఁగుననంత వాంఛతో, సర్వమానవశక్తి నేకధారగాఁ గేంద్రీకరించి, మహర్షి వాక్యములను సమీపించినచో నందలిసౌరభము, సౌందర్యము, ప్రత్యక్ష మగును. ముదుసలితనముచే మొఱడువాఱిన శుష్కహృదయములకుఁ గాని, భోగలాలసత్వముచే వస్తుసంతతికై పరుగులిడుచలితమానసములకుఁ గాని, క్రోధమోహాదిభూతములచేఁ గట్టువడిన లజ్జాహీనులకుఁ గాని, త్యాగాగ్నిలోఁ దప్తములై వైరాగ్యామృతసారములో శుద్ధములై బయల్పడిన పరమాత్మ రహస్యసూత్రములు, ద్యోతకములుకావు. కాని, మహర్షులలో మహర్షియై, ఉపనిషదర్థములలో లీనమై, ప్రకృతిసౌందర్యములోఁ దన్మయుఁడై రామతీర్థస్వామి వేదాంతసందేశమును, ప్రజాసామాన్యమునకు సులభగ్రాహ్యముగ విప్పిచెప్పినాఁడు. ఆతఁ డమెరికాలో జీవించిన రెండేండ్లలో వేదాంతసందేశమును, సమగ్రముగా సహస్రముఖములఁ బ్రకటించియున్నాఁడు. ఆతని యుపన్యాసములలో నప్రతిమానధీశక్తిని మించిన సాహసత్యాగము, త్యాగమును మఱపించు పరమేశ్వరభక్తి, భక్తిని మఱుఁగుపఱచు ననంత

జ్ఞానము నన్నియు మేళవించి ప్రణవగానమాధురితోఁ బొరలి పాఱుచు నాగరికాగ్రగణ్యు లగు పశ్చిమ ప్రజ్ఞానిధుల హృదయములను సమ్మోహితము లొనర్చినవి. అతఁడు మార్చి 1-1903 వ తేదీని సత్యాన్వేషణమును గూర్చి యీ క్రిందివిధమున నుపన్యసించి యున్నాఁడు.

"మిమ్ము బంధించియున్న పాశములను దుత్తునియలొనర్చుటకుఁ గొంతసాధన చేయవలసియున్నది. ఈబంధించు పాశము లెవ్వి ? మీ పశ్చిమఖండవాసులకు నేను చెప్పఁబోవు వేదాంతతత్త్వరహస్య సౌందర్యము నేఁడు సువిదితము కాకపోవచ్చును; కాని, దాని సత్యమెన్నఁటికిని మార్పుచెందునది కాదు. సత్య మేమన, మీవాంఛలు, మీసంగమములు, మీప్రేమలు, మీద్వేషములు నివియే మిమ్ము బంధించుపాశములు. ఇవియే మిమ్ము భగవంతునిఁ జూడనిచ్చుట లేదు. మీవాంఛలే మీకుఁ జెఱసాలను కల్పించుచున్నవి. భోగత్యాగములను రెంటిని మీరు ముడిపెట్టఁజాలరు. ఇంద్రియదాసత్వము, నాత్మసామ్రాజ్యాధిపత్యము రెండు నొకచోట నెన్నఁడు నుండవు. సత్యదర్శనమే స్వర్గసామ్రాజ్యపదవి. వాంఛాదాసత్వమే, పరాజయము, పరాభవము. ప్రతివ్యక్తియు సత్యమును దర్శింపవలెననియు, దానొక మహాత్ముఁడు, సిద్ధపురుషుఁడు, ప్రవక్తయుఁ గావలెననియుఁ గోరును గాని, దానికి వలయు త్యాగ మును వెలనుమాత్రము చెల్లింప నిచ్చగింపఁడు.

భారతదేశములో నొక మనోరంజకమగు గీతమున్నది. దాని భావమిది : నీసత్యాన్వేషణమార్గములో నీతండ్రి యడ్డు

వచ్చినచో నాతనిని బ్రిహ్లాదునివలెఁ దృణీకరించి ముందుకుఁ బొమ్ము. నీయాత్మాన్వేషణములో నీకుపకరించునంతదూరము తల్లిదండ్రులతోఁ గలిసి యాత్రచేయుము. కాని, నీసోదరుఁడైనను నీ యీశ్వరధ్యానమున కడ్డువచ్చినెడల విభీషణుఁడు రావణుని ద్యజించినటులు విసర్జించివేయుము. నీ యర్ధాంగియైన నిన్ను వెనుకకు లాగినచో భర్తృహరి మహాశయునివలె నామెనుగూడ విడిచిపెట్టుము. నీభర్త యడ్డుతగిలినచో, మీరాబాయి సతీమణివలెఁ ద్రోసివేయుము. నీకు గురువే ప్రతీకారమొనర్చినను, భీష్మాచార్యుఁడు పరశురామునిఁ బరిత్యజించినట్లు త్యజించివేయుము. ఏలన, నీకుఁ దల్లియుఁ, దండ్రియు, సోదరుఁడు, భార్య, గురువు నన్నియు భగవంతుఁడే. ఈయిహలోక బంధుత్వములు క్షణములో నదృశ్యములగునవే, కాని సత్యజ్ఞానమే, పరమేశ్వరదర్శనమే, నీతోఁగూడి శాశ్వతమై నిల్చునది. నీహృదంతరమున నిరంతరము వెల్గొందుచున్న పరమాత్మునికన్న నీకు దగ్గఱిబంధువులు లేరు. సత్యమున కొక్కదానికే నీశిరమును వంచుము. రాజాధిరాజులకుఁగాని, శరీరబంధువులకుఁగాని, నీయాత్మ నర్పింపకుము.

ఈసత్యమును స్పష్టీకరించు నొకకథ మహాభారతములో నున్నది. యుధిష్ఠిరచక్రవర్తి స్వర్గారోహణ మొనర్పఁ గైలాసమునకు, నలుగురుసోదరులతో, భార్యతో, భార్యసోదరులతో, బయలుదేఱినాఁడు. సత్యదర్శనమునకై యాతఁడు ధర్మమార్గమును బట్టి యాత్ర ప్రారంభించినాఁడు. సత్యోన్ముఖుఁడై యాతఁడు ముందుకుఁ బోవుచున్నాఁడు. ఆతని సోదరు

యొకనివెనుక నొకరు నడచుచున్నారు. భార్య యందఱివెనుక నుండి వారి ననుగమించుచున్నది. సత్యముమీఁదనే దృష్టి నిగిడ్చి పరమావధినే స్మరించుచు యుధిష్ఠిరుఁడు నడచుచు న్నాఁడు. కొంతదూరము పోవుసరికి, ద్రౌపది బల ముడిగి, శక్తి లేక, నీరసించి, నేలఁగూలినది. కాని, యుధిష్ఠిరుఁడు తన ముఖ మును వెనుకకుఁ ద్రిప్పలేదు. ఎట్లో శ్రమపడి, నాలుగడుగులు నడచి, తన్నుఁ గలిసికొమ్మని యుధిష్ఠిరుఁడు భార్యను బ్రోత్స హించినాఁడు. కాని, యామె యానాలుగడుగు లైన వేయ లేకపోయెను. ఆమె లేచి భర్తను సమీపింపఁజాలకున్నది. ఆతఁడు వెనుకకుఁ గాలుపెట్టఁడు. సత్యమునుండి యొక్కపదము వెను కకు వేయుట నాతఁడు సహింపఁడు; భార్య పడిపోయినది. యుధిష్ఠిరుఁడు తిరిగి చూడఁడే! నీకు వేలకొలఁది భార్యలు పూర్వజన్మములలో నుండియున్నారు. నీకుఁ బునర్జన్మమున్న చో మఱికొన్ని వేలుండును. నీవెనుకటిజన్మములలో నెందఱు బంధువు లుండిరో! ఇఁకముందెందఱుందురో! ఈబంధముల కంటిపెట్టు కొని నీవు సత్యమును విస్మరించెదవా? ముందుకే పోవుము. నిన్నేదియు వెనుకకు లాగఁగూడదు. సత్యమునకు నీభార్య యందుఁగంటె నెక్కువగౌరవము నొసఁగుము. భగవంతు నందఱికంటె నెక్కుడు ప్రేమింపుము. సర్వమానవకోటికి సత్యమే, భగవంతుఁడే శాశ్వతము, నిత్యము. ప్రపంచబంధ ములు, నిమేషమాత్రములు. నీకేది పరమార్థమో, నీభార్యకు నీకోడివారికి నదే పరమార్థమని తెలిసికొనుము. యుధిష్ఠిరుని భార్య పడిపోయిన నాతఁడు ముందుకే పోయెను. పోవుచు

సోదరులను దన్ననుసరింపుఁ డనుచుండెను. సోదరులును గొంత దూరము పరుగిడిరి. కాని, కనిష్ఠసోదరుఁడు నడువలేక, పడి పోవుచు, 'ఓయీ ! అన్నా ! యుధిష్ఠిరా ! నేను మరణించుచు న్నాను. నన్ను రక్షింపుమని కేకలిడెను. కాని, యుధిష్ఠిరుఁడు తన నేత్రములను సత్యమునుండి మరల్పలేదు. వెనుకకుఁ జూడ లేదు. 'సోదరా ! రమ్మ'న్ననుచునే కేకలిడుచు ముందుకుఁ బోవుచుండెను. చిన్నతమ్ముఁడు మరణించెను. కొంతదూరము పోయినవెనుక, రెండవతమ్ముఁడు నట్లే తదితరులు, యుధిష్ఠిరు ననుగమింపలేక, పడి మరణించిరి. ఆతఁడు మాత్రము కాలు వెనుకకుఁ బెట్టక, దారి విడువక ముందుకే పోవుచుఁ దుదకు గమ్యస్థానమును జేరినాఁడు.

యుధిష్ఠిరుఁడు గమ్యస్థానముఁ జేరునప్పటికి, సత్యమే రూపముదాల్చి, స్వర్గమునకు విచ్చేయుమని యుధిష్ఠిరు నాహ్వా నించెను. కాని, యుధిష్ఠిరుఁడు ప్రక్కకుఁజూడఁగా నొకకుక్క తనతోవచ్చుటఁ గాంచి, "ఓయీ! సత్యదేవతా! నాతోడవచ్చిన యీశ్వానమునకుఁగూడ స్వర్గమొసఁగు"మని పలికెను. అంత స్వర్గాధిపతి, 'కుక్కకు స్వర్గమెట్లు! అది యింకను గొన్నిజన్మ ములెత్తి, మానవదేహమును ధరించి, తపస్సు చేసినవెనుక, స్వర్గమునందును. అంతవఱకు వీలులే"దని బదులుచెప్పెను. మఱల యుధిష్ఠిరుఁడు, "ఓసత్యస్వరూపా ! నేను స్వర్గమునకు వచ్చుట నీకిష్టమైనచో, నీశ్వానమునుగూడ రానిమ్ము. నా భార్య నాతో రాఁజాలక, ధర్మమార్గమున జయించి, వెనుకఁ బడిపోయినది. నాసోదరులును నన్ననుగమింపఁజాలకపోయిరి.

వారు బలహీనులై, వెనుకడుగు వేసిరి. ఈకుక్క యొకటే నాతో ధర్మపథమున యాత్రచేయఁగలిగినది. నా యాత్రలో నేను పడినకష్టములలో, సంకటములలోఁ బాలుగొన్న దీశ్వాన మొక్కటే. నాకష్టముల భరించిన యీకుక్కనాస్వర్గసౌఖ్యము ననుభవించితీరవలయును. కుక్కకు స్వర్గము లేకపోయినచో నాకును వల"దనెను. కాని సత్యదేవత యుధిష్ఠిరు నావరము విడిచిపెట్టుమని బోధింపఁగా మఱల నాతఁడిట్లనెను; "నీవు సత్య స్వరూపుఁడవు కావు. అగుచో నిట్టియక్రమమున కేల యొడిఁ గట్టెదవు? నీ వొకపిశాచమవై యుండనోపుదువు."

ఇట్లు చర్చజరిగిన కొంతసేపటికి శ్వాన మదృశ్యమైనది. భగవానుఁడే ధర్మజుని బరీక్షింప శ్వానరూపము ధరించి తృప్తి నొంది ధర్మజునెంతయు నభినందించెను. ఇదియే సత్యపథాను వర్తనకుఁ బద్ధతి. నీ రక్తబంధువులైనను, నీ యర్ధాంగియైనను నీసత్యదీక్షలో వెనుకాడినచో వెంటనే వారిని విడిచిపెట్టుము. ఒక నీచమగు కుక్కయైనను నిన్ననుగమించినచో నదియే నీకు సన్నిహితబంధువని గ్రహింపుము. నీధర్మప్రవర్తనకుఁ జేయూఁత నొసఁగువారే నీమిత్రులు, నీబంధువులును. అట్లుకాక, నీసత్య మార్గమునుండి నిన్ను వెనుకంజవేయించువారిని మమకార ముతోఁ గాఁగిలించుకొని, మార్గము తప్పితివా, నీకు సుఖము లేదు శాంతి లభింపదు, దుఃఖమే నీకుఁ దప్పనిసరి యగు ఫలము.

భారతవర్షచరిత్రలో శాశ్వతముగా మహావీరస్థానము నలంకరించిన శ్రీరామునియాత్రలో నీసత్య మిమిడియున్నది. సీతాసతీమణి యనుసత్యమును రాముఁడు తిరిగి సంపాదింప

వెడలినపుడు, ప్రకృతియంతయు రామునికి సాయపడి సేవఁజేసినది. మర్కటములు రామునిసైనికదళముగాఁ బనిచేసినవి. ఉడుతదండు వచ్చి, సముద్రబంధములోఁ బాలుగొనినది. జడాతిజడములగు ఱాళ్ళుకూడ రామకార్యములోఁ బాల్గొన్నవి. ఱాలను వంతెనకట్టుటకు నీటిలోఁ బడవేసినపు డవి మునుఁగుట మాని తేలియాడి, "ధర్మవిజయకార్యము సిద్ధిపొందునిమిత్తము మేము తేలుచున్నా"మని పలికినవి. సత్యవ్రతబద్ధుఁ డగు వానికి విశ్వమంతయు సాయపడును. రాగద్వేషములను జయించిన వ్యక్తియెదుట సృష్టియంతయు సాష్టాంగపడితీరును. సత్యమునకై ప్రాణము లర్పింపుము. నీవు పరమేశ్వర సాన్నిధ్యము నందుదువు. దేవతలుకూడ నీనామమే భజనచేయుదురు."

పైవిధముగా రామతీర్థస్వామి సత్యమునుగూర్చి బోధించియున్నాఁడు. సర్వసంగత్యాగమే, సర్వేశ్వరదర్శనసిద్ధికి మార్గమని యాతఁడు వివిధరీతుల విసుగు విరామము లేకుండ బోధించియున్నాఁడు. అతని కొక టే మతము; సత్యమును దెలిసికొనుటే. ఆమతమున కొక టే సాధన; సత్యకాంక్షతో సర్వకామ్యములను బరిత్యజించుటే. దీని కాధారమేమన, రాముఁడట్లే జీవితములో నాచరించి చూపినాఁడు. తాను సర్వసంగములను నవయౌవనములో విడిచిపెట్టి, సత్యాన్వేషణ మొనర్చి, సిద్ధిపొందినాఁడు. అట్టి మహావ్యక్తి నోటినుండి వెలువడిన జ్ఞానవాక్యము లమెరికాప్రజల శ్రవణములఁబడి వారెల్లరను మూర్ఛితుల నొనర్చుటలో నాశ్చర్య మేమియును లేదు.

రాముని సత్యబోధనములు చెవులార విననోచుకొనిన అమెరికా ప్రజలు ధన్యులుగదా !

మాతృదేశాగమనము

రామతీర్థస్వామి అమెరికాలో రెండుసంవత్సరములుండి, వేదాంత సందేశమును గంభీరకంఠముతో ఘోషించి, అమెరికాసోదరుల మన్ననలఁ బడసి, 1904 వ సంవత్సరాంతమున భారతదేశమునకుఁ దిరిగి వచ్చినాఁడు. అమెరికాలో స్వామి యొసఁగిన యుపన్యాసములు, భారతదాస్యవిమోచనము నపేక్షించి, అమెరికాలో నాతఁడు సల్పిన అప్రతిమానాందోళనము నివి లోకమంతయు వ్యాపింపకపోలేదు. ముప్పదిమూఁడు కోట్ల భారతపుత్రులును రాముఁడు తమదేశమునకుఁ దమమతమునకు జేసిన శాశ్వతసేవను గుర్తించియే యున్నారు; కాని, రామునికిదియొక ఘనకార్యముకాదు. ప్రజాభినందనము కోరి రాముఁ డెన్నఁడు నేమియుఁ జేసి యెఱుఁగఁడు. అమెరికాలోఁ దానొసఁగిన మహోపన్యాసముల నఖండముగఁ బొగడుచుఁ బత్రికలలో వ్రాసిన సంపాదకీయపత్రములు, శిష్యులు దెచ్చి, రామునికిచ్చినపుడు, వాని నన్నిటిని గనులు మూసికొని, కట్టకట్టి, ప్రణవోచ్చారణ మొనర్చుచు నదిలో విసరివైచి స్నానమొనర్చినాఁడు. అహంకారమును, మమకారమును జ్ఞప్తికిఁ దెచ్చునట్టి యత్యల్పకార్యము నాతఁడు సహింపఁజాలఁడు. ఆత్మజ్ఞానాభినివేశములోఁబడి, ఆవేశపరవశుఁడై, వేలకొలఁది

ప్రజల కుపన్యసించుచున్నను, నాతని కనులవెంబడి నానందాశ్రుఝురులు విడువకుండఁ గాఱనిదిన మొక్కటియైన లేదు. ఈశ్వరుఁడాతని ముఖమునుండి యేది పలికించిన నది పలికినాఁడు కాని, రాముఁడెన్నఁడును నెందులకుఁ బ్రయత్న మొనర్చి యెఱుఁగఁడు.

స్వామి భారతదేశమునకుఁ దాను తిరిగి వచ్చుచున్న సంగతి నెవరికిఁ దెలియఁబఱచలేదు. అభినందనములు, ఆహ్వానములు, సత్కారములు కోరని ఆత్మానందమయునకుఁ, దన మాతృదేశాగమనమును గూర్చి యొకరికిఁ దెలుపవలయు నవసర మేచటనున్నది? అతఁ డొక ప్రచారమును సాగించి, వివిధ పట్టణములలో నుపన్యాసము లొసఁగవలెనని యెన్నఁడు ననుకొనలేదు. ప్రతిదిన మాత్మానందసాగరములో నీఁదులాడుచుఁ దన పరిపూర్ణ పావనహృదయపద్మాసనముపై సుప్రతిష్ఠితుఁడై నిలిచియుండి పరమేశ్వరుఁడు పలికించినఁ బలికినాఁడు; నవ్వించిన నవ్వినాఁడు; బాష్పధార విడిపించిన విడిచినాఁడు; ఎట్లు నడపించిన నట్లు నడచినాఁడు. రామునికిఁ బ్రయత్నముచే నడచిన క్షణ మొక్కటియు నాతనిజీవితములోఁ గన్పట్టదు.

రాముఁడు స్వదేశమునకుఁ దిరిగివచ్చి, యమునానదీ తీరమున నున్న మథురాపట్టణప్రాంతమున "శాంతిఆశ్రమము"లో నొక పారశీకుఁ డగు శివగుణాచార్యునితో నుండి కాలము గడుపుచుండెను. ఒకనాఁ డొకగదిలోఁ దలుపులు మూసి, కూర్చుండి ధ్యానముచేయుచుండఁగా, లాహోరునుండి పురాణసింగు వచ్చి తలుపుతట్టినాఁడు. 'ఎవరు?' అని రాముఁడు ప్రశ్నించినాఁడు. "నీశిష్యుఁ డగు పురాణసిం"గని జవాబు వచ్చినవెం

టనే లేచి తలుపుతెఱచి, శిష్యునిఁ గూర్చుండు మని, యోగా గ్నివిస్ఫులింగములు గ్రక్కు నేత్రములతో నాతని నొకసారి తిల కించి, "త్యాగమే యీ దేశమోక్షము నాపాదింపఁగలదు. భారత వర్ష స్వాతంత్ర్యము చేకూరుటకుముందు, రామునిశిరస్సు ఖండ మ్మై పోవలెను; తరువాతఁ బురాణసింగుమస్తక మెగుర వలెను; ఆవెనుక మనబోంట్లు వందలకొలఁది వీరుల శిరఃఖండ నము జరుగవలయు"నని పలికెను. ఖండాంతరయాత్రకు ముం దిట్టివాక్యము లెన్నఁడును రామునినోటినుండి వెలువడలేదు. స్వారాజ్యలక్ష్మి ననుభవించి, సర్వోన్నతపదవుల నలంకరించు చున్నపశ్చిమదేశములను స్వయముగాఁ జూచి, యధఃపతితమై యున్న స్వదేశమును జూచునప్పటికి రాముని హృదయము చలించినది.

ఈప్రసంగమైనవెనుక రాముఁడు పురాణసింగుతో గది నుండి బయటికి వచ్చుసరి కిరువురు ప్రభుత్వరహస్య పరిచార కులు వచ్చి స్వామికి నమస్కరించిరి. స్వామి తిరిగి వారికి నమ స్కరించి ప్రచండముగా నవ్వనారంభించెను. ఇట్లు నవ్వుపూర్తి యైనవెనుక, "ఓ సోదరదేశీయులారా! రాముని నేఁడు పసి కట్టుట (detect) కై మీరు వచ్చియున్నారు. రాముఁడు తన హృదయమును బహిరంగముగా మీయెదుటఁ బెట్టుచున్నాఁడు. ఈసృష్టిలో మహోత్తమ మగు కార్యము రామునిఁ గనుఁగొనుట యే! రాముని దర్శించి, రహస్యమును గ్రహింపుఁడు. విశ్వ మంతయు మీపాదములకడఁ బడి వంగి నమస్కరించు" నని హేళనగాఁ బల్కెను. ఈమాటలు రామునినోటినుండి వెడలు

టయే తడవుగా నా ప్రభుత్వదాసులు రాముని పాదములకు సాష్టాంగ నమస్కారము లొనర్చి "స్వామిజీ! మమ్ము క్షమింపుఁడు. మాయుద్యోగధర్మము నెఱవేర్చుటకై మేము వచ్చితిమి. మీ చిన్మయానందముద్రిత ముఖాంబుజము, మీ యనర్గళ ప్రేమరసము నివి మమ్ము జయించినవి. మేము పాపాంధులము క్షమింపుఁ"డని చెప్పి వెడలిపోయిరి.

రాముఁడు యమునాతీరముననున్న యిసుకతిన్నెలలో నొంటి కటివస్త్రముతో సూర్యాతపస్నానము చేయుచుఁ గూర్చుండువాఁడు. ఒకనాఁడు నదిలోఁ గొందఱు భారతీయక్రైస్తవులు స్త్రీలు, పురుషులు పెక్కురు పడవలలోఁ బోవుచుండుటఁ జూచి రాముఁడు వారితోఁ బ్రసంగింప నిచ్ఛగించి, వారినిఁ దోడ్కొనిరమ్మని పురాణసింగును బంపెను. వారు రాముని వాక్యములు విని, తన్మయులై నిలచిపోయిరి. రాముఁ డంత, "మిమ్మీవిధమున నుద్ధరించిన క్రైస్తవ మతాధికారులను రాముఁ డభినందించుచున్నాఁడు. హిందూసోదరులు మీకుఁ జేయలేని సాహాయ్యమును క్రైస్తవులుచేసిరి. మీరు పొందిన సాంఘికౌన్నత్యమునకు మీరు ప్రదర్శించు దరహాసవదనములకు రాముఁడు మిగుల సంతసించినాఁడు. మీరు జన్మించిన యీ భారత దేశముపై భక్తి నిమాత్ర మెన్నఁడును విడనాడకుఁ" డని చెప్పి వారినిఁ బంపివేసెను.

కొన్ని దినములైనవెనుక రాముఁ డొకనాఁడు ముత్రాలోని యాశ్రమమును, స్వార్థపరాయణుఁడగు శివగుణాచార్యుని సాంగత్యమును విడిచి, పుష్కరమునకు బయలుదేఱి వెడలి

పోయెను. పుష్కరకాసారతీరముననున్న కిషన్ఘర్ రాజభవనములో రాముని బస. కాని, యాతఁడెల్లవేళల నిసుకతిన్నెల మీఁదనే పరుండువాఁడు. "రామునికి గదులన్న నసహ్యము. గదులే శ్మశానభూము"లని యాతఁడు పలుకుచుండువాఁడు.

రాముఁడు తనదర్శనముకొఱకు కరుదెంచుమిత్రుల నందఱను దోడ్కొని నదీతీరమునకుఁబోవును. అచట వారిని 'ఓం' కారము నుచ్చరింపుఁడని యాజ్ఞాపించును. రాముని యెదుట మఱేకార్యమును జేయుటకాని, మఱేమాట యాడుటకాని వల నుపడదు. ఒకనాఁడు పురాణసింగును దోడ్కొని పుష్కరమునకు స్వామి స్నానమునకు వెడలెను. పుష్కరములో మానవులను గుటకలో మ్రింగు మొసళ్ళు నిరంతరము తిరుగాడుచుండును. రాముఁడీఁదఁగలఁడు. పురాణసింగున కీఁత రాదు. మొసళ్ళభయము! రాముఁడు తనచేతికఱ్ఱముందు నీట విడిచెను. అనఁగా, భగవత్స్వరూపుఁడగు రాముఁడు స్నానమునకు వచ్చినాఁడు కావున జలజంతువులన్నియు రామునికిఁ దావీయవలెనని దండశాసనము! వెంటనే రాముఁడు సరస్సులోఁబడి యీఁద నారంభించెను. పురాణసింగు గుండె కొట్టుకొనుచు నేయుండెను.

వ్యక్తిదూషణము రాముఁడు సహింపనివానిలోఁ బ్రధానమైనది. "అన్యులఁగూర్చి యెన్నఁడు దుర్గుణములు దోషములు నేకరవుపెట్టకుఁడు. ప్రతివ్యక్తిలోని సౌజన్యమును గమనించి యానందించుటే మనవిధి" యని యాతఁడు బోధించెను. మిత్రులు ప్రసంగవశమున నావేశములోఁబడి వ్యక్తిదూషణలోఁ

బడిన నాతఁడు భూనభోంతరాళములు కంపితము లగునట్లు "ఓంకారము" నుచ్చరించి వారిఘోరణిని మఱపించును.

పురాణసింగుతో లాహోరునుండి యొక దక్షిణదేశ బ్రాహ్మణేతరబాలుఁడు రాముని జూడ వచ్చినాఁడు. భోజనము నొకనాఁ డాతఁడు వడ్డించుచుండ, "నాయఁడూ ! పప్పు తీసికోనిరా"యని రాముఁడు పిలిచెను. నాయఁడు రాముని ఓంకారము నుచ్చరించుటే పరమావధిగాఁ బెట్టుకొన్నాఁడు. రాముని కేక కాతఁడు "తెచ్చెద" నని బదులుచెప్పక, "ఓం" అనియే బదులుచెప్పెను. ఏసమాధానమైనను నాయఁడు 'ఓం' తప్ప మఱేమియుఁ బలుకఁడు. ఇది చూచి రాముఁడు బ్రహ్మానందభరితుఁడయ్యెను.

భారతజాతి నిర్మాణము

రామతీర్థస్వామి పశ్చిమ ప్రపంచమున వేదాంతసందేశము ననర్గళదైవభక్తితో ఘోషించి భారతదేశమునకుఁ దిరిగి వచ్చినాఁడు. పశ్చిమఖండములో నాఁడు పెంపొంది లోకమును భ్రమింపఁజేయుచున్న యప్రతిమాన జాతినిర్మాణశక్తి నాతఁడు తిలకించినాఁడు. భారతదేశమున శక్తిహీనమై పరితపించుచున్న స్వకీయనిర్జీవజాతి నాతఁడు చూచి విహ్వలత పొందినాఁడు. భారతదేశము వేదాంతమతరాజమునకుఁ బుట్టినిల్లయినను, సంఘనిర్మాణశక్తి, స్వజాతిధర్మదీక్ష, స్వదేశభక్తి వివిధసంఘుసమన్వయాభిలాష వీనిని మఱచి, ఇహపరముల

రెంటికిని దూరమై, నీచస్థితిలోఁ బడినది. ఒకప్పుడు విజ్ఞానదీప్తి కల దేశదేశముల వెలిఁగించిన ఆర్యజాతి, నేఁ డంధతమసమున మ్రగ్గియుండుట రామతీర్థుఁడు కన్నారఁ గాంచి, భారతజాతీయ పునర్నిర్మాణమునకు వలయుసాధనలమీఁదికి దనదృష్టిని ప్రసరించినాఁడు.

ప్రపంచములో నెన్ని దేశముల నైనను జయించి, చక్రవర్తిపదవి ననర్గళముగా సాధింపవచ్చును. కాని, నేఁటిభారతదేశములో నట్లు నడువదు. ప్రపంచములోని జాతు లన్నియు నీదేశమునఁ బ్రాతినిధ్యమును గాంచియున్నవి. ప్రపంచములోఁ గల మతములన్నిటి నభిమానించుసంఘము లన్నియు నీపుణ్యభూమి నాశ్రయించియున్నవి. భాషాభేదముచే, మతభేదముచే, జాతిభేదముచే నింకను వీనిలోఁ గల గణనాతీతశాఖోపశాఖలచే, నీదేశము ఖండఖండములుగఁ జీలిపోయినది. అన్నిటికన్న ముఖ్యము పరాధీనత వేరుపురుగై, వివిధసంఘనాయకులలోని సుహృద్భావమును సమూలముగాఁ గొఱికివైచినది. ఏశాఖ కాశాఖ తానే వృక్షమునని నమ్మి తదితరశాఖలఁ దూలనాడుచున్నది.

ఇట్లు చీలిపోయిన వివిధసంఘములకు, శాఖలకు నొకే యాదర్శము చూపి, ఏకసూత్రముచేఁ గట్టివేయుటకు విశేష దూరదర్శిత్వము, అనంతధీశక్తి, అపారదైవసంపత్తియుఁ గల వ్యక్తి యవసరము. సర్వభూతములలో నంతర్యామివలె నిరంతరము ప్రవహించుచున్న పరమాత్మస్వరూప మొక్కటే యను దివ్యోపదేశమును ముక్తకంఠముతోఁ జాటిన హిందూ

మతసూత్రము ననుక్షణజీవితములో నాచరణపూర్వకముగాఁ జూపఁగల వ్యక్తియే భారతజాతీయనాయకపీఠము నధిష్ఠింప సమర్థుఁడు. బాహ్యము లగునొడంబడికలు, సమావేశములు, రాజకీయకుతంత్రములు, సాంఘికసమానత్వవాగ్వివాదములు, నివి ఆత్మైక్యసూత్రానుగుణాచరణ లేనినాఁడు, శుష్కప్రయత్నములు, నిరర్థకప్రలాపములుగాఁ బరిణమించును.

సర్వప్రాణికోటిలో నంతర్యామియై వెల్గొందుచున్న పరమాత్మదర్శనముచేఁ దన్మయత్వముఁ గాంచినరామతీర్థస్వామి దృష్టిలో భారతజాతిసమస్య యెట్టిస్ఫురద్రూపమును వహించి నదో తిలకింపుఁడు; "శైవులకు శివుఁడై, వైష్ణవులకు విష్ణువై, బౌద్ధులకు బుద్ధుఁడై, క్రైస్తవులకు క్రీస్తై, మహమ్మదీయులకు మహమ్మదై భారతపుణ్యభూమి స్వరూపమునఁ బ్రత్యక్షమైన పరమేశ్వరుని నే నారాధించెదను. ఓ భారతజననీ! నీసమస్త రూపములలో నేను ని న్నర్చించెదను, నీవే నాగంగామాతవు! నా కాళికాంబవు! నా సాలగ్రామదేవతవు! ఆఁకటిబాధచే నడలుచున్న దరిద్రభారతపుత్రస్వరూపము నీదే! ఇదియే నా మతము. ప్రతిభారతవ్యక్తికి నిదే మతము, ధర్మము, వేదాంతము కావలసియున్నది. ఉచ్చారణమాత్రముచే నాఁగిపోవుస్తోత్రపాఠములు కావు వలయునవి; దైనికాచరణలో నిత్యజీవితములోఁ బ్రదర్శింప నగు పరస్పరసాహాయ్యమే వలయునది. అఖండశక్తుల ప్రసవింపఁజేయు వీరజాతీయత ప్రతిభారతీయుఁడు నేఁ డాచరణలోఁ జూపవలసియున్నది. సర్వాత్మస్వరూపుఁ డగు పరమాత్మతో నైక్యము పొందఁగలుగుట,

అఖిలమాతృదేశముతో నైక్యభావము మొదట శరీరములోని ప్రతిరక్తనాళములోను గెరలి క్రిక్కిఱిసినఁగాని లభింపదు. ప్రతి భారతవ్యక్తిలో భారతవర్ష మంతయు సంకుచితమైయున్నది. ఈ భావముతోఁ బ్రతివ్యక్తియు మాతృదేశసేవకై బద్ధకంకణుఁడై నిలఁబడవలయును. భారతవర్షములోని ప్రతి పట్టణము, నది, చెట్టు, పుట్ట, చీమ, జంతువు, ఱాయి, ఱప్ప, అన్నియు భగవంతుని రూపములుగా నర్పింపఁబడుచున్నవి. అందుచే నేఁడు, భారతములోని ప్రతిప్రాణిని, భారతమాతృరూపమునఁ దిలకించి యారాధింపవలయు నవసరము వచ్చినది; దుర్గావిగ్రహమునకుఁ బ్రాణప్రతిష్ఠ యొనర్చి, హిందువు లర్చించుట లేదా ? సజీవమై యున్న భారతపుణ్యభూమిని లోకైకజననిఁగాఁ బూజించుట నేఁ డవసరముకాదా ? మనహృదయముల నేకీభవింపఁ జేసినచో, మనమనస్సులు హస్తము లప్రయత్నముగాఁ గలియును.

జాతియొక్క సౌధము నిష్కల్మషహృదయములలో నిమిడియున్న యీశ్వరప్రేమ యను పునాదిమీఁదనే కట్టవలయును. ప్రతిప్రాణిహృదయ పీఠముపై నధిష్ఠితుఁడై అంతర్దృష్టితోఁ దిలకించువాని కనంతశాంతిసుఖముల నొసఁగు పరమేశ్వరజ్యోతిని దర్శింపఁగల విమలహృదయమే జాతిలోని విభేదములను దుడిచివైచి, ఏకీభావమును నంతరింప సమర్థమైనది. వేదాంతసందేశమే, ఆత్మైక్యసూత్రమును దశదిశ లదరిపడునట్లు విశ్వమును సమ్మోహిత మొనర్చురీతి, యుగముల వెనుకనుండి, పశ్చిమజాతు లంధకారమునఁ బడి యున్నప్పటి

నుండి, ఘోషించుచునే యున్నది. భారతపుత్రుఁడే యీసఁ దేశము నాచరించి, పవిత్రనూతన భారతజాతి నేకసూత్రముపై నిలఁబెట్టి, లోకశాంతిని జేకూర్పవలసియున్నది.

పరస్పరజాతివిరుద్ధప్రచారములు నేఁడు భారతభూమిని దెగనమ్మివేయు దుర్భరదుఃస్థితిలో నుండఁగా, భారతీయులలో నధికసంఖ్యాకులగు హిందువులైన నైకమత్యము వీడి, సంఘ సంస్కర్తలని, సనాతనఛాందసు లని సంఘమును జీల్చి, పెనఁగు లాడుచున్నారు. సనాతనవాదులలోని మాంద్యమును దిల కించి పరిశుద్ధమగు హిందూమతమును దూషించు సంస్కర్తల క్రొత్తఛాందోళనలు, నవీనజాతి కవసరములగు నూతనభావముల సంఘమునఁ జొనుప యత్నించు సంస్కర్తలనుమ్లేచ్ఛులని తూల నాడు ఛాందసులు బయలుదేఱి యెవరికివారు దేశముసుద్ధరించు చున్నా మని తలఁచి జాతిహృదయమును గలవరపఱచివైచి నారు. జాతీయనిర్మాణమునకు, రెండుతరగతులు నవసరమే యని గుర్తించుట కష్టసాధ్యము కాదు. పరుగులెత్తు సంస్క ర్తలు పడుటయుఁ గలదు. ప్రాకుటతోఁ దృప్తిపొందు సనాత నులు మాంద్యపంకమునఁ బడుటయుఁ గలదు. ఈ రెండుదృష్టు లను సమ్మేళన మొనర్చి, నడపుహృదయమే దూరదృష్టికలది. అందుచేతనే రామతీర్థస్వామి వారి కీక్రిందివిధమున ఘోషించి యున్నాఁడు.

"ప్రియులగు నోసనాతనవాదులారా! శాస్త్రజ్ఞానము నాచరణలోఁ బెట్టి చూపుఁడు. ఆపద్ధర్మము ననుసరించియైనను, జాతివర్ణభేదములలోని కాఠిన్యమును మీరు సడలించి, జాతిలో

నేకోదరభావమును బెంపొందింపవలసియున్నది. భారతదేశము తనద్వారములను దోపిడిగాండ్రకు, దొంగలకుఁ దెఱచి యిచ్చి పరజాతుల నెన్నెటినో పోషించి, తనగర్భమునఁ బుట్టిన బిడ్డలకు నేఁడు తిండి లేకుండఁజేసికొన్న విషయము మీకుఁ దెలియదా? ప్రతివ్యక్తికిఁ బెరుగుటకు వలయు నాత్మస్వాతంత్ర్యమును మీరు దానముచేయుఁడు. నీశిరస్సును నీ వెంతయెత్తునకైన నెత్త వచ్చును కాని, నీపాదములు పరులమస్తకములపైఁ బడకుండఁ జూచుకొనుము.

ఓయీ ! సంస్కర్తృసోదరా ! ప్రాచీన హిందూమతాచారముల నూరక తూలనాడకుము. మఱల నింకొక శాఖను నీవు సృజించి, ఐకమత్యసూత్రముపై నింకొక గొడ్డలిపెట్టు పెట్టకుము. నేఁటి భారతదేశభౌతికపతనమునకుఁ గారణములు, సనాతనధర్మములు కావు. భారతవర్ష మను పుష్పవనము కంచెలులేక పరహస్తములఁ బడినది. నీవు చేయవలసినపని మిగిలియున్న పుష్పములను దుంచివేయుటకాదు. కంచెలను దెచ్చి చేతనైనట్లు వనముచుట్టును బాఁతి రక్షింపుము.

భారతదేశచరిత్రమందలి క్లిష్టపరిస్థితులయందు మనము జన్మించితి మని విచారింప నవసరము లేదు. దేశసేవ చేయుట కనంతములగు నవకాశములు లభించెనని సంతసింపవలెను. మనముచేయవలయు కార్యము వీరత్వమును, దూరదృష్టిని, ఏకాగ్రతను గోరుచున్నది. సుఖముగా సుషుప్తిపొందినవారు మాత్రమే చక్కఁగా మేల్కొనఁగలరు. ఈయార్యావర్తము సుఖసుషుప్తి నందినది. అందుచే నామె జాగ్రదవస్థ యద్భుత

ముగా నుండితీరును. భారతసంతానములో మనము మేల్కొల్పవలసిన వివి; "పరస్పరవిమర్శ విడిచి, పరస్పరాభివందనము సోదరభావము, సమన్వయదృష్టి, వివిధశక్తిసమ్మేళనము; వృత్తిగౌరవము."

నవీన హిందూమతశాఖాసమన్వయము

ఏకమై యద్వితీయ మగు నుపనిషన్మతమునుండి శంకర రామానుజాదులు, తమతమ కాలముల కవసరమగురీతి సిద్ధాంతములు పరస్పరవిరుద్ధములుగ లోకమున బోధించి గతించినారు. వారివారికాలములలో, సంఘజీవమునకు వారిసిద్ధాంతము లవసరములై, మతమును గాపాడినవి. చెల్లాచెదరగుచున్న హిందూమతమును, వారు తమ యప్రతిమాన మేధాసంపత్తిచే, అనల్పవైరాగ్యముచే, అసమానాత్మానుభవముచే నుద్ధరించి, ధన్యులై వెడలినారు. కాని, సామాన్యమానవులు ఆత్మానుభవరంగములోఁ దిరుగాడుశక్తిలేక తీవ్రమగు పరమేశ్వరవాంఛ నెఱుఁగక, పరమోద్దేశముతోఁ జెప్పిన సిద్ధాంతములను గూరగాయలనువలెఁ దఱిగి, విఱిచి, అపార్థములను గల్పించి, కొట్లాడుచున్నారు. శంకరాదులు పరస్పరవిరుద్ధసిద్ధాంతము లవసరోచితముగఁ బల్కినను, వారందఱకు ననంత వైరాగ్యము, అఖండజ్ఞానతృష్ణ, నిర్మలప్రవర్తనము గలవు. ఇవియే వారివారి జీవితములలోని ప్రధానసందేశములు. వారి సిద్ధాంతములు, కాలోచితములు, అప్రధానములు. కాని,

సామాన్యులు తాఱుమాఱుచేసి, అపరిధానసిద్ధాంతములకుఁ బ్రాధాన్యమిచ్చి, సత్యమతకాంక్షకు శాశ్వతముగా దూరులగు చున్నారు. కాని, ద్వైతాద్వైత విశిష్టాద్వైతసిద్ధాంతములకు గమ్యస్థాన మొక్కటే యనుభావము ఈశ్వర తృష్ణగలవారికేఁ గాని, సిద్ధాంతచర్చయందు వాంఛ గలవారికి లభింపదు.

పై సందర్భము దేశములో శాఖాభేదములను సృజించి సంఘమునఁ జీలికలు కల్పించియుండ, నవ్యభారతములోఁ బశ్చిమజాతీయభావసంపర్కముచేఁ, గొందఱు సంస్కర్తలు బయలుదేఱి, మరలఁ గ్రొత్తజీలికలను గల్పించిరి. ఆర్యసమాజము, బ్రాహ్మసమాజము, రామకృష్ణసమాజము మున్నగు నవి, జీర్ణహిందూమతమును, పతితమాతృదేశము నుద్ధరించు సద్భావముతోడనే బయలుదేఱి, సర్వశాఖలను మేళవించు సనాతనసమన్వయ సూత్రమును విడిచి, సాము చేసినవి. కాని, పరిపూర్ణ భారతజాతీయత సర్వమతశాఖా సమన్వయమును గోరుచున్నది. దయానందసరస్వతీస్వామి స్థాపించిన ఆర్య సమాజము, దేశమున కపారమగు సేవచేయకపోలేదు. రామ మోహనరాయలచే నిర్మితమైన బ్రాహ్మసమాజమును, హిందూసంఘము నున్నతస్థానమున నిల్పినమాట నిజమే. వీరందఱు హిందూమతమహాసాగరగర్భమున నున్న రత్నరాశిని గాంచి, తమదృష్టి చలించుటచే, నొక్కొక్కరత్నమును బట్టుకొని, బయటికి వచ్చి, యిదియే రత్నరాశి యని భ్రమించిరి. అన్ని రత్నముల నపహరించి యానందింపఁగలవాఁ డెంత ధన్యుఁడో కదా! పశుతుల్యజీవితము గడపుమూర్ఖమానవుఁడు మొదలు,

పరమేశ్వరతుల్యుఁ డగు భక్తాగ్రేసరచక్రవర్తి వఱకును గల అనంతపరిస్థితులలో నుండు మానవకోటికి వలయు ననంత సాధనమార్గములఁ జూపి, సర్వదృక్పథ సమన్వయ మొనర్చు శక్తిగలదే హిందూమతము. ఆత్మ, పరమేశ్వరుఁడు, వీనిని గూర్చి యేభాషలో, నేమతములో, నే దేశములో, నేజాతిలో, నేకాలములో, నెట్టిభావము ప్రకటింపఁబడినను, నాభావమే, వేదవేదాంతములు తిరుగవేసినచో, ననంతస్ఫురద్రూపముతో వక్కాణింపఁబడియుండుట కాననగును. ఈదివ్యసామరస్యదృష్టిని విడిచిపుచ్చి, భిన్నభిన్నసూత్రములఁ బట్టుకొని ప్రాకులాడు సమాజములు, సంస్థలు, నెట్టిప్రగల్భములుపల్కినను, సంపూర్ణ భారతీయతను మఱుఁగుపఱచునేకాని, నిర్మించి నిలుపఁజాలవు. జాజ్వల్యమాన సనాతనసమగ్రసమన్వయదృష్టి, అనుభవపూర్వకముగాఁ దెలిసి, అనన్యసామాన్యగాంభీర్యముతో లోకరంగమున ప్రయోగించినపుణ్యపురుషులలో రామతీర్థస్వామియొకఁడు. అందుచేతనే, ఒకసమాజమును స్థాపింపు మని తన్నితరులు కోరినపు డాతఁడు కన్నీరు విడిచి, సర్వసమాజములు తనవే యని పల్కినాఁడు. భారతజాతినూత్న నిర్మాణములో నెట్టిదివ్యపదవిని స్వామి యలంకరించెనో తెలియుట కాతనిత్యాగానల సంశుద్ధము లగు నీ క్రిందివాక్యములే సాక్షులు.

"ఒకశాఖవా రొకశాఖవారిని విమర్శించి, దూషించుకొనుటలో నెంతమానవశక్తి, దేశములో నిరుపయోగముగ వ్యయింపఁబడుచున్నదో! వివిధశాఖలకు నంగీకారము లగు భావములనే మనము ప్రకటించి యేల సామరస్యమును జూప

కాదు ? కొందఱకు సనాతనవాదము తలకెక్కుడు. వారి కార్య సమాజము తృప్తినొసఁగవచ్చును. మఱికొందఱకు బ్రాహ్మ సమాజమే రుచింపవచ్చును. ఇట్లే వైష్ణవాదిశాఖలును. నేను చెందియున్న శాఖ, యితరులకుఁ దృప్తినొసఁగకున్నచో వారిని దూషించుటకు నా కేమిహక్కుగలదు ?

ఎవరి కిచ్చవచ్చినశాఖలో వారిని జేరి సంతృప్తిఁ జెంద నిండు. నీవు కాని, నేను కాని, శాఖలోఁ జేరుమని పరులను బలవంతముచేయు టెందులకు ? మన కొక్కటే హక్కుగలదు. సేవచేయుటే మనహక్కు. మన మిత్రులను, శత్రువులను, సర్వ మానవులను, ప్రేమించి, శక్తికొలఁది సేవచేయుటకే మన కధి కార మున్నది. దుర్బలు లగుపిల్లలనే తల్లియెక్కుడు ప్రేమిం చును. నీయభిప్రాయమునకుఁ దలయూఁపనివా రందఱును దప్పు చేసినట్లేనా ? అయినచో వారి యవసరమును దేశమునకుఁ గలదు. ఒంటికాలితో నడచువాఁ డెంతహీనుఁడో కదా ! దేవుని కనులతోఁ జూచుటే సరియగు చదువు.

తే. గీ. తలఁప కో దేవ ! నాలోని తప్పు లెంచి,
నామమే నీది సమదర్శనమ్ముకాదె !
సత్యసంకల్ప మున్న నీ స్పర్శ యొకటె
పావనమొనర్పఁ జాలు నన్, పరమపురుష !

తే. గీ. యమునలో లేదొకో ! పావనాంబుధార,
గోతిలో లేదొకో ! చెడుకుళ్లునీరు,
పరమ గంగాస్రవంతిలోఁ బడినరెండు
దివ్యశుద్ధోదకము కాదె దేవదేవ ! (సూరదాసు)

మనకుఁ గల వ్యక్తిస్థానికధర్మములు జాతిధర్మమును నాశన మొనర్చునవి కాఁగూడదు. జాతిక్షేమముకొఱకు మన మేమి తలపెట్టి సాధించినను దేవతలకు సేవచేసినట్లే! ఇదియే యజ్ఞము. ఈయజ్ఞము భారతమాతృదేవతార్పణముగాఁ జేయ వలయును. గీతలోఁ జెప్పఁబడిన శ్లోకార్థ మిదియే;

శ్లో. యజ్ఞశిష్టాశినస్సంతో ముచ్యంతేసర్వకిల్బిషైః
భుంజతేతేత్వఘంపాపా యేపచంత్యాత్మకారణాత్.

"సత్పురుషులు యజ్ఞశిష్టమైనయన్నమును భుజించి సర్వపాపములనుండి విముక్తు లగుచున్నారు. తమ యుదర పోషణకొఱకే యెవరు పచనముచేయుచున్నారో అట్టి పాపా త్ములు పాపమునే అనుభవించుచున్నారు."

పరమేశ్వరదర్శనము వలయుచో, సన్న్యాసదృష్టి యవస రము. మనలో నున్న స్వార్థమును, మాతృదేశమాహాత్మ్యము లో లయ మొనర్పవలయును. బ్రహ్మానందము కోరుచో నీవు బ్రాహ్మణధర్మానుష్ఠానముచే నీబుద్ధిశక్తిని దేశాభ్యుదయము కొఱకై త్యాగ మొనర్పుము; నీయనుక్షణజీవితములో, స్వదేశ రక్షణనిమిత్తము, ప్రాణముల నొడ్డుపెట్టుక్షాత్రధర్మము నవలం బింపుము; జాతిపోషణనిమిత్తమే నీ ధన మను వైశ్యధర్మమును అనుక్షణము నాచరింపుము; నీకు నిజముగ బ్రహ్మానుభవాసక్తి యున్నట్లు ఋజువుచేయుటకు, బ్రాహ్మణ, క్షాత్ర, వైశ్య వీర త్వములను ప్రాచీనకాలమున శూద్రులకొసంగిన సేవాధికార మును, నీహస్తపాదములద్వారమున, సమగ్రముగ నాచరించి చూపుము. చండాలత్వములో దైవత్వమును జూచు సన్న్యా

సమే నేఁడు వలయునది. ఇదియే మార్గము, లెమ్ము, మేల్కొనుము.

హిందూదేశములో ననేకశతాబ్దములనుండి, మహమ్మదీయులు హిందువులతోఁ గలిసి, సోదరభావముతో జీవించుచున్నారు. కాని, దక్షిణయూరపుభాగములోనున్న తురుష్కులన్న వారికి మితిలేని ప్రేమ, ప్రక్కయింటిలోని హిందువు లన్న ద్వేషము ! హిందువు లగుతల్లిదండ్రుల రక్తమాంసములకుఁ బుట్టి, కర్మము చాలక క్రైస్తవుఁ డగు బాలుఁడు, హిందువులకు వీధిలోని కుక్కకంటె, విదేశీయుఁ డగును. ముత్రాపట్టణములోని వైష్ణవుఁడు, దక్కనులోని వైష్ణవున కాపద వచ్చినదని విని గంతులిడి, తనయింటిలో నద్దెకున్న వేదాంతమతస్థుని నీచముగాఁ జూచును ! ఎవరిది లోపము ? మతశాఖాహంకారములు, మిడిమిడిజ్ఞానములు నిట్లు దేశద్రోహకరములైనవి.

దేశములో నేఁడు వివిధమతసంఘములవారు, తాము పరస్పరశత్రువులనుగా భావించుకొని, తప్పనిసరిచే గతిలేక యొకచో నివసించుచున్నట్లున్నారు. సర్వశాఖలకు నేకజాతీయత యనుమాట గోచరించుటయే లేదు. దీనికి హేతువేమి ? మతముపేర బోధింపఁబడు ప్రాచీనజీవరహితాచారములు, పిచ్చి నమ్మకములు. ప్రమాణధర్మము పేర జరుగుచున్న యాధ్యాత్మికాత్మహత్య యిట్లే పరిణమించును."

పుష్కర లేఖలు

ప్రపంచములో మహాపురుషుల లేఖలు చిరస్మరణీయములు. లోకములో దైనిక చర్యలోఁ బ్రతివ్యక్తియు లెక్కలేనన్ని లేఖలు వ్రాయుచుండును. ఈ లేఖలు కుప్పలై, ప్రతిచోట నేఁటేట నగ్నిసంస్కారము పొందుచుండును. క్షణములో మఱచిపోనగున శ్వరవిషయములఁగూర్చియే ప్రజలు తఱచు వ్రాయుటచే నవి వ్రాయువారికి, వ్రాయఁబడువారికి, తాత్కాలిక ప్రయోజనకరములే కాని, చిరప్రయోజనకరములు కావు. మానవులు సర్వసామాన్యముగ వ్యావహారిక ప్రపంచములో జీవించుచుండుటచే నావ్యాపారసందర్భములే వారు వ్రాయు లేఖలందు నింపుదురు. కాని, నూటికో కోటికో యొక మహావ్యక్తి, ఆత్మ ప్రపంచమున యాత్రచేసి, అనుభవించు విషయములను, లోకావసరములకై లేఖలపూర్వకముగ వ్రాసినచో నవి నిత్యములై వెల్గొందుచుండును. రామతీర్థస్వామి నూటికి నూఱుపాళ్లును ఆధ్యాత్మిక పురుషుఁడు. తాను జీవించిన స్వల్పకాలము నాతఁడు తుచ్ఛలౌకిక వ్యాపారము లనుడొంకలను విడిచి, ఆత్మారాముఁ డప్రమత్తుఁడై, అనాచ్ఛాదితుఁడై లీలసల్పు పవిత్రహిమాలయ పర్వతశ్రేణులలో విహరించినాఁడు. జీవేశ్వరులమధ్య జరిగిన దివ్యసంభాషణలే, ఆత్మ, పరమానందప్రదాతయగు పరమేశ్వరునితోఁ జేసిన చర్చలే, రామతీర్థస్వామి వ్రాసిన లేఖలలో విదితములగుచున్నవి.

తన శిష్యురాలగు వెల్మాన్ సతీమణి కాతఁడు పుష్కరమునుండి 1905 వ సంవత్సరములో నిట్లు వ్రాసియున్నాఁడు:

"ఓ విశ్వమాతృస్వరూపురాలవగు తల్లీ! నేఁడు బొంబాయి విశ్వవిద్యాలయమునందు పట్టభద్రతపొందిన యొక యువకుఁడు వచ్చి రామకార్యమునకై తనజీవితమును త్యాగముచేయనిశ్చయించుకొని శిష్యుఁడైనాఁడు. ఇది పరమేశ్వరుని యిచ్ఛ. భక్తులు తలపెట్టుకార్యములకు భగవంతుఁడు లోపము కలుగనీయఁడు. శిష్యుఁడగు నారాయణస్వామిని వేదాంత సందేశ వ్యాప్తికై పంపెదను.

విఖ్యాతనగరములో జరుగుపని యెంతపూజ్యమైనదో, పేరులేని మాఋమూలలందుఁ జేయుసేవయు నంతఘనమైనదే. బండిచక్రములోని యినుపచిన్నముక్కయే. కాని, బండినిలాగు నెద్దులకన్న నీచిన్నముక్కయే ముఖ్యమైనది. బండియినుపులోని ముక్కను తీసివేసిన, బండి కూలఁబడును. ఈశ్వరదృష్టిలోఁ బ్రేమహస్తములతోఁ జేయఁబడు నెంత స్వల్పకార్యమైనను, మహోత్తమమైనదే. అపరిమిత వైశాల్యము గల సూర్యబింబము నెదుట, నత్యల్పమగు మంచునీటిబిందువు లెక్కలేనిదే! కాని, కనులుండి చూచువారి కానీటిబిందువే, రవి బింబమును, అద్భుతముగాఁ దనలో నిముడ్చుకొని ప్రతిబింబించును. కావున నో ప్రియజననీ! పేరూరులేని మాఋమూలలఁ జేయఁబడు వినయముద్రిత మగు నత్యల్పసేవయుఁ, బ్రఖ్యాతపట్టణములోఁ బ్రపంచమంతయు మార్మ్రోఁగునట్లు ధ్వనిపుట్టించు కార్యములతోఁ దులతూఁగకపోదు. పసితనములో బాలునిఁ బ్రేమరసము నిచ్చి కన్నతల్లి పెంచును. ఆతఁడు పెరిగి, పెద్దయై, విశ్వవిద్యాలయమున కరుగునపు డధ్యాపకునకు బాలునియందుఁగల

భారము తల్లికి లేదు. కాని, అధ్యాపకుని కృషికంటెఁ దల్లిచేయు సేవ యెన్నియోరెట్లు ఘనమైనది. పసితనములో నాతల్లిచేయు వలెయు నాదివ్యసేవ నుపాధ్యాయుఁడెన్నఁడైనఁ జేయఁగలఁడా?

వేదాంతము చెప్పున దేమనఁ గష్టించి,కరద్వయముతోఁ జేయు కూలివానికృషి, శ్రీకృష్ణాద్యవతారపురుషుల మహాఘన కార్యములంతటి పవిత్రమైనదే, అవసరమైనదే. ఒకకుర్చీ యొక్క ఒకకోడు కదిపినచోఁ గుర్చీయంతయుఁ గదలును. అట్లే మన మొకజీవి నుద్ధరింపఁగల్గినచో మానవకోటి యంతయు ధన్యమగును. జీవప్రపంచ మట్టి సంబంధముకలది"

ప్రకృతిగర్భమున సుఖాసీనుఁడై కూర్చుండి, యచింత్యుఁడు, నిర్గుణుఁడు, రూపాతీతుఁ డయ్యు, విశ్వరంగము నలంకరించి, సౌందర్యరసధారల ననంతముగాఁ బ్రదర్శించి, బాహ్యప్రకృతిసీమల నృత్యములుసల్పు జగత్కారణుని విలాసములో నైక్యమై, మమకారమును మఱచి, ప్రత్యక్ష బ్రహ్మానందమును గుత్తకబంటిఁగ్రోలు రామతీర్థస్వామి, పుష్కరమునుండి యీయా దిగువలేఖను వ్రాసియున్నాఁడు. "జగదేకమాతృస్వరూపురాలవగు నోజననీ! నే నున్నచోట మందమలయానిలములు నిరంతరమును వీచుచుండును. నాకుఁ బ్రతిదినమును సంవత్సరాది పండుగయే! ప్రతిరాత్రియు శివరాత్రియే! నీలాంబరమే నా స్వర్ణకలశము. నక్షత్రమండల తేజోరాశియే నాయమృతరసము.

కొండలమీఁద విహరించు చిరుగాలిని నేనే. పర్వతాగ్రములనుండి, నగరవీధులలోఁ దిరిగి పయనించుచుందును. ఎట్లు విహరించినను నాకు బంధములు లేవు.

మందమలయవాతపోతమునై, పురుషులను, స్త్రీలను, సమస్తప్రాణికోటిని స్పృశించి నిర్లిప్తుఁడనై యాటలాడుదును.

నేను దివ్యజ్యోతిర్మయుఁడను. లతాపుష్పములను నేనే పోషింతును. బలాఢ్యుల సుందరాకారుల నేత్రగోళములలో నేనే మిన్కుమిన్కుమనుచు వెలుఁగొందుచుందును.

సమస్తజ్యోతులకుఁ గాంతినొసఁగుజ్యోతిలో లీనమైన వానికి, సమస్తమార్గము లప్రయత్నముగాఁ గన్పట్టును. అట్టి వ్యక్తి చేయుకార్యములకు దైవసంకల్పములకు భేదముండదు."

శిష్యుఁడగు నారాయణస్వామి కీ క్రిందివిధమున, రామతీర్థస్వామి వ్రాసియున్నాఁడు.

"రామునికొక ప్రత్యేకసంకల్పములేదు. సర్వము పరమేశ్వరసంకల్ప ఫలితమే. బుద్ధుఁడు మున్నగు ప్రవక్తల యాదర్శములు మన కేమిచేయఁగలవు? వారికాలములో బుద్ధుని, క్రీస్తును, వారి మిత్రులు ననుచరులే విసర్జించినారు. తాను తపస్సు చేసిన యేడేండ్లలో రెండేండ్లు, బుద్ధుఁ డొంటరియై కాలము గడపినవెనుకనే శిష్యులు గుమిగూడినారు. మనకు బుద్ధులు చెప్పుమిత్రుల వాక్యములు నమ్మి, మనము మోసపోరాదు. వారివాక్యము లీశ్వరధర్మబద్ధములైనవే అయినచో నీపాటి వేల కొలఁది బుద్ధభగవానులు పుట్టియే యుందురు.

పట్టుదలతోఁ గ్రమముగా మధువులోఁ జిక్కుపడిన తనపాదములను తేనెటీఁగ యెట్లు విడిపించుకొని స్వేచ్ఛపొందునో, అట్లే మనమును రూపములకు, వ్యక్తులకు బుద్ధిపూర్వక

ముగ బిగించుకొనిన బంధములను సడలించివేసికొనవలయును. మనము ప్రయత్నముచే నట్లు బంధవిచ్ఛేదన మొనర్చుకొనకున్న యెడల, మృత్యువే వచ్చిపడి, ఆపని బలవంతముగఁ జేసి వైచును.

జగద్ధర్మచక్రమున కడ్డులేదు. దాని బాట నెఱిఁగి యనుసరించువారు ధర్మరథికులే. సర్వేశ్వర సంకల్ప విరోధముగఁ బ్రవర్తింప యత్నించువా రాధర్మచక్రముక్రిందఁబడి తుత్తునియలైపోవుదురు.

సర్వేశ్వరశాసన మగ్నిజ్వాలవంటిది. ప్రపంచసంగములన్నిటి నది భస్మపటల మొనర్చివేయును; అజ్ఞానహృదయములో నిది మంటలెత్తించును; కాని, ఆత్మచుట్టును పెంపొందు సాంసారికరోగముల నది దగ్ధమొనర్చి, పవిత్రమొనర్చును.

ఆహారము సర్వమానవకోటి కెట్లు సర్వసామాన్యమైనదో, మతము నట్లే ప్రతిజీవికి ముఖ్యావసరము. నేను నాస్తికుఁడ ననుకొనువాఁడు, తాను తినునాహారము జీర్ణించువిధాన మెఱుఁగఁ డన్నమాట. విశ్వధర్మమే, తన యమోఘ మగు నధికారశక్తిచే మనల మతాసక్తుల నొనర్చితీరును. మనము నిద్రించుచున్నను ఆధర్మము మనలఁ దన్ని మేల్కొల్పును. ఈశ్వరసంకల్పమునుండి మనము విడిపించుకొనఁజాలము. పరమేశ్వరపరమధర్మ మనుమహాసాగరములో రూపములు, వ్యక్తులు, నీటిబొట్టులు. నిత్యమై నిలుచునదే సత్యమని చెప్పుదురు. ఈసత్య మవిచ్ఛిన్నముగా వెల్గొందునట్లు మఱేరూపములు, సంబంధములు, సంఘములు, నిర్మాణములు నిలువఁజాలవు.

సంకుచితదృష్టి కలనీచమానవు లేల శాశ్వతమగు నీశ్వర సంకల్పమును విడిచి, మటుమాయ మగుమానవసంబంధము లలోఁ బడి పాకులాడెదరు ? కారణ మేమన, అజ్ఞానముచే వారి కనులకు నీడలే నిజములై సత్యమే అసత్యమై తోఁచును. ఆందోళన లెఱుఁగక నడచుచున్న జీవికి, లోకరంగములో గష్టనష్టము లను గుండెదెబ్బలు తగిలినప్పుడు, స్వార్థసంపూర్ణ సన్న్యాసమే సత్యజ్ఞానానందముల నొసఁగునది, వ్యక్తిబాంధవ్యములు నిమేషమాత్రము, లంతరించునీడ లనియు, నదృశ్యము లగు స్వప్నములనియు బోధించుప్రకృతిపాఠమునకుఁ జెవియొసఁగినచోఁ, బ్రతిప్రాణియు ధన్యత నందును. మన మనుకొన్నసుఖములు, దుఃఖములు, సౌందర్యములు, క్రౌర్యములు, పరమేశ్వరుని దాఁగుడుమూఁతలు; తన దివ్యరూపమును దెలిసికొమ్మనియే యిట్లు వారి కీశ్వరుఁడు ప్రదర్శించుచున్నాఁడు.

మిత్రత్వ శత్రుత్వములు శాశ్వతములని, సత్యము లని మనము నమ్మినచో మనల నవి మోసగించితీరును. దుష్టు లనుదోషభావములను కల్పించితిమేని, మనమింకను బరిస్థితిని మఱింత కంటక మొనర్చుచున్నారము. మనశత్రువులను మన యందుఁ గల యవిశ్వాసమునకు, వారికి లేనిదియు, భగవంతుని కొక్కనికే కలదియు నగు నిలకడను వారికి మనమే యాపాదించి, దుస్థితికి మనమే కారకుల మగుచున్నారము. మఱియు వారికి లేని నిత్యత్వమును ముడిపెట్టి యంతతో నూరకొనక, వారి నెదుర్కొనుటవలన, వారియసత్యవ్యక్తిత్వమును స్థిరపఱచి, మనము మఱింత యాతన నాహ్వానించుచున్నాము. సమగ్ర

మమకారత్యాగమే జీవి పరమలక్ష్యమని తెలిసికొనవలయును. ఈలక్ష్యము, అాతికన్న నెక్కుడు సత్యమును, వాస్తవికతను గలిగినదే. దీనికి లింగాకృతినిచ్చి, యర్చించుటలో నర్థము లేకపోలేదు. దుర్భేద్యము, నవిచ్ఛిన్నము నగు దాని శాశ్వతత్వమును మనము గుర్తించుటే కర్తవ్యమని శివలింగము మనకు బోధించుచున్నది.

మహమ్మదీయులును, క్రైస్తవులును భగవంతుని భీషణ స్వరూపునిఁగా వర్ణించుటలోఁ దప్పులేదు. ఈశ్వరధర్మము, వ్యక్తులను గౌరవింపదు. ఏవ్యక్తికాని, ప్రపంచములో నేవస్తువు మీఁదనైనను దన భ్రాంతిని బెట్టుకొన్నచో వెంటనే ప్రకృతి తన యాగ్రహమును జూపి తీరును. ప్రజ లీసత్యమును గ్రహించుటయం దాలసించుటకుఁ గారణము, సత్యాన్వేషణదృష్టి లోపించుటయే. సామాన్యమానవులు, బాహ్య విషయములను బరికించినట్లు, తమలో జరుగుచున్న మార్పులను గ్రహింపఁ జాలరు. తమయందలి నశ్వరపదార్థసంగమకాంక్షలచే సిద్ధములైన దుఃఖములకుఁ దామే కారకులను విమర్శదృష్టిని విడిచిఁ తమ యెదుటివారిని దూషింతురు. రూపములు మార్పుచెంది మటుమాయములు కాక, శాశ్వతములై నిలుచు నను మోహ భ్రాంతులు మనలను బట్టి, నిరంతరము వేధించుచున్నవి.

పెద్దమనుష్యు లనుకొనువారిమాట నమ్మి, వారిపై మన హృదయము నిల్పి, ఈవిధముగా నీశ్వరద్రోహ మొనర్చి, మోసగింపఁబడి యెన్నిసారులు మనము దుఃఖించియుండలేదు ? మనపిల్లల రూపములకు మోహితులమై దేవునియందుఁగంటె

వారియం దెక్కడువిశ్వాస ముంచి, మన మెన్ని పర్యాయ ములు విచారగ్రస్తులము కాలేదు? అవిచ్ఛిన్న విశ్వధర్మస్వరూపియగు సర్వేశ్వరుని నమ్ముట మఱచి, మన హృదయములను మిత్రు లనువారి కొసఁగి, వారి నెన్నిసార్లు మనము మిత్రద్రోహులుగఁ జేసియుండలేదు? ఈశ్వరసాంగత్యముగల మహాత్ముల నర్థము చేసికొనక, మన యుద్దేశములను, మన సిద్ధాంతములను, వారి కంటఁగట్టి యెన్ని మారులు మనము గురుద్రోహముచేసి యుండలేదు? అత్యంతసమీపములో నున్న మన హృదంతరపీఠికపై సాక్షీభూతుఁడై వెల్గొందుచున్న నారాయణుని విడిచిపుచ్చి, క్షణములో నదృశ్యములగు మనభార్యల భౌతికరూపములయందలి దుర్మోహములకు మన హృదయముల నమ్మివేసి యెన్నివిధముల మనము కొట్లాడి, విలపింపలేదు? భగవంతునికంటె నధికమైన దని దేనినేని నీవు నమ్మి ఒకక్షణమైన జీవించులోననే, ఈశ్వరశాసనమే, ఏదో యొకవిధమున నీమోముపైఁ బిడికిలితోఁ బొడిచి నీకు బుద్ధి కఱపును.

కుత్సితములు, క్షణికములు, నీచమోహపరీతములు నగు సామాన్యమానవదాంపత్యప్రేమలను విడిచిపెట్టి, నారాయణావతారమూర్తి యగు కృష్ణభగవానునికి హృదయముల నమ్మివైచినగోపికల ప్రేమసందర్భమైన నెట్టిదో చూడుఁడు. గోపికలుకూడ వ్యక్తిత్వమును ప్రేమించుట యనులోపముచేఁ గన్నీటిధారలు విడువవలసివచ్చినది. పరమపతివ్రతాశిరోమణి యగు సీతామహాసాధ్వియు, రామునిరూపమును నమ్మి, భగ

వంతుఁ డగు రాముని శాసనముచేఁ గంటకారణ్యములకుఁ బోయి దుఃఖింపవలసి వచ్చినది.

సర్వసంగత్యాగధర్మము, నిశ్చల మగు సత్యరాజము, కలలోని పరిదర్శనము కాదు. మహాప్రవక్తలు, తపోధనులు, జాతులను, దేశములను, ఖండములను, ప్రేమచూపి నడిపినా రన్నచో, వారిసందేశములు, ధర్మములు, అనుభవములు, స్వప్నభ్రమలు కావని తేలుచున్నది. ఎన్నియుగములు గడచినను, వారి మాటలందు మానవకోటికి గౌరవవిశ్వాసము లడుగంటకుండుటకుఁ గారణము, వారిహృదయమునఁ బ్రతిఫలించిన సత్యములు భ్రాంతిమయములు కావని స్పష్టమగుచున్నది.

ఈశ్వరశాసనవ్యతిరేకజీవనమే, ప్రబలు సమస్తదుఃఖములకు మూలహేతు వనుమాట నెఱుఁగక, పరిస్థితులను, పరులను, నిందించు హేయమానవులమౌర్ఖ్యము వర్ణింపరానిది.

మట్టమధ్యాహ్నపువేళ మనము గాంచు కలల నెట్లు మఱపను మహాసాగరములో జాఱవిడుతుమో అట్లే, పరుల సదసత్ప్రవర్తనములను, భూషణదూషణములను, మన యంతరంగమునుండి తటెమిన్వైచి, మఱచిపోవుదము గాక! కలలోఁ గన్పట్టిన సదసద్దృశ్యములకై జాగ్రదవస్థలో మనము కాట్లాడుదుమా? అట్లే సదసత్పురుషుల నెవ్వరిని మనము కలిసికొన్నను, వెంటనే మఱచిపోయి యాత్మోన్నతికే మొనకువతో వర్తింపవలయు. సుఖదుఃఖములు, మనకు భగవంతునకు మధ్య నిలఁబడి మనల వెనుకకు నెట్టకుండఁ జూచుకొనవలయును. నా కెన్నియవమానములు జరిగినను చాల వని ఖేదపడు

చున్నాను. ఎన్నియవమానములు వచ్చిపడినను నాయోర్పును బరిశీలింపఁజాలవు.

భగవంతునితోఁ దులతూఁగునదికాని, మించునదికాని లేదు. దూషణభూషణ తిరస్కారాదు లాత్మకుఁ జెందు నని తలఁచితిమా, అవి మందులేని రోగములై బాధించును. నీవే విశ్వశక్తి వని నమ్మి, భగవంతునిలో లీనమై, ప్రణవగాన మొనర్పుము. భౌతిక దేహరోగములను బాధలను రాముఁడు పరమాత్ముని దర్బారునుండివచ్చిన బంటులనుగాఁ జూచును. ఆబంట్లు వచ్చి, రాజశాసనధీరత్వముతో, "ఈయింటినుండి వెంటనే తొలఁగిపొమ్ము! దేహస్మృతిని విడువు" మని యానతిచేయుదురు. దర్బారులో సార్వభౌమపీఠము నలంకరించి నిలిచితినా, వారు నాకు దాస్యమొనర్తురు; కాని, దర్బారు (భగవత్సాన్నిధ్యము) విడిచి, యీదేహస్మృతిలోఁ బడితినా, వారు వచ్చి దండించి పీడింతురు, మానావమానములను గోధాపేక్షలను నీరీతినే గ్రహింపవలయును.

ఏ ప్రభుత్వములైనను, త్రికాలధర్మ మనఁగా, ఈశ్వర శాసనమున కనుగుణములగు శాసనములచే దేశములను పాలింపకున్నచో, స్వకీయ నాశనహేతుభూతము లగును. సర్వమానవుల కొకేహక్కు గలదు. ప్రతివ్యక్తికిని భగవంతుఁడే పూర్ణమగుహక్కు. ఈహక్కువిడిచి, మమకారరోగమునఁ బడి వివిధరంగముల "నాహక్కు" లని పేరులుట సహింపరానిది. ఈధర్మము నెవ్వరును గుర్తింపకున్నచో సన్న్యాసియైనను దన జీవితములోఁ జూపి తీరవలయును.

ఈధర్మము సార్వజనికము. ఇదియే ప్రతివ్యక్తిలో గర్భితమైయున్న పరమాత్మ. రాముఁడే పరమాత్మ. మమకారభూయిష్ఠమగు దైహికాత్మ దగ్ధమై పోవలయు. మనలోనున్న దేహాభిమానపూరిత మగు నహంకారమును దహనమొనర్చినంతనే, పరమాత్మ, తన సహజదివ్యప్రకాశముతో విలసిల్లును. పరమాత్మను మఱచి, యీయల్పమానవ వ్యక్తిత్వముతోఁ గూడిన యహంకారమే, నిత్యాత్మ యని తలఁచుమూర్ఖుని మోహగృధ్రములు పొడిచి చంపును. మానవవ్యక్తిత్వమును బిగపట్టుకొని, యీశ్వరకటాక్షము నాసించుట వేదాంత సందేశముకాదు. భ్రమావృత మగు సంకుచిత మమకారమును ద్రోసిపుచ్చి, పరమాత్మ ప్రకాశసిద్ధి నందుటే వేదాంతము. కోట్లకొలఁది ప్రాణులు, వ్యక్తిత్వమోహమునఁ బడి, దినదినమును భస్మీభూతు లగుచున్నారు. ఈపరమాత్మధర్మము తలక్రిందుగా నర్థముచేసికొని, వేలకొలఁది ప్రాణికోటులు, తుదిలేని దుఃఖాంబుధిలో దురపిల్లుచున్నవి. శివోహ మ్మను ధర్మనే పరమధర్మము.

వేదకాలమునఁ గొన్ని సమయములలోఁ, గన్యకలు, హస్తములు జోడించి, అగ్ని దేవుని చుట్టును గుమిగూడి, ప్రదక్షిణము లొనర్చి, యీవిధముగ గీతములను బాడెడివారు. "సర్వజ్ఞుఁడవు, సర్వభర్తవు నగు దేవా! నీపూజలో మేము నిమగ్నులమై యుందుముగాక! గింజ పొల్లునుండి బయలుపడినట్లు, మేము పితృగృహము లను బంధములనుండి, విముక్తుల

మగుదుముగాక! కాని, మా ప్రాణనాథుల నిలయములనుండి యెన్నఁడును మఱలకుందుముగాక!"

ఈ ప్రాచీనభారతకన్యాగీతము, రాముని హృదయగర్భమునుండి చీల్చుకొని, బహిర్ముఖ మగుచున్నది. ఆనంద బాష్పాంబుధారలు వఱదలై పాఱుచున్నవి.

ఓ పరమేశ్వరా! సత్యస్వరూపా! నాహృదయములోఁ ద్వదీయాన్యవిషయమున కేమాత్రము తావున్నను, వెంటనే తుత్తునియ లగుఁగాక! ఈరక్తనాళములలో స్రవించు రక్త ప్రవాహములో నీశ్వరనామము తప్ప మఱేమి మేళవించినను, గడ్డకట్టిపోవుఁగాక!

మానవుఁడు తన ప్రియురాలినిఁగూర్చి తెలిసికొనునట్లు పరమేశ్వరా! నిన్ను నేను తెలిసికొనెదను. నిన్నొడలు మఱచి కౌఁగిలించుకొని, నీపల్లవాధరామృతరసము నొక చుక్కయైనఁ బోకుండఁ బీల్చివైచి, నీలో లీనమై పోవుదును."

రాముఁడు త్రిశూలపాణినే పాణిగ్రహణము చేసికొన్నాఁడు. మఱేబంధము లాతనికి లేవు."

"ఆనందస్వరూపుఁ డగు శ్రీకృష్ణభగవానుఁ డే నానాథుఁడు. వేఱొకనాథుఁడు, పాలకుఁడు నాకు లేఁడు. —మీరాబాయి"

క్షణములో నదృశ్యములగు ఛాయామాత్రలోకబాంధవ్యములపాటిప్రేమ యీశ్వరుఁడు చూపఁ డని కాఁబోలు! మానవులు పరమాత్మును ప్రేమింప సంశయింతురు. మూర్ఖ విజ్ఞాన మే వారి కనులలో దుమ్ముకొట్టుచున్నది. భక్తునిహృద

యము భగవంతునికై కదలుటతోడనే భగవంతునిహృదయము కరఁగి, స్రవించిపోవును.''

పశ్చిమజీవనము

శ్రీరామతీర్థస్వామి 1904 వ సంవత్సరములోఁ బశ్చిమ ఖండయాత్ర ముగించుకొని, మాతృదేశమునకు మఱలివచ్చి, స్వదేశదుర్భరదుస్థితికి ఖిన్నుఁడై, ఉత్తరహిందూస్థానమున, ననేకముఖ్యపట్టణములలో, ఆత్మశక్తి నుప్పొంగఁ జేయుమహోపన్యాసము లొసఁగినాఁడు. పశ్చిమఖండవాసుల కాతఁడు వేదాంతసందేశమును సమగ్రముగఁ బ్రకటించియున్నాఁడు. జాతిసోదరులకు, స్వదేశోద్ధరణ మార్గములను ధీరగంభీరకంఠమున బ్రబోధించినాఁడు. భిన్నశాఖోపశాఖలు స్థాపించి, జాతిద్రోహమును బెంపొందించుచున్న సంకుచితదృష్టులకు, ఏకజాతీయవిశాలపరిమాణము నెదుటఁబెట్టి, వేదాంతానుగుణపవిత్రజీవనమే ప్రధానసాధనమని, మెఱుపులవంటి మాటలలో నూరిపోసినాఁడు. ఇప్పటికి రామతీర్థస్వామి ముప్పదేండ్లు మాత్రమే నిండిన యువకుఁడు. ఆతఁడిరువదియాఱేండ్లు వచ్చినప్పటికే, జీవితగమ్యస్థానము నెఱిఁగి, ఐహికతృష్ణా పరంపరల కసమానత్యాగశూరత్వముతో విముఖుఁడై, పరమభాగవత ధర్మమే సర్వధనముగ నెంచి, హిమాలయగుహాంతరముల కేఁగి, సర్వేశ్వరసందర్శనసిద్ధి నందినాఁడు. భోగసాగర తరంగాట్టహాసములలోఁబడి, యౌవన సామ్రాజ్యమును యథేచ్ఛగా నితరు

లనుభవింప నువ్విళులూరు నిరువదేడవయేఁట, నవయౌవన వయోవిలాసముతో నవ్యశృంగార రసావతారమును ధిక్కరించు సౌందర్యరాశియై, వెల్గొందు భార్యాలలామను దూరదృష్టితో విసర్జించి, అస్ఖలితబ్రహ్మచర్యదీక్షను గైకొని, ఆత్మారాముఁ డనంతకళావిలాసములతో విహరించు నరణ్యవీథుల కరిగి, పర మాత్మ దివ్యసందర్శనము చేసికొని, అజ్ఞానతమోంధమునఁ బడి యల్లాడు మానవకోటి కీశ్వరధర్మమును బోధించి శాంతిచేకూర్ప ఖండాంతరములకు యాత్రసల్పి, పేరూరులేని సన్న్యాసి రెండేం డ్లలోఁ బ్రపంచవిఖ్యాతపురుషుఁడై మాతృదేశమునకుఁ దిరిగి చనుదెంచినాఁడు.

సమాజములుకాని, సంఘములుకాని స్థాపించి, వ్యావ హారికనాటకము లాడుట రామతీర్థస్వామికి నచ్చదు. ఇదివఱకే దేశములో సమాజము లెక్కువై కలఁతలు పుట్టించినవి. ఇతఁడు జన్మరహస్యమేమో తెలిసికొని, తాను దెలిసికొన్న సత్యాను భూతి నితరులకు సమగ్రముగఁ బంచిపెట్టినాఁడు. ఇఁకముం దెన్నఁడును గంగానదీతీరమును విడిచి పోరాదని నిశ్చయించు కొన్నాఁడు. బదరీనారాయణమునకుఁ బోవుమార్గములో హృషీ కేశమునకుఁ గొలఁదిదూరమున నున్న వ్యాసాశ్రమమునకుఁ బోయి, కొంతకాల మచటఁ గడపినాఁడు. ఇచట నున్నపు డాతఁడు పెద్దగడ్డముపెంచి, వ్యాసుని స్మరింపఁ జేయువాఁడు. వేదవేదాంతగ్రంథముల నెన్నిటినో యాతఁ డాయాశ్రమమున సవ్యాఖ్యానముగాఁ జదివినాఁడు.

ఈ సమయమున రామునిలో నొకమార్పు కలిగినది.

బాహ్యముగా నిదివఱ కాతనినుండి ప్రవహించిన అఖండశక్తి నేఁ డాంతర్యమునఁ బ్రవేశించినది. అందుచే మౌన మాతని ప్రధానలక్షణమైనది. ప్రపంచములో సర్వప్రాణికోటి ప్రవర్తించు వివిధవిచిత్రలీలాభ్యంతరమున సుఖాసీనుఁడై యుండి, లోకరంగమును నడపుచున్న పరమేశ్వరునిఁ దిలకించి, మొదట మోహావేశపరంపరలకు బద్ధుఁడై, హృదయము పొంగి తాను జూపినజ్ఞానములో వీరత్వమును, భక్తిలో ధీరత్వమును వెల్లడించినాఁడు. ఆధీరానుభవములు పూర్తియైనవి. ఘనఘర్వార్భాటములు వర్షానంతరమున శాంతించునట్లే, రామతీర్థస్వామి యందలి ధీరకర్మవిజృంభణములు, క్రమక్రమోన్నతపరమేశనా సాయుజ్యస్థితితోఁ బ్రశాంతిసాగరగర్భమునఁ బడి, అలికిడిలేకుండఁ బోయినవి. ఆతఁడు చదువుట, వ్రాయుట, కర్మచేయుట మానినాఁడు. పలుకరించిన మాట్లాడును. లేకున్న నదియు మాని నట్లే. పురాణసింగు కొందఱు మిత్రులతో రాముని జూడ నరుదెంచినాఁడు. రాముఁడు క్లుప్తముగాఁ బ్రసంగించుట, ఆతని ధ్యానముద్ర, యివి చూచి, పురాణసింగు కొంచెము వికలమనస్కుఁడైనాఁడు. ఇదివఱకు మిత్రులతో బాలునివలె హాస్యములు సల్పి, నవ్వించు రామతీర్థుఁడు నేఁడు మూతి బిగించుకొని, మౌనముద్రాధీనుఁడై యుంట పురాణసింగున కర్థము కాలేదు. వేదాంతములోని మాయాసిద్ధాంతము నరిగించుకొని యిట్లు రాముఁడు భ్రాంతిలోఁ బడియున్నాఁడని పురాణసింగు తలఁచినాఁడు. నారాయణస్వామియు గురువును దర్శించి, యాతని ప్రశాంతముఖమును గాంచి కన్నీళ్లు విడిచినాఁడు. మఱల

-రాముని఼ గార్యక్రమములో దింప నాతఁడు ప్రయత్నించి విఫలుఁ డైనాఁడు.

కొన్ని దినములైనవెనుక స్వామి, వ్యాసాశ్రమమునుండి వశిష్ఠాశ్రమమునకుఁ బోయి యచ్చట నివసింప నారంభించి నాఁడు. శిష్యోత్తములగు పురాణ, నారాయణులతో నైనఁ బ్రసంగించుట కిష్టము లేక, పూర్ణాంతర్ముఖుఁ డైయున్న రాముని యందుఁ బ్రభుత్వమున కింకను అనుమానము పోలేదు. ఈయా శ్రమమందుండఁగా రామునికొక లేఖవచ్చినది. ఆలేఖలోఁ బ్రభుత్వరహస్యచారులు త న్ననుగమించుచున్నారని వ్రాయఁ బడినది. లేఖ చదివి రాముఁ డిట్లు పలికినాఁడు; "అధికారులతో రాముఁడు రక్షణ కోరఁడని తెల్పుఁడు. నన్ను వా రేవిధముగ వధము చేసికొన్ననుసరే! నన్ను మార్పువాఁ డీభువిలో లేఁడు. నేను భారతీయుఁడ నగుటచే నా దేశమునకు స్వాతంత్ర్యమును నే నభిలషించెదను. నా దేశము స్వేచ్ఛ నెపుడో యొకప్పుడు పొందితీరును. ఆస్వేచ్ఛ నీరాముఁడే ఆర్జింపఁగలఁడో, యిట్టి వేయిరాములు బయలుదేఱి గడింతురో యెవ్వరు నెఱుఁగరు."

1906 సంవత్సరములో మార్చి 27 వ తేదీని వశిష్ఠా శ్రమమునుండి రాయ్ సాహేబు వైద్యనాథగారి కీక్రిందివిధమున స్వామి వ్రాసియున్నాఁడు; "ఈయాశ్రమము మంచుదిబ్బలకుఁ బైనున్నది. వశిష్ఠగంగ యనునొక ప్రవాహము రాముని గుహా చేరువనుండి పాఱుచున్నది. ఇచట నైదాఱు జలపాతము లున్నవి......ఈప్రదేశము కేదారఖండములో వివరముగా వర్ణింపఁబడియున్నది. పట్టణములుకాని, బాటలుకాని, యా

యాశ్రమసమీపమున నేవైపునను లేవు. రాముని యానంద మెట్లున్న దని యడుగ నవసరము లేదు. రాముని యనంత ప్రశాంతియు నానందమును బుస్తకరూపమున వ్రాయఁబడు చున్నవి. శిష్యులనుగూడ దగ్గఱ నుండవలదని పంపివేసితిని. రాముని దర్శనమున కెవ్వరును రావలదు.

భగవద్దృష్టితోఁ జూచినచో విశ్వ మంతయు నానంద ప్రవాహముగా సౌందర్యలహరివలెఁ బొడకట్టును. దృష్టి లోని దోషము తొలఁగినచో విశ్వములోని లోపములును దొలఁగును. ప్రకృతిశక్తు లన్నియు, మన కర్మేంద్రియములుగా మాఱిపోవును. ఆత్మయే ఆనందస్వరూపము, సర్వస్వరూప మును. కాఁబట్టి, ఆత్మానుభవ మనఁగా నాలో నున్న దే పరమా త్మయని తెలిసి యనుభవించుటే. విశ్వమంతయు ఆత్మస్వరూప మే యగుటచే, విశ్వ మంతయుఁ బ్రేమామృతమయము. ఇఁక నే నెవరిని దూషింతును ? ఎవరిని విమర్శింతును ?

జయాపజయముల ధర్మమును వేదము లెంతయు క్రమముగ ఘోషించినవి ! ఏవ్యక్తియైన నీసృష్టిలోని యేవస్తువునైనను నిజ మని నమ్మనిండు ! ఆవస్తువు వెంటనే నమ్మినవ్యక్తిని విడిచి, మోసగించితీరును. అది తిరుగులేని సృష్టిధర్మము."

అరణ్యప్రసంగములు

ఏకాకియై రామతీర్థస్వామి విశేషకాలము హిమాలయ పర్వతములందును, గంగానదీతీరములందును, నివసించినాఁడు.

ప్రకృతిలీలలో నీశ్వరుని బరికించుచు, నిరంతరానందమయుఁడై యాతఁడు ప్రణవనాదములోఁ దన్మయుఁడై యుండునప్పుడు, ముముక్షువులు కొందఱాతని దర్శనమునకై వచ్చి జ్ఞానమును గోరుచుండువారు. అప్పు డాతఁడు, చంటిపిల్లలకైన బోధపడు రీతిని, నిగూఢాధ్యాత్మికతత్త్వములను, పిట్టకథలలోఁ గలిపి చెప్పుచుండువాఁడు. ఇవియే రామతీర్థస్వామిచేసిన అరణ్యప్రసంగములు. రామతీర్థస్వామి కసమానమగు కథాకల్పనాశక్తి గలదు; వేదాంత రహస్యములను జ్ఞానార్తుల కాతఁ డనంటిపండొలిచి చేతఁబెట్టినట్లు పంచిపెట్టువాఁడు. ఎవరు తన్నుఁజూచుట కరుదెంచినను నారాయణేతరప్రసంగము కాని, స్మరణముకాని చేయ నంగీకరించువాఁడు కాఁడు. సర్వావస్థలలో నుండుమానవులకుఁ దరణోపాయము నాతఁడు సూక్ష్మముగ రెండుమూఁడు మాటలలోఁ జూపువాఁడు. ఆతఁ డిట్లుచేసిన ప్రసంగములు పెక్కులున్నవి. అందుఁ గొన్నిటిని రుచిచూచి తరింతము.

గృహస్థజీవనము:— "కనుల కద్దములజోడు పెట్టుకొని మనము ప్రపంచములోని వస్తువుల నన్నిటిని దిలకింతుము. కాని, ఆ 'కండ్లజోడు' మనకు భార మనిపించదు. మనదృష్టి కడ్డువచ్చుటకుబదులు కంటిజోడులోని యద్దములు సాయపడును. భార్యకు భర్తకు నిట్టి సంబంధ ముండవలయును. ఒకరి జ్ఞానదృష్టి కొకరడ్డుతగులుటకు బదులు, పరస్పర సహకారులుగ నుండవలెను. ఇట్టి సంబంధము, వేదాంత విజ్ఞానము నెఱిఁగి దేహాభిమానములకుఁ గోరికలకు భోగములకు నతీత మగు

నాత్మైక్య కల్యాణమూలముననే లభింపఁగలదు. మఱేయితర సంబంధము లట్టిదృష్టి నొసఁగఁ జాలవు.

మన మూపిరి సప్రయత్నముగాఁ బీల్తుము. దానిని ప్రత్యేకప్రయత్నముతో గమనింపము. జ్ఞానముతోఁ గూడిన సంసారజీవన మట్లే యుండవలెను. భారము కనఁబడరాదు. ఒకరి కొకరు భారము కారాదు! భార్యాభర్త లొండొరులకుఁ బాశములై బంధించుకొనరాదు. ఇట్టి బంధము జ్ఞానసాధన కంతరాయము.

రామతీర్థునిభార్య యొకానొకప్పుడు భర్తను "నేను మీకు జ్ఞాపకముంటినా?" యని ప్రశ్నింప రాముఁ డిట్లు చెప్పినాఁడు; "లేదు. రామునికట్టి జ్ఞాపక మెన్నఁడునులేదు. నీకంటె నేను వేఱుగా నుంటి నని తలంచినపుడే, నిన్ను నేను జ్ఞాపక ముంచుకొనవలెను. నీకన్నులు, ముక్కు, చేతులు నీకు జ్ఞాపకమున్నవా? లేవు. అవియు నీవు నొకటే. నీకంటె నవి భిన్నములు కావు. అట్టియెడ జ్ఞాపకావసర మేమున్నది?

ఒక మిత్రునియొద్దనుండి మన కొకలేఖ వచ్చినచో మన మాలేఖ నెంతో ప్రేమింతుము. మిక్కిలిజాగరూకతతో దాచి కొందుము. అట్లే భార్యకు భర్త భగవంతుని యొద్దనుండి వచ్చినజాబు. భర్తకును భార్య అట్టిలేఖయే! భర్తయొక్క శరీరము, భార్యకు దేవుఁ డంపిన పటము. అందుచే శరీరము నుత్తరముగాఁ బ్రేమింపవలెను. ఉత్తరము మిత్రుఁడు కానట్లే, భర్తదేహమును భగవంతుఁడు కాదు. లేఖమూలమున మిత్రు నెట్లు తెలిసికొందుమో, భర్తరూపమునఁ బరమేశ్వరునిఁ దెలిసి

కొనవలెను. భర్తరూపము భార్యకుఁ బరమేశ్వర చిహ్నము కావలెను. రాత్రివేళ దేహైక్యము లభించినచోఁ బగటివేళ ఆత్మైక్యము సాధింపవలెను. ఎల్లవేళల, ఆత్మైక్యసాధనలోనే దేహములు మేళవింపవలెను. భార్య, భర్త కిచ్చు ప్రత్యాలింగనమందును బరమేశ్వరస్పర్శను గాంచవలెను. ఈవిధముగా భార్యయు, భర్తయు నొండొరులలో నీశ్వరదర్శనము చేయుచుఁ బోయినచో భవబంధము లన్నియుఁ దుత్తునియలై, మోక్ష సామ్రాజ్యము లభించును. ఇదియే దాంపత్యధర్మము.

గాయకశిఖామణి:— "ఒక దేవాలయములో నొక సుప్రసిద్ధమగు వీణెయున్నది. ఆలయాధికారి యెంతప్రతిభావంతుఁడచటి కరుదెంచినను, వీణెను ముట్టుకొననీయఁడు. ఒకానొకదినమున నాలయములోఁ బ్రార్థన జరుగుచున్నది. ఒక నూత్నపురుషుఁడు జీర్ణాంబరములతో నచటికి కరుదెంచి, వీణె నుపయోగింప ననుజ్ఞ యిమ్మని వేఁడెను. కాని, ఆలయాధికారి యందు కంగీకరింపలేదు. వచ్చిన నూతనపురుషుని సంగతి యధికారికిఁ దెలియదు. వీణె చాల విలువగలది. అందుచే నాతఁ డంగీకరింపకపోవుటలో నన్యాయ మేమున్నది? ప్రార్థన మయినది. ఆలయవైణికుఁడు పాట మాని వీణె విడిచి కదలినాఁడు. ఈ నూతన పురుషుఁడు, నెమ్మదిగ వీణెయొద్దఁ జేరి, దానిమీఁదఁ జేయివైచినాఁడు. అట్లీనూతన పురుషుని కరస్పర్శ కలుగుటతోడనే వీణెనుండి దివ్యగానామృతఝరీపరంరలు సభ్య సాగరమును ముంచెత్తినవి. వెడలిపోవ నుంకించిన సభ్యులు గాన మోహితులై, మూర్ఛితులై యచేతన విగ్రహములరీతిని

నిలువఁబడిరి. ఈ నూతనపురుషుఁడే వీణానిర్మాత యనియు, గాయకశిఖామణి యనియుఁ దెలియవచ్చినది.

మనలో నంతర్యామియై సాక్షిభూతుఁడై, సర్వప్రపంచ నిర్మాణములను జలనము లేక నడుపుచున్న పరమాత్మునికి, ప్రేమనిలయమునకు, మన శరీర మను వీణె నుపయోగించు నధికారమును మన మొసఁగుట లేదు. మన కృత్రిమప్రజ్ఞచే మన మనశ్శరీరముల మనమే నడుపుకొనవలెను, మనమే రక్షించు కొనవలె నను దురహంకారములో మనము పడియుండుటచే, మన నుండి బహిర్గతము లగు శబ్దములలో మాధుర్యముకాని సౌందర్యముకాని లేక లోపించుచున్నది. సర్వేంద్రియ సర్వస్వ రూపనాథుఁడు, విశ్వగాయకాగ్రేసరుఁడగు పరమాత్మునికి,మన మనశ్శరీరాత్మలను సంపూర్ణానందముతో నర్పణ మొనర్చినచో నాప్రేమసుధానిధి హస్తస్పర్శ తగిలినంతనే దివ్య ప్రణవగాన మాధురీలహరి, వియద్గంగాస్రోతస్సువలెఁ బ్రవహించి సచ్చి దానంద సామ్రాజ్యమును విశ్వములలో స్థాపింపఁజేయును."

సంఘసంస్కర్త:—చాల కాలముక్రిందట నొక మహా భక్తుఁ డుండెడివాఁడు. అట్టి పరమభాగవతశ్రేష్ఠునిఁ జూడవలె నని, స్వర్గలోకమునుండి బయలుదేఱి దేవతలు భూలోకమున కరుదెంచినారు. నక్షత్రములు, కాంతిని విరజిమ్మునట్లు, పుష్ప ములు సౌరభమును వెదచల్లురీతి, నాభక్తుఁడు, తన యనుదిన జీవితములో ధర్మజ్యోతిని వెలిఁగించుచు వర్తించువాఁడు. రెండు మాటలలో నాయనజీవితవర్తనమును క్లుప్తముగాఁ జెప్పవచ్చు ను. ఆతఁ "డిచ్చును; క్షమించును." కాని, యీమాట లాతని

నోటినుండి యెన్నఁడును వెలువడి యుండలేదు. అతని చిఱు నగవులోఁ, బ్రేమలో, నోర్పులో, దానములో నీవాక్యార్థ ములు గర్భితములై యుండును.

దేవతలు పరమేశ్వరునితో నిట్లనిరి; "భగవానుఁడా! ఈభక్తునికి దేవతలకైన సాధ్యముకాని చిత్రచర్యలను చేయఁ గల శక్తినొసఁగుము." "అట్లే కానిండు. ఆతని కేమికావల యునో యడిగి రం"డని దేవుఁడు దేవతల నంపెను.

దేవతలు భక్తుని కిట్లనిరి; "నీహస్తస్పర్శచే రోగులకు రోగములు కుదుర్చుశక్తి నీవు కోరెదవా?" "నాకు వలదు. ఆపని దేవుఁడే చేయుట నాకిష్ట"మని భక్తుఁడు బదులుచెప్పెను. "పాపాత్ములను; సంశయవ్యాకులచిత్తులను, నీమతములోఁగలు పుకొనుశక్తిని నీవు కోరెదవా?" యని మఱల దేవతలు ప్రశ్నించిరి. "అదియును నాకు వలదు. అది దేవతలకర్తవ్యము. నేను ప్రజలకు మత మొసఁగఁజాల"నని భక్తుఁడు ప్రత్యుత్తర మొసఁగెను.

"ప్రజల నాకర్షించు సద్గుణరాజములు నీకొసఁగి, తన్మూల మున నీశ్వరసేవచేయుట కవకాశము కల్పింపుమందువా?" యని మఱల దేవతలు ప్రశ్నించిరి, "ప్రజలు నాచే నాకర్షింపఁ బడినచో, వారు భగవంతుని మఱచిపోవుదురు. ఈశ్వరమహిమ తనంతటఁదానే వ్యాప్తి పొందఁగలదు. కావున, నాకేమియు వల"దని భక్తునిజవాబు. నీ కేమికావలయునో తెల్పు"మని యింకొకతూరి దేవత లడుగ, "నే నేమికోరఁగల"నని చిఱు నవ్వు నవ్వెను. అంతట దేవతలు విసుగు చెంది, "నీ వేదో

రొకవిచిత్రశక్తి నడుగవలయును, లేకున్న నేదోయొకటి నీపైఁ బడితీరు' నని బెదరించిరి. తుదకు భక్తుఁడును విసుగుపొంది, "నేను లోకహితమే నిరంతరము చేయుచుండవలయును. అట్లు చేయుచున్న సంగతి నాకుఁ దెలియకుండవలయును. అట్టి వర మొసఁగుఁ"డని దేవతలను గోరెను.

ఈవరసందర్భము దేవతల కర్థము కాలేదు. ఏమిచేయుటకును దోఁచక, దేవతలందఱుఁగూడి యొకపద్ధతిఁ దలపెట్టిరి. భక్తుఁడు నడచునప్పు డాతనినీడ, వెనుకఁగాని, ప్రక్కలఁగాని పడును. ఆనీడ నాతఁడు చూడఁడు. నీడపడినవా రందఱకు, రోగములు పోయి దుఃఖములు నశించి, యానందము కలుగుఁగాక యని దేవతలు వర మొసఁగి వెడలిపోయిరి.

అట్లే జరిగినది. భక్తునినీడ పడినయిసుకతిన్నెలు పచ్చికబయళ్లుగను, యెండి మొఱడువాఱిన మొదళ్లు నవ్యపల్లవపుష్పభరితములుగను, ఇంకిపోయినవాహినులు శుద్ధోదకప్రవాహములుగను, నీరసించిన బాలురముఖములు పూర్ణ చంద్రవిలాసరేఖాలంకృతములుగను మాఱినవి. కాని, యాభక్తుఁడు జరుగుచున్న మహోపకారములకుఁ దన యహంకారమును దగిలించుకొనక యే జీవయాత్ర సల్పినాఁడు.

"నీవు సత్యమును నిశ్చలచిత్తములో నారాధించుటకు మొదలిడిననాఁడు, ధనము ధనమదాంధీభూతుల నాశ్రయించు మాధ్యము నీదృష్టియెదుటఁ బడక, మటుమాయమగును. సత్యస్వరూపుఁడనే నేనని నీయనుభవపూర్వకముగా గర్జింపఁగల్గిన యెడల, దూషణాస్త్రములు నీయంతరంగమును దాఁకఁజాలవు;

వ్యాఘ్రములు నిన్ను సమీపింపఁజాలవు; కత్తులు నిన్నుఁదాఁకి మొఱడుపాఱి ముక్కలయిపోవును; తుపాకిగుండ్లు, నీ దివ్య తేజము నెదుర్కొనఁజాలక నుసియైపోవును.

సత్యస్వరూపి యగు భగవంతునియం దచంచల విశ్వాసము కలిగి యాత్రచేయుము. ఈ విశ్వాసముతో బ్రతుకుట, మృత్యువెదుర్కొనిన నీవిశ్వాసముతోడనే ప్రాణపరిత్యాగము చేయుట, నివియే ధర్మములు. సత్యాకాశమున నీ వొంటరివై విహరింపవలసివచ్చినను, ధర్మజ్యోతియగు సూర్యుఁడే నీమిత్రుఁడై నిలచును. నలుదెసలనుండి నీ సత్యవాణిని విని తరించుటకు, లక్షలకొలఁది నీచుట్టును మూగుదురు. నీవు వేయి సంఘములను స్థాపింప నవసరములేదు. అన్నిసంఘములు నిన్నే యారాధించును. సత్యరక్షణము మానవమాత్రులపై నాధారపడియుండలేదు. సూర్యరశ్మిని బ్రకటించుటకు, వార్తావహులుకావలెనా? సత్యము స్వయంప్రకాశమైనది, దానికి స్వయంనిర్ణయపోషణ శక్తి కలదు."

నీయాంతరంగికజీవితములో సత్యమును నీవు విశ్వసించి, యారాధించుచుండినచో, విశ్వమంతయు ని న్నర్చించి తీరును. సత్యారాధకుని సర్వసంగత్యాగమే పావనతమ మగుమార్గము. వ్యక్తులను, రూపములను, బిరుదములను, ధనమును, పాండిత్యమును, వీని నారాధించుట, విగ్రహారాధనయే.

"సత్యమే ఉత్తమమైనది. సత్యారాధనమే ఉత్తమోత్తమ మైనకర్మయోగము. సత్యారాధకునికి లభించుబల మనివార్యము, సత్యప్రియుని స్వాతంత్ర్యము వరించును; సత్యశీలుని

యెదుట, బాహ్యప్రభుశాసనములు వంగి సలాములుపెట్టును. ఇదియే కీర్తిప్రదము. బలహీనతకంటె వేఱుచావులేదు. ప్రకృతి గ్రంథములో భగవంతుఁడు స్వహస్తములతో నిట్లు వ్రాసి నాఁడు: 'బలహీనతకన్న వేఱుపాపము లోకమున లేదు. బల హీనత్వమునకుఁ దల్లి యజ్ఞానము.'

జాతియను వృక్షముయొక్క వేళ్ళు స్త్రీలు, బాలురు, శూద్రులు. ఈముగ్వురపోషణము, భారతదేశమున విడిచిపెట్టఁ బడినది. అగ్రజాతు లనువారు వృక్షముయొక్క ఫలములు మాత్రమే. కాని, వృక్షాగ్రమున ఫలములఁ జూచి మురిసి పోయిన లాభములేదు. చెట్టు బ్రతుకవలెనన్నచో, దాని వేళ్ళకు నీరు సరిగా లభించుచున్నదో లేదో చూడవలెను."

"ప్రియులగు సంస్కర్తలారా! ధనికుల యభిరుచి కను గుణముగా నుపన్యసించుటవలన, మీవ్యక్తిత్వమునకుఁ గొంత తాత్కాలికగౌరవము లభింపవచ్చును. కాని, సత్యము దరిద్రు లగు స్త్రీ బాల శూద్రులందే ప్రతిఫలించి, వారిమూలముననే వృద్ధిపొందఁగలదు. చరిత్ర యిట్లే చెప్పుచున్నది. కొందఱు వక్తలు, తా ముపన్యసించునపు డుద్యోగస్థులు సభ కరుదెంచి నచోఁ దాము ధన్యులైనట్లు సంతసింతురు. కాని, తమవ్యక్తిత్వ ము నమ్ముకొనిన యీదాసులు వచ్చి యుపన్యాసగీతములు వినిన వినవచ్చును కాని, జాతివృక్షము వీరివలనఁ బెంపొందఁ జాలదు."

నిర్యాణము

పుట్టినవాని కెవ్వనికిని జావు తప్పదు. జన్మించి, జన్మార్థ రహస్యము నెఱిఁగి జీవించిన పుణ్యపురుషుని జీవితకాల మొక క్షణమాత్రమైనను, అది యాచంద్రార్క నిత్యము. ఏప్రాణి సర్వప్రాణనాథుని నిత్యజీవయాత్రలో నిరంతరము నిరీక్షించి, జననమరణగ్రంథుల నూడఁబెఱికి, ఊడఁబెఱుకు మార్గములఁ దోడిజీవరాశికి బోధించునో, ఆప్రాణిచరిత్ర సర్వప్రాణికోటికిని, దేవతలు స్వహస్తములతో వండి వడ్డించు పాయసామృతము వలె రుచించి, బ్రహ్మానందపుఁ ద్రేఁపుల నుద్భవింపఁజేయును.

ఒకవ్యక్తియొక్కశతాబ్దములోఁ జీవింప నగును. కోటి కొక్కవ్యక్తి రెండవ శతాబ్దములోఁ గాలుపెట్టవచ్చును. కాని, అన్నిశతాబ్దములలో జీవింపఁగల వ్యక్తులును లేకపోలేదు. మనుష్యులు పోయినను మాటలు పోవు; మాటలకు, మనుజులకు, లోకములకు మూలశక్తియగు పరమాత్ము నాత్మజ్యోతిగా, సర్వాత్మనాథునిఁగా నెఱిఁగి, ప్రసంగించుమాటలు శాశ్వతములై, సుస్థిరములై, గతించినవ్యక్తి జీవితము ననంతముగాఁ బొడిగించును. మహాభక్తాగ్రేసరులయు, జ్ఞానచక్రవర్తులయుఁ, దత్త్వవేత్తలయుఁ, గవిశేఖరులయు జీవితము లట్టివే. ఎన్నిశతాబ్దము లెన్నియుగములు గడచినను, బ్రహ్మర్షి వర్యుల యుపనిషద్వాక్యములు చెవిసోఁకినంతనే, యజ్ఞాననిద్రాముద్రితమగు జీవి, ఉదయభానుచైతన్యసమ్మిళిత మందమలయానిలములు వీచు నంతనే మేల్కాను ప్రాణికోటివలె, నులికిపడి ప్రేమోత్సాహ

ములతో మేలొ్కనును. అట్లు మేలొ్కల్పఁగల వాక్యములు పలుకు శక్తి బ్రహ్మానందముఁ జవిచూచిన వ్యక్తికిఁగానిలభింపదు.

రామతీర్థస్వామి నిరంతరము నీశ్వరపాదారవిందముల ననితరభక్తిభావముతో నారాధించి తరించిన భక్తాగ్రేసరుఁడు; సృష్టిరహస్యతత్త్వమును సునిశితధిషణాస్త్ర ప్రయోగముచేఁ గొట్టి, అరచేతఁ బెట్టుకొని యాటలాడిన జ్ఞానశిఖామణి; ప్రకృతి కాంతరహస్యమందిరశయ్యా విలాససీమల నవయౌవనవైభవ స్ఫురణలతోఁ దిసగాడి కోకిలయై మత్తిలి, దివ్యగీతాలహరి నాలపించి యం దోడలు మఱచి, కొట్టుకొనిపోయిన పరమేశ్వ రాస్థానకవిశేఖరుఁడు; అమోఘత్యాగానలము రగుల్కొల్పి పరమేశ్వరుని బెదరించి, యాతని నాపదవినుండి తొలఁగించి, తానే పరమాత్మస్థానము నాక్రమించి, తానే సర్వమునని నమ్మి నమ్మటతో నూఱకొనక, అట్లే జీవితాచరణ మొనర్చి సాధించిన "అహం బ్రహ్మాస్మి" వేదాంతకేసరి.

రామతీర్థస్వామి కిప్పటికి ముప్పదిరెండేండ్లుమాత్రమే నిండినవి. తన బాహ్యశరీరమును ద్యజించు సమయ మాసన్నమైన దనుసంగతి శిష్యోత్తములగు నారాయణస్వామికి, పురాణ సింగునకైనను దెలియకున్నను, రామతీర్థస్వామికి సుస్పష్టముగాఁ దెలియును. చిన్ననాటినుండియు నాతఁడు "గంగామాత"యని యాతఁ డెన్నిసారులు ప్రేమామృతము తొల్కఁబల్కినాఁడో గంగామృతమునుగూర్చి యాతఁడెన్ని గీతముల రచించినాఁడో లెక్కలేదు. ఒక సంవత్సరములోఁ దా నీకఁ దనుత్యాగ మొనర్పవలె నని యెఱిఁగియుండియే, గంగాతీరమున నున్న వశిష్ఠా

శ్రమములో నివాస మేర్పఱచుకొని, యిఁక నాతీరము విడువ నని చెప్పివేసెను. అట్లే గంగాతీరము నాతఁడు విడువలేదు.

స్వామి ప్రియ శిష్యురాలైన 'వెల్మాన్'సతి భారతదేశ యాత్ర ముగించుకొని, అమెరికాకుఁ దిరిగి వెడలిపోవుచు, వ్యాసాశ్రమ మందున్న స్వామిదర్శనము చేసికొని మఱియుఁ బోవలె నని బయలుదేఱి వచ్చినది. స్వామి గంగానది కావలి యొడ్డున నున్న వ్యాసాశ్రమమునం దున్నాఁడు. వెల్మాన్ సతీమణి, స్వామిని గలిసికొనుటకు గంగను దాఁటి పోవలెను. అచట నావలుకాని, తెప్పలుకాని యేమియు లేవు. అది గమనించి స్వామి శిష్యురాలియందలి ప్రేమతోఁ దానే గంగానదినీఁది, యామెయొద్ద కరుదెంచినాఁడు. అది సూర్యుఁడస్తమించు వేళ. అస్తమానభానురక్తిమ, గంగోదకనైల్యముతో మేళవించి, చిత్రవిచిత్రచ్ఛాయల నీనుచున్నది. రామతీర్థస్వామి కట్టిన కాషాయవస్త్రముల రంగును, పశ్చిమాద్రి రంగును, కలిసిపోయినవి. అస్తమించుచున్న లోకబాంధవుని వైపు, లోకబాంధవుఁ డగు రామతీర్థస్వామి, తనదృష్టి నేకాగ్రచిత్తముతోఁ బ్రసరింపఁజేసి, వెల్మాన్సతితో నిట్లనెను. "సూర్యానందా! (వెల్మాన్సతిపేరు) వెళ్ళి రమ్ము! ఇటు చూడుము. ఇదిగో సూర్యుఁడస్తమించుచున్నాఁడు. అతఁడే యీరాముఁడుం బ్రహ్మజ్ఞానానందనిలయ మగు నీ భారతభూమిని మఱచిపోక, నీ వెచటి కేఁగినను నీహృదయమున నుంచుకొనుము." వెల్మాన్ సతి వెంటనే తనలోఁ దా నిట్లనుకొనెను. "ఇఁక భారతవర్షము

రామునిఁ గోల్పోయినట్లే! ఇఁక నీతఁడు వనవాసము నుండి తిరిగి రాఁడు. ఇఁక రాముఁడు మఱలఁ గన్పడఁడు."

స్వామి వశిష్ఠాశ్రమములో నుండఁగనే, అనఁగా నికఁ గొన్ని నెలలలో రాముఁడు నిర్యాణము పొందుటకు ముందు, శిష్యుఁ డగు పురాణసింగు కొన్నిగ్రంథములు రామునికొఱకుఁ దెచ్చెను. రాముఁడు సాధారణముగా నూతనగ్రంథము లెన్ని దొరికినను విడువకుండఁ జదువు నలవాటుకలవాఁడు. కాని, శిష్యుఁడు తెచ్చినపుస్తకము లొకమూలఁ బడవైచి, వాని సంగతినే మఱచినాఁడు. పురాణసింగు, "పుస్తకములు చదివె దరా?" యని యడిగెను. పుస్తకము చేతఁబట్టి, కన్నీరు వఱదలై పారుచుండ, రాముఁడు ప్రశాంత మావరించిన ముఖలక్ష్మి వెల్లివిరియ నిట్లనెను. రాముఁ డిఁక నేగ్రంథమును చదువఁజాలఁడు!" ఈసమాధానము నర్థముచేసికొనిన రాముని మనోగతాభిప్రాయము తెలియఁగలదు.

రామతీర్థస్వామి నిర్యాణకాలమున కొకయేఁడు ముందు నుండియు, నిత్యసమాధిచిత్తుఁడై దేహస్మృతి మఱచియుండు వాఁడు. అదివఱ కాతనిలోనుండి బయల్వెడలిన శక్తు లన్నియు నంతర్ముఖము పట్టినవి. బాహ్యప్రకృతిసౌందర్యమునుగాంచి తన్మయుఁ డగుచుండు నాతఁడు హృదయాంతర్వర్తి యగు పరమాత్మయందే విశ్వసౌందర్యమును వీక్షించుట కారంభించెను. అందుచే నాతఁడు బాహ్యచేష్టలు తక్కి, అంతర్ముఖుఁడై ఆత్మరతిచే నానందము పొందువాఁడు. అరణ్యవీథులలో బాలుని రీతిఁ బరుగులిడినయాతఁడు, ఒకచోట స్థిరముగా గూర్చుండి

చిదాకాశవీథులలో విహరింప నారంభించినాఁడు. పత్రికలకు నుపన్యాసములకు నిరంతరము వ్రాఁతలువ్రాయుచుండు నాతఁడు, లేఖనీసన్న్యాసియైనాఁడు. మిత్రులు వచ్చినంతనే అధికోత్సాహ ప్రసంగము లొనర్చుటకుబదులు, మౌనముద్ర ధరించినాఁడు. కటివస్త్రము ధరించుట, స్నానమాడుట మున్నగు స్వల్పవిషయములుకూడ నాతఁడు మఱచిపోయినాఁడు. పురాణసింగు వసిష్ఠాశ్రమమునకు వచ్చి, సెలవుపుచ్చుకొని వెడలిపోవుదినమునఁ దన్ను స్నానముచేయింపు మని కోరినాఁడు. హిమాలయమునఁ బుట్టిననదు లన్నియు 'జన్మహక్కు'గా నెంచి బాలునివలె నెన్నియోసారు లీఁదినయాతఁడు, స్నానముచేయింపు మనుట బలహీనతచేఁ గాదు; అతనికి దేహస్మృతి లేదు. అంతఁ బురాణసింగు, స్వామినిదోడ్కొని నదీతీరమున కరుదెంచినాఁడు. స్వామి నడచివచ్చినాఁడుకాని చేతులు కదపఁడే! నీటిలో దిగఁడే! ఆతని మానసము శరీరములో లేదు. పరమేశ్వర పాదారవిందములకు హత్తుకొనిపోయినది. శరీరావసరముల కాతఁడు, పరమేశ్వరున కిదివఱకే పూర్ణార్పణ మొనర్చిన మానసమును దిరిగి తీసికొనిరాఁజాలకపోయినాఁడు. పురాణసింగే ఆతని కటివస్త్రమును స్వహస్తములతో విప్పి, యాతనిని దిగంబరు నొనర్చినాఁడు. స్వహస్తములతోడనే పురాణసింగాతనిఁ జేయిపట్టుకొని, నీటిలో ముంచి స్నానముచేయించినాఁడు. స్నానానంతరము మఱల నాతని నాశ్రమకుటీరమునకుఁ జేర్చినాఁడు. ఇఁకఁ బోవలెనని పురాణసింగు సెలవుకోరినాఁడు. అప్పుడు స్మృతితెచ్చుకొని, స్వామి యిట్లు పల్కినాఁడు:

10

'పురాణాజీ! నీ వెచ్చటికిఁ బోయినను ఆత్మజ్యోతి యొసంగెడు వెలుతురులోనే జీవింపుము. రాముఁ డారంభించిన కార్యమును నీశక్తివంచన లేకుండఁ గొనసాగింపుము. రాముని కిఁకఁ గాల మాసన్నమైనది. ఇఁక రాముఁడు మౌనవ్రతమును స్వీకరించుచున్నాఁడు!'' అంతఁ బురాణసింగు నవ్వుచు నిట్లు బదులు చెప్పినాఁడు; "స్వామిజీ! నేను మఱల వచ్చినపుడు నిన్ను హేళనచేసి నవ్వించి, మాటలాడించి నీవ్రతభంగ మొనర్చెదను సుమీ!" దానికి రాముఁ డుగ్రుఁడై క్రోధారుణితలోచనములతో "మౌనిని మాటాడింప సమర్థుఁడెవఁ"డని గర్జించినాఁడు. ఆమాటలకు "నేను భయకంపితుఁడనై, నోరు మెదపఁజాలకపోయితి" నని పురాణసింగు వ్రాసినాఁడు. నారాయణస్వామికిని వైసందేశమునే యిచ్చి పంపివేసినాఁడు. వా రిరువురకు నదియే స్వామి యొక్క యంత్యసందర్శనము. అవియే స్వామి నోటినుండి వెడలిన తుదిమాటలు!

అది అక్టోబరు 18 వ తేదీ 1906 వ సంవత్సరము. ఆనాఁడు రామతీర్థస్వామి విశ్వేశ్వరపాదారవిందములకై యాత్ర చేయసంసిద్ధుఁడైన పవిత్రదినము. ఆతని సాన్నిధ్యమున నొక్క మానవమాత్రుఁడును లేఁడు. శిష్యులను దనచెంత నుండవలదని యాతఁడు పంపివేసినాఁడు. కృత్రిమప్రపంచఘోషకు దూరమై పరమేశ్వరుఁడు ప్రత్యక్షముగ విహరించు దివ్యస్థానమునకు బహుసమీప మగు గంగాతీరమునఁ బవిత్ర వశిష్ఠాశ్రమమున రామతీర్థస్వామి ఏకాకి యయ్యు, విశ్వప్రాణికోటిని నిజహృదంతరపీఠమున నిత్యము స్వప్రకాశ తేజోరాశియై వెల్గొందుచున్న

సర్వేశ్వరు నందే తిలకించుచు, తాపత్రయాతీతుఁడై, ధ్యాన మగ్నుఁడై యున్నాఁడు.

"అణోరణీయాన్మహతో మహీయా నాత్మాస్యజంతో
ర్నిహితో గుహాయామ్,
తమక్రతుః పశ్యతి వీతశోకో, ధాతుఃప్రసాదాన్మహిమాన
మాత్మనః॥

"పరమాత్మ సూక్ష్మములకంటె సూక్ష్మమై, మహత్తుల కంటె మహత్తరమైనదై, సమస్త జంతుహృదయాకాశములలో నివసించుచున్నది. ఎవఁడు కోరికలులేనివాఁడై ఇంద్రియమాన సములను వశముచేసికొని, సమస్తభూతాంతరాత్ముఁడగు నప్పర మాత్మప్రకాశమును దర్శించునో, ఆతఁడు దుఃఖమునుండి దొలఁగినవాఁ డగును."

రామతీర్థస్వామి కోరికలను భస్మమొనర్చి పెక్కేండ్లయి నది; సర్వేంద్రియనిగ్రహము నాతఁడు సమగ్రముగ సాధించి నాఁడు. సర్వప్రాణికోటిలో గర్భితమైయున్న పరమాత్మను నిత్యదర్శన మాతఁడు చేసినాఁడు. ఉపనిషద్వాక్యార్థ మాతని జీవితములో మూర్తీభవించినది. ఇఁక నాతనిదరి చేరఁ గల శోకము, దుఃఖము నెచట నున్నవి ?

మరణ మన్నచోఁ బ్రతిప్రాణికిని భయమే. లౌకిక ప్రపంచములో మన మెన్నియెన్ని ఘనకార్యములు సల్పినను, చావు సిద్ధమగు నని తోఁచిన, మనము తలక్రిందై పలవింతము. మరణసమస్య మనకు మరణసమీపకాలమందే గోచరించును. అంతవఱకు మనము చావులేనివారమే యని తలఁచి, దేహాభి

మానముతో వచింపరాని కృత్రిమములకు హస్తములు సాచి యాహ్వానింతుము. కాని, పుట్టినదాది, మరణమునకు నిర్విచారముగా మూటకట్టుకొని కూర్చుండు ధీరత్వ మార్జింప యత్నించు పురుషుఁడే మహాత్ముఁడు, ధన్యుఁడు. అట్టి ప్రయత్నము చేసిన యోధులలో రామతీర్థస్వామి యగ్రేసరుఁడు. పోవునది శరీరము. శరీరము 'నే'నని తలఁచువానికే మరణము. నేనాత్మస్వరూపుఁడ నని జీవితాచరణ సల్పువానికిఁ జావులేదు. రామతీర్థస్వామి తనకు శరీర మున్నదని విశ్వసింపలేదు. సన్న్యాసాశ్రమస్వీకారముతోడనే ఆతఁడు శరీరపరిత్యాగము చేసి యున్నాఁడు. నేఁడు వశిష్ఠాశ్రమమందు దేహస్మృతిని బూర్తిగ విడిచిపెట్టినాఁడు. అట్టి పుణ్యపురుషునికి మరణకాలము తెలియుటలో నాశ్చర్యము లేదు. 1906 అక్టోబరు 18 వ తేదీని ఉత్తర హిందూస్థానములో దీపావళీ మహోత్సవదినము. ఆనాఁడుదయముననే రామతీర్థస్వామి గంగాస్నానము చేయవలెనని కోరినాఁడు. స్నానమునకుఁ బోవుటకు ముందు ఒకచిన్నకాగితముపై నిట్లు మృత్యుదేవత నాహ్వానించుచు వ్రాసి బల్లపైఁ బెట్టినాఁడు.

"ఓ మృత్యుదేవతా ! నీవు కోరినచో నిదిగో ! నాశరీరమును దీసికొనిపొమ్ము. అది నాకు తృణసమానము. నేను తలఁచుచో నుపయోగించుకొనుటకు నాకు వేలకొలఁదిశరీరము లున్నవి. జ్యోతిర్మయమాత్రము లగు చంద్రకిరణములనుధరించి నేను చరింపఁగలను. నేనొక దేవకన్యకనై పర్వతఝరీస్వరూపములఁ దాల్చి, విహరింపఁగలను. సాగరోత్తుంగతరంగముల

నేకీ నృత్యమాడెదను ! దివ్యవనాంతపుష్పసౌరభమును గడు పారఁగ్రోలి, రాజాధిరాజమర్యాదతో మందమందగమనముల నొనర్చు మలయానిలవాతపోతమును నేనే! ఈరూపములన్నియు, నిరంతరము మార్పుచెందు నారూపములే ! కైలాసశిఖరాగ్రమునుండి మానవ నివాసభూములకు నే నరుదెంచి, మృత్యుగ్రస్తుల కమర్త్యత్వ మొసఁగి, నిద్రాముద్రితులకు చైతన్యదాన మొనర్చి మేల్కొనియున్నవారికి విమలానంద మొసఁగి, దుఃఖార్తులముఖములఁ బంకిల మొనర్చిన యశ్రుజలమును దుడిచివైచినాను ! అన్నిటిని నేను స్పృశించినాను ! అన్నిప్రదేశములలో నేనే తిరుగాడుదును ! నన్నెవరును గనుఁగొనఁజాలరు !”

విశ్వరంగములోని జ్ఞానచక్రవర్తుల చరిత్ర వ్రాయఁబడినచో నందలి తొలిపుటలోఁ బైవాక్యములు, సువర్ణాక్షరములతో శాశ్వతముగా లిఖింపఁబడి తీరవలెను. పైవిధమునవ్రాసి, రామతీర్థస్వామి, గంగానది సమీపించెను. భారతవర్షపుత్రరత్నమును మహోత్తుంగపవిత్ర తరంగహస్తములను సాచి, గంగాజనని యాహ్వానించినది. ఆతఁడు మొలలోఁతు నీటిలో దిగి, వ్రేళ్ళతో నాసారంధ్రములను బిగించి, ఒకమునక వేసినాఁడు. స్నానముచేఁ బావనుఁడైన యామహావీరుని, యోగిచక్రవర్తిని త్యాగధనుని, మహాప్రవక్తను, గంగామాత వెంటనే గౌరవించి లోపలికిఁ దీసికొనిపోయి, తనగర్భమునఁ బెట్టుకొన్నది. కొన్ని నిమేషములవఱకును “ఓం” కారోచ్చారణము భూనభోంతరాళము లదరిపడినట్లు వినఁబడినది. తిరిగి రాముఁడు బయటికి రాలేదు. స్థలముచేఁ గాలముచేఁ గట్టఁబడిన యెముకలప్రోవును

విడిచిపెట్టి, రాముఁడు సర్వచరాచర భూతాంతరాత్ముఁ డగు పరమాత్మునిలోఁ బ్రణవనాద ముచ్చరించుచు లీనమైపోయి నాఁడు."

"నిత్యో౽నిత్యానాం చేతనశ్చేతనానాం ఏకో బహూనాం
యోవిదధాతికామాన్,
తమాత్మస్థం యేను పశ్యంతి ధీరా స్తేషాం శాంతి
శ్శాశ్వతీ నేతరేషాం॥"

"అనిత్యపదార్థములలో నిత్యమైనది, చేతనములలోఁ జేతనమైనది, ఏకమైనదియు నగు పరమాత్మ, అనేకులకు వాంఛితముల సమకూర్చుచుండును. ఏధీరు లట్టిపరమాత్మను దమ హృదయాబ్జపీఠములపైఁ దిలకింతురో వారికే శాశ్వతశాంతి లభించును. తదన్యులకు లభింపదు."

"యదా సర్వే ప్రముచ్యంతే కామా యే౽స్యహృది శ్రితాః
అథమర్త్యో అమృతోభవ త్యత్రబ్రహ్మ సమాప్నుతే॥"

"ఎవనియొక్క హృదయము నాశ్రయించినఁ గామము లన్నియుఁ దొలఁగిపోవునో, అట్టిమర్త్యుఁడు వెంటనే మరణాతీతుఁడై, యిచ్చటనే పరబ్రహ్మము నందును."

మన రామతీర్థస్వామి, మరణ మాసన్నమైన దని పూర్తిగా నెఱిఁగి, సర్వకామములను సంపూర్ణత్యాగ మొనర్చి, శాంత్యానంద సమృద్ధమగు పరబ్రహ్మసాయుజ్యము నందినాఁడు.
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

పూ ల రే క లు

రామతీర్థస్వామిబుద్ధి యొక విచిత్రపుష్పమువంటిది. ఆపుష్పములోని రేకులు గణనాతీతములు. అందలిమకరందము బ్రహ్మానందము. అందలి సౌరభము, అమర్త్యత్వము. ఆ పుష్పము, ఆరేకులు నెన్నఁడును వాడిపోనివి! ప్రతిపత్త్రమును, అఖండానందరసముతో, ననంతసౌరభముతోఁ గల్పింపఁబడి నదే! పరమేశ్వరునకు స్వకీయజీవితార్పణ మొనర్ప బయలు దేఱు భక్తపుంగవు లీపూలరేకుల నలంకరించుకొని పొందు!

"నా శత్రువులను నేను సమర్థించుట కారంభించి చూడఁగా నొక్క-శత్రువును గనఁబడఁడే!"

"సామాన్యమానవులకు సూర్యరశ్మి చేయుపని వేఱు. వారి పొలములు పండును. విత్తులు మొలచును. కాని ధన్య పురుషుని హృదయభూమిలో జ్ఞానసూర్యరశ్మి ప్రకాశించి, అనేక జన్మాంతరవాసనా బీజములను సమూల నాశన మొన ర్చును."

"నీ శిరస్సును. నీ వెంతయెత్తునకైన నెత్తుము! కాని, నీ పాదములను భూతలముననే యుంచునట్లు చూచుకొనుము. బలహీనులు, అజ్ఞానులు నగువారి కుత్తుకలమీఁదఁగాని, భుజ ములమీఁదఁ గాని, పడనీకుము!"

"రూపసౌందర్యమును జూచి ప్రేమించు ప్రేమ ప్రేమ గాదు. అట్టిప్రేమ రూపాంతర్వర్తియై యున్న సౌందర్యనిధి యగు పరమాత్మునికి ఘోరదూషణ మగును!"

"జంతువృక్షమనుష్యాది సమస్తరూపములతోఁ జేయఁబడిన గాజుసీసాలు నాబల్లపై నున్నవి. కాని, ఎన్నిటిలో నీరు పోసినను నీరు నీరే!"

"ఆత్మహత్య జీవితసమస్యను బరిష్కరింపఁజాలదు. తాను బరిష్కరింపఁజాలని గణితసమస్యను విద్యార్థి, పలకమీఁద లేకుండఁ జెఱిపివైచినచో సమస్యాపరిష్కార మగునా?"

"నీయర్థములను దొంగిలించువాఁడు దొంగ; కాని,నీయర్థమందలి స్వార్థాభిమానమును దొంగిలించు నాతఁడుగురువు."

"మతరంగాధిపత్యము వహింపఁదలఁచు నాయకుఁడు, సమస్తమానవకోటియందును సమదర్శిత్వ మొసఁగు నాహారముపై జీవింపవలెను. తదితరాహారము లన్నియు మద్యపానములై శిరఃకంపము కలుగఁజేయును."

"నీహస్తము నీయం దొకభాగ మెట్లో, నీవును భగవంతునం దొకభాగ మని కొందఱు చెప్పుదురు. కాని, నీహస్తము నీయందొక భాగముకాదు. హస్తమును నఱకివైచినను, నీ యేకత్వమునకు లోపమురాదు."

"ప్రాణప్రదమైన విషయము పరమేశ్వర సందర్శనలాలసత్వము. న్యూయార్కుపట్టణములోని వ్యావహారిక ఘోరకర్మరంగమధ్యమున నీకాదృష్టిలభించినచో మంచిదే! హిమాలయ గుహాంతరాళములలో నీకట్టి లాలసత్వ ముదయించినను సరే! ఈలాలసత్వ మెచ్చట లభించినను ఫలిత మొకటే. స్థలము, రూపము, పద్ధతి వీనిలోని భేదము లప్రధానములు."

"శైవులు శివుని, వైష్ణవులు విష్ణుమూర్తిని, క్రైస్తవులు క్రీస్తును, మహమ్మదీయులు మహమ్మదును, అర్చించుదురు. బ్రాహ్మణస్వరూపముగాఁ, జండాలస్వరూపముగా, మహమ్మదీయ స్వరూపముగా, ఆర్యసామాజికునిస్వరూపముగా, బ్రాహ్మసమాజస్థునిస్వరూపముగా, శిక్కు మతస్థుని స్వరూపముగా, జాతిలోని ప్రతివ్యక్తిస్వరూపముగా భారతవర్షమును నే నర్చించెదను. మన హృదయములు కలిసినచో హస్తము లేకీభవించి తీరును."

"సంఘనిర్మాణమువలన, జాతీయాంతర్జాతీయ కార్యసాధనవలనఁ బరమావధిని జేరఁగోరుట, తెప్ప యని భ్రమించి మొసలివీపుమీఁదుగా నదిని దాఁట యత్నించుటే !"

"ఈఁదునపుడు, నీటిని వెనుకకుఁద్రోసినచో ముందుకుఁ బోవుదుము; సంసారసాగరము నీఁదునపుడు, త్యాగముచే వాసనలను వెనుకకుఁ దొలఁగించినచో ముందుకుఁ బోఁగలము."

"జాతిగుట్ట లగుపర్వతములమీఁద లలితములగు పుష్పములు పెరుగును. కఠినకర్కశము లగు హృదయములుమాత్ర మేమిలోపము చేయును ?"

"ఒక్క రాజ్యమునకైనను నీవు పట్టాభిషిక్తుఁడవుకమ్ము! మనసామ్రాజ్యాధిపత్యము వహించి, అందేవిషయము కాలు పెట్ట నర్హమో కాదో చూచి శాసింపుము."

"కొన్నిలక్షలమంది శరీరము లీపాటికి రోగరహితములై యుండెడివే ! ఆ శరీరారోగ్యములకై చేయు నూహాలు,

కృషులే అడ్డువచ్చినవి ! శరీరమునుగూర్చి తలంచుట మానిన వారికిఁ బరిపూర్ణారోగ్య ముండును."

"అంతరాయములు, కష్టములు, వీనితోఁగూడిన సాగరమునఁ బడి బ్రహ్మజ్ఞాని యెన్నఁడును మునుఁగఁడు. సూర్యుఁడెన్నఁడును అంధకారమగ్నుఁడు కాఁడు."

"అర్జునివలె వీరయుద్ధ మొనర్పుము; కాని, రథసారథ్యము శ్రీకృష్ణునిచేతిలోఁ బెట్టుటమాత్రము మఱవకుము."

"పరమాత్మా ! ప్రకృతిగ్రంథము నీ దివ్యదర్శనము బోధించు వేదము. ఆకాశమును దిలకింపకుండ నుండఁజాలను కనుక, నిన్ను మఱవఁజాలను."

"గౌరవములకై వేఁటాడు సోదరులారా! సంఘసంస్కర్తలారా ! రాజకీయ నాయకులారా ! మతసందేశకులారా ! ప్రియు లగు కృషికులారా ! రాముఁడు చేయు ప్రయాణము వేఱు. యాత్రికు మధ్యనున్న యంతరువులలో నాతఁడు ప్రయాణము నాఁపఁజాలఁడు. పరమావధిఁ జేరినఁగాని రాముని యాత్ర ముగియదు ! స్థలాంతరములఁ జరించు టేల ?"

"ధర్మపత్ని నవిత రైక ప్రేమతో లాలించినచో, గృహకృత్యములన్నిటి నామె, సక్రమముగా సంతసముతో నవరించును. కాని, మనము మఱొకవనితను బ్రేమింప నారంభించినచో, సహధర్మచారిణి, సహజముగా ద్వేషపూరితురాలై గృహకృత్యములను దేలికగా విడిచిపెట్టును. అట్లే, విశ్వప్రపంచనాథుఁ డగు పరమేశ్వరుని వ్యభిచరింపని భక్తితోఁ బ్రేమించి.

నచో, మన సమస్తజీవితావసరముల నాతఁడే చూచి సవరించును."

"ఈశ్వరుఁడు స్వహస్తములతో నిర్మించినసృష్టిలో నీవు సాహాయ్యమొనరింప మరియుదు వేల ? భగవంతుఁడు నిద్రించు చున్నాఁడనియా ? లేక మరణించినాఁడనియా ?"

"నీవు ముష్టియెత్తినన్నాళ్ళు నీ కేమియు లభింపదు. భయశబ్ద మెఱుఁగని రాజాధిరాజువలె నిలఁబడినచో సర్వము నిన్నే వరించును. పిలువని పేరంటముగా రాజధర్మమున కెందఱు వత్తురో ! "పరానుసరణవాంఛ, అధికారుల యనుగ్రహసంపా దనకాంక్ష, మూర్ఖజన శ్రేణినుండి గౌరవము నార్జించుకోరిక, మానవునిలో నంతర్భూతములై యున్న ధీరత్వమును బ్రతిభను గాఁటికి వేయును."

"నిన్నభినందించువారలను, పూజించువారలను, పొగడు వారలను నమ్మకుము. వారే నీపతనకారకులు. శిష్యులను గ్రహింపకుము. ఏవ్యక్తితోడను సంబంధము పెట్టుకొనకుము. అన్ని బాంధవ్యబంధములనుండి స్వేచ్ఛగనుము. వ్రాయుచునో ధ్యానించుచునో కాలము గడపుము. ఆత్మనిగ్రహముతో గ్రంథములను జదువుము. ఆత్మసాధనాగ్ని నార్పివైచుజలపాత ములే వార్తాపత్రికలు, విమర్శకులు, అభినందకులు, మిత్రులు, స్తోత్రపాఠకులు, శిష్యులును."

"సౌందర్యసుధాధారల స్రవించువనాంతరవీధులయందు వలెనే, జనాకీర్ణములగు పట్టణవీధులందుఁ దిరుగాడుము. అర ణ్యములలో గుంటలు, గోతులవలెఁ, బట్టణములలో విమర్శలు

ద్వేషము లున్నను, సౌందర్యరసానందతన్మయత్వములో వానిని మఱచి, నిశ్చలసాక్షిభూతుఁడవై విహరింపుము.''

"శరీరారోగ్యముకొఱకుఁగాక, చాపల్యతృప్తికై నాలుక భుజించినచో రుచిపోవును. ఆరోగ్యసిద్ధి గల మానవుఁడు, స్వార్థముకొఱ కేపనియుఁ జేయఁడు, పరార్థముచేయుచుంటినని పేర్లఁడు.''

''ఒక పడవమీఁది ప్రయాణికుఁడు, తన యొద్దనున్న ధనమును మొలకట్టులో బిగించి, అది తనసొత్తని మురిసినాఁడు కాని, పడవ చిల్లుపడి, మున్గి ప్రయాణికుఁడు దానితో నడుగు నఁబడి నీటియడుగునకుఁ బోయినపుడు, తాను పొరపడినట్లు గ్రహించినాఁడు. ధనము తనసొత్తుకాక, తానే ధనముయొక్క సొత్తయినాఁడు. ఏలన, ధనమే బరువై సాగరగర్భమునకుఁ బోవుచు, నాతనిని విడువకుండ లాగుకొనిపోయినది !"

"నిన్నుఁ జూచి యితరులు పరిహసించిరా? నీవు కురూప వని, కుటిలుఁడ వని నిన్నుఁ బరులు ద్వేషించిరా? ఇదంతయు జూచి, లజ్జావనతముఖుఁడవై గృహాంతరమందిరమున కరిగి, ముఖము కప్పుకొని, న న్నితరులు తలఁచుకొన రని, తలఁచిన నేవగింతు రని విచారింతువా ! వత్సా ! భీతిచెందకుము! ఒక్క పరమేశ్వరుఁడు మాత్రము నిన్ను మఱవఁ జాలఁడు. నీవు లేకున్న నాలోప మాతనికి లోపమే !"

"నాగరక సంఘములకు, వార్తాపత్రికలకు, నెవరినో యొకరిని దూషించుటో, పొగడుటో, విమర్శించుటో ఇదియే పని. వర్తకపుసరకులనుగూర్చి ప్రసంగించునట్లే మానవునిఁ

గూర్చి ప్రసంగింతురు. ధర పడుచుండును. లేచుచుండును. నీలో నున్న పరమాత్మస్వరూపు నెఱుఁగుము. నీధర నెవరు నిర్ణయింపఁగలరు? మూర్ఖులప్రసంగములకు విలువనొసఁగకుము. నాగరకతామోహము నురిదీయుము."

"ప్రతి మానవహృదయమును నా నివాస భూమియే. మానవుఁ డేమూలనున్న నాతనిని నాహృదయము విడువదు."

"సభ్యుల యంగీకారానంగీకారములను లక్ష్యింపక, సభావేదికపైఁ నిలఁబడి, తా నేకాకియై యున్నట్లు మహాప్రవక్త యుపన్యసించును. ఆతని యచంచలనిశ్చయమునుండి యొక్కపీసము వెనుకకు మఱలఁడు. యుక్తిప్రయుక్తుల నవసరోచితముగఁ బల్కి వెంటనే వానిని విడిచిపెట్టును; ప్రాచీనప్రమాణముల నాతఁడు సూచించి విసర్జించును; సాహిత్యాలంకారకుసుమముల నాతఁ డొకపరి విరఁజిమ్మి వెంటనే వానిని మఱచిపోవును; ఆత్మానుభవముచేఁ గనుఁగొన్న సత్యములను దుర్భేద్యశిలాధారములపై నిలఁబడి ధైర్యసాహస నిశ్చయములు సహజోద్రేకములో నంకురములెత్తుచుండఁ జేయెత్తి సభ్యుని హృదయంతరవర్తి యగు పరమాత్మకు సూటియగు విన్నపమొనర్చును.

వేలకొలఁది సభ్యులు నేత్రాంచలములనుండి మెఱవుఁదీఁగలవలె నానందాశ్రుబిందుసందోహములు నజదలై ప్రవహించును; సభ్యమహాసాగరము ప్రేమాభినందనపూర్వక మహోత్సాహముతో ఘూర్ణిల్లి ఘోషించును. ఆతఁడుచూపిన, హేతువాదములు, తర్కములు, పండుటాకులు సుడిగాలిలో నెగురునట్లెగురును; ప్రమాణపరంపర లన్నియు మంచు నీటిలోఁ గరఁగినట్లు

కరఁగిపోవుచు. వాక్యప్రమాణతర్క-వాదముల కంతర్గర్భితమై మానవహృదంతరసీమ నిశ్చంచలమై నిలచియున్న విశ్వశక్తి తన సంకల్పమును బహిర్గతమొనర్చి విశ్వప్రపంచచరిత్రలో నొక తుడువరాని పుటను జిత్రించుకొనును !"

''రాముఁ డుత్తరమును వ్రాయునపుడు, వ్రాయుటే యాతనికొక స్వకల్పితసంతృప్తి నొసఁగునుద్యోగము. ఉత్తరములకుఁ బ్రత్యుత్తరము లెన్నఁ డాసింపనివ్రాఁతలవి ! హృదయము నుండి ఉబికి పైఁబడు నానందప్రవాహములోని తరంగములే నాలేఖలు !"

"అవసరము, ముఖ్యము నని దేనిని దలఁపకుము; దేనినో యొకదానిని బట్టి, ఇది ముఖ్యావసర మనుకొనుటవలననే తుది లేనిదుఃఖములు ప్రయాసములు, హృద్రోగములు, నుద్భవించుచున్నవి. ఒకవిషయముమీఁద, "ముఖ్య"మని ముద్రవేయుట తోడనే, ఆవిషయము మనభావివిలాపమునకు బీజమగుచున్నది. ప్రతివిషయమునుండి, ముఖ్య మను భావమును సమూలనాశన మొనర్పుము. ముఖ్యభావమే మోహముగాఁ బరిణమించును."

"మానవులను దాస్యములకు బంధించువ్యక్తిని నేను తీవ్రముగ ద్వేషింతును; కాని, ఆతనికి నేను వేయుశిక్ష, ఆత్మసాధనశిక్ష నేర్పుటే !"

"స్వజాతిహృదయముతో నేకీభావము, నీపరితిరక్తనాళమున నృత్య మొనర్చినఁగాని, పరమేశ్వరునితో నేకీభావమెన్నఁడును లభింపదు."

"గతించిన ప్రాచీనమహోన్నతపరిస్థితుల నేకరువుపెట్టుచు కాలము గడపుటే కొందఱు దేశభక్తియని తలంతురు. ఇది యెట్లున్న దన, నేఁడు "దివాలా"తీసిన వ్యక్తులు, ఇప్పుడు నిరర్థకములైన తమపూర్వపు "బ్యాంకి" పద్దులను ముందిడుకొని లెక్కపెట్టుకొనుటవంటిదే !"

"ప్రజానాయకత్వము వహింప సమర్థుఁడగు పురుషుఁడు, తనకు సాయ మొనర్చు వ్యక్తులపూర్ఖ్యమునుగూర్చి యాందోళనపడఁడు; అనుచరుల యవిశ్వాసమునకుఁ గలఁతచెందఁడు; మానవకోటిలో నిమిడియున్న కృతఘ్నతకు దిగులుపడఁడు; ప్రజావిముఖత్వమునకు విలువనొసఁగఁడు."

"ఐరోపా అమెరికాఖండముల యౌన్నత్యదశకు, క్రీస్తుభగవానుని సందేశము కారణము కాదు. అప్రయత్నపూర్వకమగు వేదాంతాచరణమే వారిదిగ్విజయకారణము. భారతదేశపతనమునకుఁ గారణము, వేదాంత మాచరణలో లేకపోవుటే!"

"ప్రాచీనభారతవిజ్ఞానజ్యోతియే నేఁటిభారతములో నవ్యకాంతి పుంజములను బ్రదర్శించుచున్నది. మీరు దానిని గాంచి యఱిగించుకొన నిష్టపడకున్నచోఁ బోయి పితృలోకములో మీ తాతముత్తాతలతో జీవింపుఁడు. ఏల యిచ్చటఁ దిరుగాడెదరు ? వెంటనే మూటకట్టుఁడు ! సెలవు !"

"చీకటితో రణ మొనర్చి చీకటిని బోఁగొట్టఁజాలవు. ఒకచీకటిగదిలోనికిఁ బోయి, అన్నిదిశలను ఱాళ్లు ఱువ్వి, కిటికీలు పగులఁ గొట్టి, కుర్చీలు విఱిచి, బల్లలు తన్ని, తిట్టినచోఁ జీకటి తొలఁగునా ? దీపము పెట్టుము. చీకటి లేదు. అట్లే విమ

ర్శించుట, దూషించుట, భయపెట్టుటవలన లోపములు పూరిం పఁబడవు. వలయున దేమన, ధైర్యమొసఁగి, ఆశ పుట్టించి సంతస ముదయింపఁజేయు ప్రోత్సాహము. మురికికాలువలలోని మురికినంతను దీసి, వీథులలోఁ జిమ్మినచో నేమైనఁ బ్రయో జనము కలుగునా? అట్లేయితరులదోషములు గోరంతలు కొండం తలుచేసి చాటించిన నేమియు లభింపదు. పరిశుద్ధోదక ప్రవా హము మురికికాలువలోఁ బ్రవహింపనిండు. కల్మషమంతయుఁ గొట్టుకొనిపోవును. అక్బరుచక్రవర్తి, ఒక నిడుపుగీఁత గీసి దానిని చెరుపకుండఁ ద్రుంచకుండ నొకచిన్నగీఁతను జేయుమని బీర్బలుని గోరెను. వెంటనే బీర్బలుఁడు అక్బరొసఁగినగీఁత కెదు రుగా నొక పెద్దగీఁతను గీసెను. అక్బరుగీఁత చిన్నదైనది. చిన్న గీఁతను దుడిచివేయక పెద్దగీఁతను గీయుటే ప్రజ్ఞాలక్షణము. ఏవ్యక్తి కావ్యక్తి హృదంతరమునఁ దానుచేయుపని దోష పూరితమైన దని తెలిసికొనునట్లు చేయుటే ఉత్తమవిమర్శలక్ష ణము. దోషారోపణముచేయు టెట్టిదన, "అయ్యో! తాటి చెట్టు పనసచెట్టేల కాలే"దని ప్రశ్నించుటే! ప్రతిదానిలోని సౌందర్యమును మనము తిలకింతము. "చెడుగుఁ గూర్చి కుక్క వలె మొఱుఁగక, మంచినిగూర్చి కవివలె వర్ణింపుము!" ఓ ప్రియవిమర్శకా! నిన్ను నేను ప్రేమింతును; కాని, నీవు విమ ర్శించువానినిగూడఁ బ్రేమింతును!

జీవితయుద్ధములో జయించునదేది? ప్రేమయే జయిం చును. ఏజాతులు, తమహృదయములను గలిపి, బుద్ధులను సమ న్వయించి, హస్తములను సేవాసక్తితో మేళవింపఁగలవో,

ఆజాతులు సంఖ్యలో మిక్కిలి చిన్నవైనను, సమ్మేళనము లేక విడిపోయిన కోటిగుణితము లగుజాతులను జయింపఁగలవు.

పోరాటము మూఁడురకములు: సమానులతోడను, అసమానులతోడను, ప్రకృతితోడను. సమానులతోఁ బోరాడి శక్తిని వ్యయించుట మాని, సాక్షికదృష్టి, యసహానబుద్ధి వీనిని పాఱఁద్రోలి, సమానులతో నేకీభవించినచో అసమానులతోడి పోరాటములో జయము సిద్ధము. కాని, అసమానులను ప్రేమించినచోఁ బ్రకృతిని జయించుట సాధ్యమగును. ప్రకృతిని జయించుట, భౌతికరంగమున "నేనే సర్వశాసనకర్త" నని సాధించుటే.

సరిపోల్చుట, విమర్శించుట యివి అవసరము లేకపోలేదు. కాని, అహంకారపిశాచము నుద్రేకింపఁజేసి, సంఘమును జీల్చివైచు విషవిమర్శనలు గర్హింపఁదగినవి. సర్వానర్థములకుఁ దల్లియగు నహంకారమును దూరముగఁ దఱిమివైచి, అసంగదృష్టితో నన్నియుఁ బరికించిన విమర్శలో దోషము హరించును. జగత్సాక్షి యందఱకుఁ గరము లొసఁగి సాయమొనర్చుచు, పువ్వులను, పొదలను, చవిటినేలలను, వనములను, చీమలను, మేఘములను, సర్వప్రాణికోటిని సమానాదరముతో గౌరవించునట్లు మనమును వర్తింపవలెను.

జాడ్యమునుండి తప్పించుకొనవలెనన్న ఆరోగ్యధర్మము ననుసరించి జీవించు టొక్కటేమార్గము. విదేశరాజకీయముల నుండి బయల్పడుటకు, ఆత్మారోగ్యధర్మజీవనమే — ప్రక్కయింటిసోదరునిఁ బ్రేమాలింగన మొనర్చుటే — సాధనము.

అభివృద్ధి, అధఃపతనము రెండును సమానసౌలభ్యముచే బొందఁదగినవే. యజ్ఞ మనర్థములనుండి రక్షించుట నిజమే. కాని, నోరులేని జంతువుల నాహుతిచేయు యజ్ఞము కాదు. పక్షదృష్టి, వర్ణభేదద్వేషము, అసమానత యను పశువులను ప్రేమాగ్నిలో నాహుతి యొనర్చుటవలన, భూమిపై స్వర్గము స్థాపితమగును.

మిత్రులు, శత్రువులు చేయువిమర్శ, మనల నిద్రనుండి మేల్కొల్పు స్వప్నపిశాచము. మనము నిద్రనుండి లేచినంతనే అది మాయమగును. మనము సర్వసమాదరబుద్ధితో నున్నపుడు విమర్శకులు మనలను సమీపింప వెఱతురు. దీపములేని యింటనే దొంగలు పడుదురు. ప్రజానాయకత్వము వహింప సమర్థుఁడగు పురుషుఁడు తనకు సాహాయ్య మొనర్చు ప్రజల మాాధ్ర్యమునుగూర్చి చకితుఁడుకాఁడు; తన యనుచరుల మోసమును దిలకించి కలఁతఁజెందఁడు; మానవకోటిలోని సహజ నీచత్వమునకు జంకఁడు; ప్రజావిమర్శలకు విలువ నొసఁగఁడు. ఇవి యన్నియు జీవితమను క్రీడలోని కళలు నిరుత్సాహపడి, అపజయభీతిచే వానికిఁ దలవంచుట కాక, ధీరత్వముతో నెదుర్కొనుటే పురుషలక్షణము. అలక్ష్యబుద్ధితో వీనిని నిరసించి, నిలుపుకొను శక్తితో సాధింపఁజాలని కార్యము లేదు.

బాలురు ప్రతివస్తువునకుఁ బ్రాణప్రతిష్ఠ చేయుదురు. మేఘగర్జన వారికి దూరముననున్న ఒక భూతముయొక్క కేక! వార్థక్యము పొందిన పిల్లలు నట్లే తాము చూచినవారికి రక్తమాంసములు కల్పించి రూపమును బ్రతిష్ఠింతురు. ఏదైన

లోపము సంభవించినప్పుడు, ప్రేమధర్మములో లోటున్నదని సవరించుకొనక, పరిస్థితులతోఁ బోరుట, దుఃఖవార్త గల లేఖను తెచ్చినాఁడని టపా మోయుసేవకుని దన్నుటవంటిదే.

ఈ ప్రపంచములో సమస్తమును నిరంతరము పరిభ్రమించుచు, నిపుడు గోచరమయినది మఱుక్షణములో మాయమగుచున్నది. దేనికిని స్థిరత్వ మొసఁగఁజాలను. అట్టిచో దేనిని నేను విమర్శింపఁబూనుకొనఁగలను ? ఒక మెఱపులో నొక మేఘమువలె నఖండవేగముతో నొకబండి పోవుచున్నది. అది స్థాణువై నిలఁబడియున్నదని మనము భ్రమించుచున్నారము; కాని, పరిశీలించుట కారంభించుచో నది మటుమాయమగును. ప్రజలు చూచి నింద్యము లనుకొనువస్తువులు, జీవులు నిట్టివే. ఇది లౌకికవిజ్ఞానము. సమస్త వస్త్వభ్యంతరమున శయనించి యున్న సర్వేశ్వరునిఁ జూచి యనంతశాంతి నందుము.

ఊహాచేఁ దర్కముచే వాదముచే నేకీభావము సృజింప లోకులు యత్నింతురు. హృదయసమ్మేళనము వారికిఁ దట్టదు. పదార్థ మెఱుఁగు టనఁగా నర్థపర మైన పరమాత్మను గుర్తించుటే. ఇది ప్రేమచే లభించునది. ప్రేమకు జ్ఞానము నీడయై యనుసరించును. నీ వూహించుట గాదు, త్యజింపవలెను. ప్రేమ సర్వశాసనములను జెండాడి, శాసనఫలితములఁ జేకూర్పఁగలదు. తక్కిన శాసనతిరస్కారములు విప్లవహేతువులు. ప్రేమయే ఈశ్వరశాసనము. ఇతరశాసనములు దోపిడిపద్ధతులు. ప్రేమయే సర్వశాసన ధ్వంస మొనర్ప సమర్థమైనది. ప్రేమచేఁ బొందునది దైవికము; భౌతికశాసనముచేఁ బొందునది ధర్మవిరుద్ధము.

భారతరాజకీయనాయకులారా! మీరు నేఁటివఱకు విమర్శనములతో, హృదయములు మంటలెత్తు దూషణలతోఁ గాలము గడపినారు. కాని, పరిస్థితులు విషమించినవి. మన మొక సక్రమపద్ధతిని జూతము. పరపక్షము తప్పుచేసె నని, మనము నల్లే చేయుటవలన నేమిలాభము? రెండునలుపు లొక తెలుపును జేయఁగలవా? తనకు మర్యాదచూపలేదని ఒక వృద్ధుఁ డొకబాలునిమీఁదఁ బడి, "మూర్ఖుఁడా! నీవేల నీచముగఁ బ్రవర్తించితి"వని కసరినాఁడు. బాలుఁ డిట్లు బదులు చెప్పెను; "ఆర్యా! తమరు సెలవిచ్చినట్లు, నేను మూర్ఖుఁడను కాఁబట్టియే అల్లరిచేసితిని. మీరు పెద్దలు కనుక, పెద్దతనము చూపి ప్రవర్తింపుఁడు!"

తర్కము తలవాల్చినచోటఁ బ్రేమ జయాంకురముల మొలిపించును. మతములను, శాఖలను, నామములను గంఠహారములవలెఁ బ్రజలు ధరింతురు. వానికి లేనిగుణములన్నియుఁ గల్పించి వర్ణింతురు కాని, ఫలితములు వేఱుకారణములచే లభించుచున్నవి.

ఒకటివెనుక నొకటి మూఢవిశ్వాసములను, మోహములను, సంగములను, విడిచిపెట్టక తప్పదు. సంగములు బంధించి బాధించును. నీవు మొదట బంధములఁ బడకుండ నొకరిని బంధింపఁ జాలవు. బంధములను, సంగములను దొలిచివేయు నీదోపిడివలన, బ్రహ్మానంద మనునిధి లభించును. నాకు ప్రియతమ మగు భగవన్నామము 'హరి'. హరి యనఁగా, హరించుట. కాని, కొందఱు "శత్రువును ప్రేమించి లొంగినచో-

నాతఁడు మమ్ము నమలివేయఁడా ?" యని తలంతుము. ఓబాలకులారా ! భ్రాంతిమంతులారా ! ఈసత్యము నెన్నఁడైన సాధన చేసి చూచితిరా ?"

జీవితముయొక్క తలుపులన్నిటిమీఁదను 'లాగు' మని వ్రాసియున్నది. దానిని మనము తప్పుచదివి, 'త్రోయు' చున్నారము. తలుపు లెట్లు తెఱవఁబడును ? త్రోయుట వాదించుట వంటిది. లాగుట, ప్రేమసూత్రముచే నాత్మ నాకర్షించుట. ఆదేశమునకు హృదయము విలాసమందిరము; బుద్ధి బయటకుఁ బోవు ద్వారము, ప్రేమ సృజించును; బుద్ధి తెలియఁజెప్పును. ఒక వ్యక్తి హృదయభూమిలోఁ బ్రేమాంకురమును నీవు నాఁటఁగల్గినచో నాతని యూహాప్రపంచమున విప్లవము కలిగి తీరును. దృష్టిలో దోష మున్నపుడే, సృష్టిలో దోషము కన్పట్టును. ప్రేమనాథుఁడు మనహృదయప్రేమలోఁ గుటీరము నిల్పినచోఁ, బట్టపగలు రెండవసూర్యుఁ డుదయించిన కాంతి గోచరించును.

ఏపురుషుఁడును మొదటనే హృదయమునఁ బవిత్రుఁడు కాఁడు; అనుభవముచేఁ బవిత్రుఁడగును. బాహ్యపారిశుద్ధ్యము లేక స్త్రీపురుషసంబంధశుద్ధి యను ధర్మముపేర,నాత్మపారిశుద్ధ్యమును విడిచిపెట్టుచున్నారు. అస్ఖలితబ్రహ్మచర్య మనుచు బలహీనులు చేయు దుష్ప్రలాపములు కార్యసాధనములు కాఁజాలవు.

దంభాచారప్రచారకులు తమవృత్తి మాని ప్రజలకు స్వాతంత్ర్యము విడిచినచో మలినములగు చేతులను గడిగికొను

గడియారములోని నలుసులంత చిన్న హస్తములు (Hands of Clock) ప్రపంచము నేలుచున్నవి. అఖండబ్రహ్మ స్వరూపి యగు మానవుఁడు, ద్వేషముచే, గడియారములోని గుండ్రని గాజుముక్కయొక్క ఆవరణలోఁ గట్టివేయఁబడి నాఁడు. ఏమిదుష్కాలము ! రామునికి గడియారము లేదు. కాని, ఒక నిమిషభేదము లేకుండ నాతఁడు కార్యములు నడుపును. ప్రేమ వెల్లివిరియు హృదయశబ్దముతో (Heart-beat) కాలగతియు నేకీభవించును. ప్రకృతిదాస్య మొనర్చును. విశ్వమును భ్రమింపఁజేయుచిత్రములు జరుగును.

శ్రీరామతీర్థుని స్వదేశ సర్వదేశ సందేశము

విమర్శ : విశ్వప్రేమ

భారతదేశమున నేదైన నొకప్రయోజనకారి యగు నూతనోద్యమము బయలుదేఱినచో, నాయుద్యమనాయకునికిఁ గొన్నిలోపము లంటఁగట్టి, ప్రజాహృదయమును విఱిచివేయుటే కొన్నిపక్షముల దైనికకృత్యము. ఈవిధముగాఁ బ్రతిపుష్పమును మొగ్గలోనే త్రుంచివేయఁబడినది. కాని, లోపము లేనివ్యక్తి యెవ్వఁడు ?

ఒకగొల్లపిల్లవాఁడు పాలముంతలను దీసికొనిపోవుచుండుట రాముఁడు చూచినాఁడు. కాలకర్మవశమున నొకముంత బాలునిచేతినుండి జాఱిపడి, పగిలిపోయినది. పడిపోయినదను కోపముచే నాబాలుఁడు చేతనున్న ముంతల నన్నిటిని నేలఁబెట్టి కొట్టెను.

పరస్పరకార్యములలోఁ బ్రజలిట్లే ప్రవర్తించుచున్నారు. ఒక మిత్రునియందు స్వల్పదోషముఁ గాంచి, వానిలో నున్న సద్గుణపుంజము లన్నిటినిఁ దుడిచివేయుచున్నాము.

మన మేకదృష్టితో నిలఁబడ గల స్థలము లేదా ? మన మిత్రులలో నభినందింప నర్హము లగు లక్షణములు లేవా ? భారతదేశములోని వివిధమతశాఖల నేకీభవింపఁజేయుసూత్రమే లేదా ? ఒకవ్యక్తియొక్క బహిరంగప్రవర్తనము, దేశమునకు మహోపకారప్రదమై యుండ, ఆతని యాంతరంగికజీవితములో నొకనెఱ సున్న దని, రహస్యపరిచారకోద్యోగ మొనర్చుటకు, భగవంతునిపేర నీయధికారపదవిని మన కెవ రొసఁగినారు? ఒకవ్యక్తి యాంతరంగిక వర్తనమునందలిబాధ్యత, వ్యక్తి మీఁదను, ఆతని దేవునిమీఁద నున్నది. అందు వ్రేలుపెట్టుటకు మన మెవరము ? ఇతరులను బరీక్షింపఁగోరి, మనము వ్యయించుశక్తి లోపించుటచే, మనజీవితములు నీరసించుచున్నవి. బాహ్యనిర్బంధము లొకవ్యక్తిని ధర్మపరునిఁ జేయఁ గలవా ? అట్లుకాక, పరులపొగడ్తల కాసించి, సల్పుడాంబిక కర్మకాండ సత్ప్రవర్తన మనిపించుకొనునా? అది పవిత్రత కాదు, బలహీనత ! కంటకము లున్నవని గులాబిపువ్వులను విడుతుమా ? కురూపమని, ఒక చిత్రకారుఁడు రచించుసౌందర్యమును దూలనాడుదుమా ? ఒకవ్యక్తిలోని కేమిపోవుచున్నదో దానిగోడవ మన కెందులకు ? ఆపనినుండి బయటపడునదే మన కవసరము. వివేకానందుఁ డేమియో తిని, త్రాగినాఁడను కొందము. నీ కేమి ? ఆతని జిహ్వాగ్రమునుండి నృత్యము సల్పు

దివ్యవాణి చిల్కు బోధామృతమును నీవు విడువఁగలవా? ఒక పురుషుఁడు చెప్పుమాటలను, మనము గ్రహింపవలెను. కాని, ఆతని హృదంతరమున నేమిజరిగిన మన కెందుకు? యూక్లిడ్ రచించిన రేఖాగణితసూత్రములకు, నాతనిజీవితమునకు నేమి సంబంధ మున్నది? బేకనుదొర లంచగొండియని, యాతని తర్కశాస్త్రమును విస్మరింపఁగలమా? బురదనుండిపుట్టిన దని, సౌందర్యమును విరఁజిమ్ము కమలమును దిరస్కరింతుమా? ఈ యిరువదవశతాబ్దములో వ్యక్తులను, వాక్కులను గలుపఁ గూడదను వివేకమును నేర్చికొనుట ముఖ్యావసరము.

నేఁడు భారతవర్షము దారిద్ర్యకూపమునఁబడి మ్రగ్గుచుం డుటకుఁ గారణము, విశేషప్రయోజనకరములగు కొన్నిపదార్థ ములమీఁద 'నీచ' ముద్రవేసి, వానిని విసర్జించుటే. ఈనీచ పదార్థములను, సక్రమోపయోగమునఁ బెట్టియే, ఐరోపాదే శము లౌన్నత్యము పొందినవి. పెంటకుప్ప లెరవు కాకున్నచో బుష్పవనము లెట్లుపెరిగినవి? అసహ్యకర మగు బొగ్గునందుఁ బుట్టువాయువులను, పెద్దయంత్రముల కుపయోగించి, పశ్చిమ ఖండములు సామ్రాజ్యముల నేలుచున్నవి.

శ్రీరామచంద్రప్రభుని గొప్పతన మెచ్చట నున్నది? కుటిలము లగు కోఁతిమూకలను, వీరసైన్యముగాఁ దయారు చేయుటయందే యున్నది. పావనధర్మప్రవర్తకులఁ జూచి యేవి దాస్యమొనర్పవు? పతితులను, పాపులను, మాతృప్రేమతో నాలింగనమొనర్చుకొనఁజాలు వ్యక్తియే మహాత్ముఁడు.

వంటింటి పిచ్చిసమ్మకము లనుదుమ్ముతుపానులో సత్య స్వరూపియగు పరమాత్మను, మఱుగుపఱచి, బాహ్యాభ్యంతర నీచత్వమునకుఁ బాల్పడకుందుముగాక ! పరమాత్మనిలయమగు బాహ్యాశరీరమాలిన్యమును జూచి వెక్కిరించు వంటయింటి మతము దుర్మతము. చినిఁగి, చీలికలై కంపుకొట్టుచున్న జాతి భేద మను చింకిరిగుడ్డ దివ్యకాంతిపుంజముల వెదచల్లుచున్న పరమాత్మస్వరూపమునే కప్పుచున్నదని గ్రహింపుఁడు. సర్వాంతర్గతమైన, స్వప్రకాశతేజోరాశియై వెల్గొందుచున్న ఈ విశ్వశక్తిని మఱచుటే లోకములోని సర్వానర్థములకు హేతువు.

ఒకరిలోపము లొకరు త్రవ్వి ప్రకటించుచుఁ గూర్చుండుచో నీదేశములో నిఁక నైకమత్యము చేకూరుట కలలోని వార్త. జీవించు టొకకళ. జయప్రదముగా జీవించుకళ నుపాసించుటకు, అంటుజిపిల్లలను ఒకేరీతిఁ బ్రేమించుమాతృహృదయము మనలోఁ బెంపొందవలెను. ఈశ్వరునికనులలో లోకమును జూచుటే సద్విద్యయొక్క ఫలము.

ప్రతిజీవియుఁ బ్రతిజీవితాంతరువును దొక్కవలసియున్నది. దైహికముగా బాల్యము, యౌవనము, కౌమారము మున్నగు దశ లెట్లు తప్పనివో, అట్లే, ఆధ్యాత్మిక జీవితములో నైన నీదశలు తప్పనివే ! పాపాంధు లని పిలువఁబడువారు, ఆత్మసాధనరంగములోఁ జంటిబిడ్డలు ! చంటిబిడ్డలలోమాత్రి మొక విధమగు సౌందర్యము లేదా ! నీవు "పతితు"లని పిలుచువారు పతితులు కారు; ఇంకను "మేల్కొననివారు" మాత్రమే. నీవును వారిదశలో నొకప్పు డుంటివి.

"పాపమును ద్వేషించి, పాపినిఁ బ్రేమింపు"మని విశ్వ ప్రేమసిద్ధాంతమునఁ బల్కుచుఁ దమ ప్రక్క నిలఁబడువారిలోప ములమీఁదనే, మానసమును కేంద్రీకరించువారి ఆత్మవిరుద్ధ ప్రవర్తనము నేమనవచ్చును ?

ఓప్రియసోదరులారా ! నైచ్యమును మీ రెచటఁ జూతురో, అచట మీరు ప్రేమను బ్రసరింపఁజేయఁజాలరు. ప్రేమ యన సౌందర్యమును దర్శించు టే.

కృషిచేయువాని యాత్మకు భుక్తి నిడుము. ప్రేమయే ఆభుక్తి. ప్రేమించిన కృషీవలుఁడు బహుమాన మడుగక పనిచే యును. కూలివానిని బ్రేమింపుము; నీపని నాతఁడు ప్రేమించును. ప్రేమతోఁ జేయుపని పనియేకాదు; సంతసమునిచ్చు ఆటయే!

కృషి యెచ్చట దూషింపఁబడునో, అచ్చట వినాశము, విపరీతము సంభవించును. కృషి కళ యగుటకు మారు, కళయే కూలియగును. ప్రేమనామ ముచ్చరించినంతనే, ప్రజలకుమన్మథ ప్రేమయే జ్ఞప్తికివచ్చునంతటి మహార్ఖ్యములోఁ బడినారము. ప్రజలు కొన్నివేళల, నుపాసనాభక్తులనుగూర్చి భారతములు పలుకుదురు. కాని, అది వట్టిసంస్కృతపదోచ్చారణమే. మందు లేనితుపాకిగుండ్లు! చైతన్యప్రభునామము నపవిత్రమొనర్చుటే!

దేవాలయములనుండి యెన్నియో ప్రార్థనామంత్రములు వినఁబడుచుండును, కాని, ప్రేమరసమొల్కు నొక్క కన్నీటి చుక్కలేదే !

ధన్యులగు నోభారతీయులారా! మేము పాపాంధులము, దాసానుదాసులము నని గొంతులు మండునట్లు కేకలుపెట్టి

దేవుని మోసగించి యాతని దర్శింపఁజాలరు. మీ రూహించిన రీతినే యగుదురు. కర్మశాసన మనతిక్రమణీయ మగుటచేఁ బాపులమని ప్రార్థించి పాపులేయగుదురు. ఇది భక్తి కాఁజాలదు.

ఓ ధనికనామకదరిద్రసోదరులారా! విష్ణుగోపురములు, గుళ్లు కట్టించినంతమాత్రమున మీకుఁ జిత్తశాంతి యెన్నఁడును జేకూరదు. మీరు పొందుచున్న దుఃఖము నే నెఱుఁగుదును. మీగర్వము నేఁడు మీకనులను గప్పవచ్చును, దరిద్రనారాయణులను, రయితులనెడి విష్ణుమూర్తులను బూజింపుఁడు. కొందఱు విద్యార్థులకు ధన మొసఁగి, అమెరికా పంపుఁడు. వారు పశ్చిమదేశకళలను వృత్తివిద్యలను నేర్చి, తిరిగివచ్చి, వేలకొలఁది మానవులకు భుక్తిమార్గము చూపుదురు.

ఓ భారతదేశములోని భక్తులారా! గోపికలు చైతన్యుఁడు చూపినమధురభావమును జూప మీ రువ్విళులూరుచున్నారు. కాని, వారిలోని శ్రీకృష్ణలాలసత్వము మీయందు లేశమైన నున్నదా? చండాలునందును, చోరునందును, పాపాంధునందును, విజాతీయునందును, సర్వప్రాణికోటియందును పరమాత్మునిఁ దిలకించి, యనంతప్రేమరసముల నొలికించినచో గోపికానాథుఁడు మిమ్ము వరించును.

భక్తి యనఁగా, బిచ్చ మెత్తుట, యేడ్చుట తలబాదుకొనుట కాదు. భక్తి యన ననిర్వచనీయ మగు సమత్వదృష్టి, అనంతప్రేమోన్మాదము, అలక్ష్యదైవసాహసము, సర్వస్వరూపి యగు పరమాత్మ నన్నిటిలో దర్శించుటే. నీనేత్రములు పడిన

చోట నీయాత్మను పరికించుటే. విశ్వమంతయు దివ్యసౌందర్య రాశియని అదియే నాస్వరూపమని తెలిసికొనుటే. తత్త్వమసి.

మహమ్మదీయులారా! మీరు నన్ను హత మొనర్చుడు. కాని, మీమీఁదఁ బ్రేమరసమే ప్రవహింపఁజేసెదను. క్రైస్తవులారా! మీరు నన్ను అపార్థముచేసికొనవచ్చును. కాని, మిమ్ము నేను ప్రేమింపకమానను. పంచములారా! మీ నిలయములు ముట్టరాని వని, కల్మషరాసులని, మీదరి కెవరును రాకున్నను, రాముఁడు మీకు దాసుఁడే. ఆచారములు, సంప్రదాయములు, పేరుప్రతిష్ఠలకు దాస్యము, యువకుని హృదయములో నేమూలనో దగుల్కొనుచున్న సత్యజ్ఞానమను జ్వాలాంశమును, ధూమమై కప్పివేయును, సత్యస్వరూపా! ఇదిగో ఆహ్వానము, నాకు బంధువవు, మిత్రుఁడవు, ప్రేమపాత్రుఁడవు, నాధుఁడవు! పరమాత్మవు!

సామ్రాజ్యనేతలారా! శాసనకర్తలారా! జాతులారా! మిమ్ము నేను దీవించెదను. కాని, రామునితో మీకు సంధి పొసఁగదు. మీగౌరవములు, ఆగ్రహములు, బెదరింపులు, మీరే యుంచుకొనుఁడు. సత్యమే నాయుప్రతిహతసార్వభౌముఁడు. నాసత్యసార్వభౌమునెదుట, వందలకొలఁది చక్రవర్తులు అధికారులు, వేలకొలఁది ధనసంపన్నులు, వంగి 'సలాము' చేయవలసినదే.

'పెనామా' రైలుమార్గము కట్టినప్పుడు గజమున కొక మానవుఁడు బలియయ్యె నని చెప్పుదురు. ఇది నిజమైనను గాకున్నను, సత్య మనుప్రచండశాసనపంథ మానవోత్తముల

వృత్తులతో నిండియుండును. సత్యఖడ్గమున కెరయైనమస్తకము లెంత ధన్యములో కదా !

సత్యము నెఱుఁగనిదే ప్రేమ లేదు. సత్యసార్వభౌము నకుఁ బ్రేమ మంత్రి. రెండు నొకటే.

జపానులో మూఁడువందలేండ్ల వెనుకటి దేవదారువృక్షములు 'ఉల్లికోళ్ళంత' చిన్నవిగ నుండును. కొమ్మలు కొట్టివేయుటచేఁ గాదు. భూమిలో, లోఁతుగా వేళ్ళు పాతుకొనకుండఁ గొట్టివేయుచుందురు. అందుచే వృక్షము పైకెదుగదు. అట్లే స్త్రీపురుషుల సహజాభివృద్ధి, అసహజబోధకులచే నణఁగఁ గొట్టఁబడుచున్నది.

ఆచారబోధకులారా ! మతప్రచారకదుర్మతులారా ! పొండు! యువజనులకు శాసనము లొసఁగు నధికారము మీకు లేదు. ఏమానవునకైన నొక్కటే హక్కున్నది. సేవించుటే మీ హక్కు. ప్రకృతిని విడిచినచో నెన్నఁడు తప్పుచేయదు. సూక్ష్మబీజమునుండి మానవునివఱకు నిర్మాణముచేసి పెంచిన యీశ్వర ధర్మమునకు మీ సాహాయ్య మవసరము లేదు.

మానవులు పేరుపెట్టిన 'పశువాంఛ' విషయములో మానవులకన్నఁ బశువులే, యెక్కువ నియమబద్ధములై, మిక్కిలి పరిశుద్ధపరివర్తనము నేల చూపుచున్నవి ? దీనికిఁ బ్రత్యక్షకారణ మేమనఁ, బశువులకు విధినిషేధశాసనపుఁబోరు లేకపోవుటే. శాసనములు, నిర్బంధములు లేనిప్రేమ, సేవగల వాతావరణమే, సక్రమాభివృద్ధికిఁ బ్రధానము.

పుష్పలతల నెట్లు మనము పెంచఁగలము ? వానిని ప్రేమించుటచేతనే. ఒక పతివ్రతాశిరోమణి, పూర్ణవ్యతిరేక మగు వాతావరణములోఁ బుష్పరాసులఁ బుట్టించినది. ఆమె వానిని ప్రేమించినది. ప్రేమతో సర్వము సమకూరినవి. ప్రేమయే వృత్తులను కళ లొనర్చును, కర్మలలో సౌందర్యము నుద్భవింపఁజేయును.

నన్ను సమీపించి యొకవనిత తన పుత్రుని మరణము నుగూర్చి దుఃఖించినది. "ఒక నీగ్రోబాలుని బెంచుకొని, నీగర్భమునుండి జనించిన బిడ్డవలెఁ బ్రేమింపఁగలవా"యని నే నడిగితిని. "నే నట్లు చేయఁజాల" నని ఆమె బదులుచెప్పినది. "అందుచేతనే నీపుత్రునిఁ గోల్పోయితి" వంటిని. సంగములతో నిలిచిపోవునదికాక, విశ్వవ్యాప్తమగు ప్రేమలో స్వర్గములు పుట్టును.

విగ్రహార్చన మననేమి ? చర్మచక్షువుల కందక వ్యక్తులలో గర్భితమై నిత్యసాక్షిగాఁ బ్రకాశించుచున్న పరమాత్మను విడిచి, రూపములకు వ్యక్తిత్వమును, సత్యత్వమును, నిత్యత్వమును గల్పించి భ్రాంతిచెందుటే విగ్రహారాధనము.

ఏమి యనంతసౌందర్యము! ఎట్టిప్రేమసాగరము! ప్రియునకుఁ బ్రియురాలి ధవళమందహాసము లొల్కు ముఖసరోజ మెంతరుచియో, అంధకారముఁ బరిభవించు నల్లనికొప్పును నంత ప్రియమే. అట్లే రామునకుఁ బగ లెంతప్రియమో రాత్రియు నంతే ప్రియము; జననము, మరణము, ఆరోగ్యము, రోగము, మిత్రులు, శత్రువులు, సమానప్రీతి నొసఁగునవే !

ఉన్నధనము దొంగలచే నపహరింపఁబడిన పురుషుఁడెంత ధన్యుఁడో! ఎవనిని భార్య విడిచిపెట్టునో అట్టివాఁడు మూఁడు రెట్లు ధన్యుఁడు. ఏలన, నట్టిత్యాగముచే సర్వేశ్వర సాంగత్యభాగ్యము లభించిన నిం కేమివలయును? మహాత్మ్మదీయచరిత్రలో, అబ్రహాము భక్తుఁ డొకపరి, సముద్రయానము చేయఁగోరినటులు వ్రాయఁబడియున్నది. సముద్రదేవత యగు ఖైజర్, అబ్రిహాముయొక్క ఓడను నడవునావికుఁడుగ నుండ నంగీకరించినాఁడు. దాని కబ్రిహాము మొదట నంగీకరించి, ఊహింపఁగాఁ దాను పొరపడినట్లుతోఁచి, ఖైజరుతో నిట్లనెను. "ప్రియసోదరా! నా యోడకు నావికుఁ డవసరములేదు. ప్రేమ సాగరుఁ డగు పరమేశ్వరునే నా యోడ చుక్కాని పట్టనిమ్ము. నీవైనఁ జుక్కాని పట్టిన క్షేమమే కాని, నీమీఁద నామనస్సు నిలిచి, పరమేశ్వరుని మఱచును. అందుచే నీవు నాకును, నాప్రాణనాథునకు మధ్య నిలువవలదు. ఈ సంసారసాగరమును దరింప, నా దేహనౌకను ప్రేమసాగరుఁడగు పరమేశ్వరునే నడుపనిమ్ము!

చిన్న, పెద్ద, హెచ్చుతగ్గులు ప్రేమరాజ్యములో లేవు. మరణాత్మక మగుకార్యమైనను, ప్రేమతోఁ జేసిన బ్రహ్మానందము నొసఁగును. స్వార్థపరత్వము, సామ్రాజ్యకిరీటపదవియం దైనను గంటకముల గుచ్చును. నీవున్న దేవపదవియైనను, నీయందుఁ బ్రేమయున్నచో నది దివ్యపదవి యగును. మమ కారముతోడనే కష్టములు, తుపానులు, యాతనలు, తన్నులాటలు పుట్టును. నేను ప్రేమించినచో నరకములోనైన బాధ

లేకుండును ? దుఃఖములు, వైకల్యములు, మనలను పేరిమింపు మని లేపు మేలుకొలుపులే !

సర్వజీవహృదయములతో నీ హృదయము కొట్టుకొనకున్న నీవు సర్వజ్ఞుఁడవు కాఁజాలవు. నామరూపముల వెనుక పర్వతశ్రేణుల గర్భమందు నదీనదగానమాధురిలోఁ, బయోదములమాటున, నక్షత్రముల నవ్వులలో, స్త్రీపురుషవిలాసములలో, సమస్తజీవరాశిలో నేకమై, అవిచ్ఛిన్నమై, నిరంతరము ప్రకాశించు నాత్మస్వరూపమును దిలకించుటే సర్వజ్ఞత్వము. సర్వములో సర్వభూతాంతరాత్మ నవలోకించు వానితో విశ్వమంతయుఁ జేయికలిపి సాయపడును."

శ్రీ కృ ష్ణా ర్ప ణ మ స్తు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

స ం పూ ర్ణ ము.

కాకినాడ : జోర్జి ప్రెస్ యందు ముద్రింపఁబడియె — 1952.